అనుదినం... జనస్వరం


www.navatelangana.com

నవతెలంగాణ

సోమవారం 14-10-2024


సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 238 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 10 పేజీలు | వెల : 6.50





భారతావనిలో ఆకలి కేకలు



సూచికలో దిగజారుతున్న స్థానం | పొరుగు దేశాల కంటే ఘోరం

పోషక లోపాలతో చిన్నారులు విలవిల

భారతావనిలో పట్టెడన్నం కోసం పేదల ఆక్రందనలు మిన్నంటుతున్నాయి. ఉజ్వల భవిష్యత్తుకు దారులు వేసుకోవాల్సిన చిన్నారులు గుప్పెడు మెతుకుల కోసం యాచకులుగా మారిపోతున్నారు. ప్రపంచ ఆకలి సూచిక (జీహెచ్‌ఐ)లో మన స్థానం నానాటికీ దిగజారిపోతోంది. 2024వ సంవత్సరానికి సంబంధించి విడుదలైన 19వ జీహెచ్‌ఐలో భారత్ 105వ స్థానంలో (మొత్తం 127 దేశాలు) నిలిచింది. పొరుగున ఉన్న నేపాల్, శ్రీలంక, మయన్మార్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ కంటే వెనుకబడిపోయింది.

న్యూఢిల్లీ : 'కన్‌సర్న్ డే వరల్డ్‌వైడ్', 'వెల్త్‌హంగర్‌లైఫ్' సంయుక్తంగా ప్రచురిస్తున్న జీహెచ్‌ఐ సిరీస్ తక్షణం దృష్టి సారించాల్సిన అంశాలను ప్రస్తావించింది. ఈ సంవత్సరపు నివేదికలో భారత్ స్కోరు 27.3. దేశంలో ఆకలి తీవ్రత ఏ స్థాయిలో ఉన్నదో ఇది ప్రతిబింబిస్తోంది. ఇటీవలి సంవత్సరాలలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య స్వల్పంగా పెరిగిందని నివేదిక తెలిపింది. 2016వ సంవత్సరపు జీహెచ్‌ఐ స్కోరు 29.3తో పోలిస్తే ప్రస్తుత స్కోరు మెరుగైనప్పటికీ అది ఇప్పటికీ 'తీవ్రత' కేటగిరీలోనే ఉంది. పొరుగు దేశాల కంటే బాగా వెనుకబడి ఉంది. అయితే 2000వ సంవత్సరపు స్కోరు 38.4, 2008 స్కోరు 35.2తో పోలిస్తే మాత్రం గణనీయమైన పురోగతి కన్పిస్తోంది. ఈ రెండు సందర్భాలలోనూ మన దేశం 'ఆందోళనకరం' అనే కేటగిరీలో ఉంది.

చిన్నారులలో పోషక లోపాలు

ఆకలి సూచికను గణించే పద్ధతిలో మార్పులు చేసినందున, సవరించిన సమాచారాన్ని వినియోగించినందున 2023వ సంవత్సరపు నివేదికతో తాజా నివేదికను పోల్చలేదు. కానీ 2000, 2008, 2016, 2024 నివేదికలలోని సమాచారాన్ని పోల్చారు. చిన్నారులలో పోషకాహార లోపం విషయంలో మన దేశం ఇప్పటికీ అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. ప్రపంచంలో మనదే అత్యధిక చైల్డ్ వేస్టింగ్ రేటు (ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలలో ఎత్తుకు తగిన బరువు లేకపోవడం). మన దేశంలో చిన్నారుల కుంగుబాటు రేటు 35.5 శాతంగా ఉంది. ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లలలో 2.9 శాతం మంది మృత్యువాత పడుతున్నారు. 13.7 శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు.

పిల్లల మరణాల విషయంలో మన దేశం 2000వ సంవత్సరం నుండి మెరుగుదల కన్పిస్తోంది. అయినప్పటికీ పోషకాహార లోపం తీవ్రమైన సమస్యగానే ఉండిపోతోంది. అలాగే ఐదు సంవత్సరాల లోపు చిన్నారులలో కుంగుబాటు, ఎత్తుకు తగిన బరువు లేకపోవడం అనే సమస్యలు కూడా ఆందోళనకరంగా ఉన్నాయి. ఈ సూచికలు తీవ్రమైన ప్రజారోగ్య సవాళ్లకు దారితీస్తున్నాయని నివేదిక తెలిపింది.

లక్ష్య సాధన అసాధ్యం

ప్రపంచ దేశాలలో ఆకలిని తగ్గించే విషయంలో 2016 నుండి పురోగతి లేదని నివేదిక ప్రస్తావించింది. 2030 నాటికి ఆకలిని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం కాకపోవచ్చునని స్పష్టం చేసింది. ఎందుకంటే ఆకలిపై 127 దేశాలలో అధ్యయనం జరపగా 42 దేశాలు నేటికీ 'తీవ్రత' లేదా 'ఆందోళనకరం' స్థాయిలోనే ఉన్నాయి.



ఈ మూడింటికీ లింకు

ఆకలి, వాతావరణ మార్పులు, లింగ అసమానత్వం...ఈ మూడింటి మధ్య నేరుగా సంబంధం ఉన్నదని నివేదిక ఎత్తిచూపింది. వివక్షాపూరితమైన నిబంధనలు, లింగ ఆధారిత హింస అనేవి మహిళలను, మైనారిటీలను ప్రమాదంలో పడేస్తున్నాయని, వారికి ఆహార, పోషకాహార భద్రత లభించడం లేదని తెలియజేసింది. ఈ సవాళ్లను అధిగమించేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలకు వాతావరణ మార్పుల ప్రభావం ప్రతిబంధకంగా ఉంటోందని నివేదిక చెప్పింది.

ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

నేడు మౌలాలిలోని ఇంటికి భౌతికకాయం

అనంతరం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగింత

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్, న్యూఢిల్లీ

ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, పౌర హక్కుల ఉద్యమకారుడు జీఎన్ సాయిబాబా(58) హైదరాబాద్‌లో కన్నుమూశారు. దీర్ఘకాలికంగా అనారోగ్యంగా బాధపడుతున్న సాయిబాబాను వారం రోజుల క్రితం నిమ్స్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి 8.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. సాయిబాబా కోరిక మేరకు, ఆయన కుటుంబ సభ్యులు భౌతికకాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించనున్నట్టు కుటుంబ సభ్యులు ప్రకటించారు. ఇప్పటికే సాయిబాబా కండ్లను ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేసినట్టు తెలిపారు. మృతదేహాన్ని నిమ్స్ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు తీసుకుంటారు. అక్కడి నుంచి తొమ్మిది గంటలకల్లా నగరంలోని గన్‌పార్క్ దగ్గర తీసుకెళతారు. అక్కడ దాదాపు పావుగంటపాటు ఉంచనున్నారు. అనంతరం 10 గంటలకు మౌలాలి కమాన్ దగ్గరలోని జవహర్‌నగర్‌లోని శ్రీనివాసా హైట్స్ అపార్ట్‌మెంటుకు చేరుస్తారు. అక్కడ మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. అ తర్వాత రెండున్నర గంటలకు ప్రదర్శనగా బయలుదేరి సికింద్రాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీకి తీసుకొస్తారు. శ్రద్ధాంజలి అర్పించాలనుకున్నా వారంతా ఆయా ప్రాంతాల్లో ఎక్కడికైనా రావచ్చని సాయిబాబా కుటుంబ సభ్యులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

90 శాతం అంగవైకల్యంతో వీల్‌చైర్‌కే పరిమితమైన సాయిబాబా, మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న ఆరోపణపై ఆయనతోపాటు మరో ఐదుగురికి మహారాష్ట్ర గడ్చిరోలి ట్రయల్‌కోర్టు జీవితఖైదు విధించడంతో 2017 నుంచి దాదాపు దొమ్మిదేండ్లపాటు నాగ్‌పూర్‌జైల్లోనే ఉన్నారు. అంతకుముందు కూడా ఆయన 2014 నుంచి 2016 వరకు జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సంవత్సరం మార్చి ఐదున ముంబయి హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించి నాగ్‌పూర్ జైలు నుంచి విడుదల చేసింది. మానవహక్కుల ఉద్యమకారుడు, రచయిత, విద్యావేత్తగా సాయిబాబా గుర్తింపు పొందారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి జైల్లో నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆయన ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. జైల్లో దుర్భరజీవితం ...3లో

ప్రజాఉద్యమాలకు తీరనిలోటు



ప్రొఫెసర్ సాయిబాబా మృతి పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం 90 శాతం అంగవైకల్యంతో ఉన్న సాయిబాబాను ఉపా చట్టం కింద సుదీర్ఘకాలంగా జైలులో నిర్బంధించింది. అర్బన్ నక్సలైట్‌గా ముద్రవేసింది. జైల్లో ఉన్న సమయంలో ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా సరైన వైద్యసౌకర్యం అందించలేదు. బీజేపీ ప్రభుత్వ విధానాలకు, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయిబాబా, దళిత, గిరిజన, వికలాంగుల హక్కుల నేతగా, విద్యావేత్తగా పేర్కొందారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు.

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

తెలంగాణ సాధనకు స్ఫూర్తి

అలయ్ బలయ్

సీఎం రేవంత్ రెడ్డి



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సహ ఐదు రాష్ట్రాల గవర్నర్లు హాజరు

రాజకీయ నేతలు తమ భాషను మార్చుకోవాలి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాధనలో అలయ్ బలయ్ కీలక భూమిక పోషించిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో హర్యానా గవర్నర్ దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన అలయ్‌బలయ్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. "తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధన ఆలస్యమైనప్పుడు రాజకీయ జేఏసీ ఏర్పాటుకు ఈ వేదిక స్ఫూర్తిగా ఉపయోగపడింది. జెండాలను, అజెండాలను పక్కనపెట్టి తెలంగాణ కోసం ఒక్కటయ్యేలా చేసింది. ఆర్ఎస్ఎస్ నుంచి ఆర్ఎస్‌యూ వరకు, కాంగ్రెస్ నుంచి కమ్యూనిస్టుల వరకు ఒక్కటై ప్రత్యేక రాష్ట్రం కోసం గళం విప్పారు" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణ సాధనలో కులాలకు, మతాలకు అతీతంగా సబ్బండ వర్గాలను ఐక్యం చేసి ముందుకు నడిపించిందని గుర్తు చేశారు. "తెలంగాణ ప్రజలకు అతి పెద్ద పండుగ దసరా. దసరా అంటే పాలపిట్ట, జమ్మి చెట్టు గుర్తుకు వస్తాయి. అలయ్ బలయ్ అంటే గుర్తుకు వచ్చేది బండారు దత్తాత్రేయ. రాజకీయాలకు అతీతంగా గౌరవించబడే దత్తాత్రేయ 19 ఏండ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అంతరించిపోతున్న తెలంగాణ కళలను భావితరాలకు అందిస్తున్నారు. ఆ వారసత్వాన్ని దత్తాత్రేయ కూతురు విజయలక్ష్మి కొనసాగిస్తున్నారు. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత" అని సీఎం ...3లో

సిటీలోకి మళ్లీ..



పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనాల క్యూ.

రూ.288 కోట్లు నొక్కేశారు

350 మంది డీలర్లతో కలసి జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్



32 సూట్‌కేస్ కంపెనీలు తెరిచి..

తప్పుడు పత్రాలతో కుంభకోణం

జగిత్యాలతో వెలుగు చూసిన అక్రమాలు

జగిత్యాల : తెలంగాణలో తప్పుడు పత్రాలతో చేసిన రూ.288 కోట్ల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దాదాపు 350 మంది డీలర్లతో కలసి జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను దోచేశారు. జగిత్యాల కేంద్రంగా ఓ జీఎస్టీ కన్సల్టెంట్ 32 సూట్ కేసు కంపెనీలు తెరచిన ఆయన.. వ్యాపారం చేయకుండానే చేసినట్లు కాగితాలపై చూపి భారీ మొత్తంలో ఐటీసీ నొక్కేశారు. గత ప్రభుత్వ హయాంలో ఏడాదిన్నరపాటు ఓ ట్యాక్స్ కన్సల్టెంట్ చేసిన వ్యవహారాన్ని జీఎస్టీ అధికారులు ఆలస్యంగా గుర్తించారు.

సారొస్తారొస్తారూ..!

కేసీఆర్ రాకకు డిసెంబర్‌లో ముహూర్తం

రేవంత్ దూకుడుకు హైడ్రా బ్రేక్?

ధృతరాష్ట్ర కౌగిలిలో కమలనాథులు

తరుముకొస్తున్న స్థానిక ఎన్నికలు

సత్తా చాటాలని ఉవ్విళ్ళూరుతున్న క్షేత్రస్థాయి నేతలు



ఎవరు అవునన్నా...కాదన్నా...రాష్ట్ర రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్)లేని లోటు స్పష్టంగానే కనిపిస్తున్నది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేక బొక్కబోర్లాపడిన బీఆర్ఎస్ పార్టీని పునరుత్తేజం చేయాల్సిన ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం రకరకాల రాజకీయ ఊహాగానాలకు తావిస్తుంది.

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేసీఆర్ స్థానాన్ని భర్తీ చేయాలని ఆయన కుమారుడు, మాజీ మంత్రికే తారకరామారావు (కేటీఆర్) తాపత్రయపడుతున్నారనేది జగద్విదితమే! దానికోసం ఆయన నానా అవస్థలు పడుతున్నారు. ఆయనకు తోడు మరో మాజీ మంత్రి టీ హరీశ్‌రావు కూడా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. బీఆర్ఎస్ పక్షాన వీరిద్దరే ప్రస్తుత రాజకీయ యవనికపైన నిత్యం కనిపిస్తున్నారు. మరోవైపు ప్రస్తుత రాజకీయాల్లో కేసీఆర్ సమకాలీకులు ఎవరూ ప్రధానపార్టీల్లో లేరు. దీనితో ఆయన తనకన్నా వయసులో, అనుభవంలో చిన్నవాళ్లయిన ఇతరపార్టీల నేతలతో విమర్శలు, నిందలు పడాల్సి వస్తున్నది. దీన్ని భరించలేకే కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ముఖం చాటేస్తున్నారని చెప్తున్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం అధికార కాంగ్రెస్‌పార్టీకి ఓ ఏడాది గడువు ఇచ్చాక, పరిపాలన చూసి, అప్పుడు తమ అగ్రనేత జనంలోకి వస్తారని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7వ తేదీతో కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఏ రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తవుతుంది. ఈ ఏడాదికాలంలో ప్రభుత్వ వైఫల్యాలను జనంలో ఎండగట్టేందుకు డిసెంబర్ 8 నుంచి 15వ తేదీ లోపు రాష్ట్ర వ్యాప్తంగా కనీసం నాలుగు అతిపెద్ద బహిరంగసభల్ని ఏర్పాటు చేసి, కేసీఆర్ 'గర్జన'ను వినిపించాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఫాంహౌస్‌లో తనను కలిసిన నేతలతో కేసీఆర్ కూడా ఇదే తరహా సిగ్నల్స్ ఇస్తున్నట్టు సమాచారం.

అయితే కాంగ్రెస్ శ్రేణులు దీన్ని కొట్టిపారేస్తున్నాయి. కేసీఆర్ శకం ముగిసినట్టే అని ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్‌పై మరింత పట్టు సాధించేందుకు మాజీ మంత్రి కేటీఆర్ అష్టకష్టాలు పడుతున్నారని ...2లో

మహేందర్ రెడ్డి నియామకం

రాజ్యాంగ విరుద్ధం

మాజీమంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శాసనమండలి చీఫ్‌విప్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి నియామకం రాజ్యాంగ విరుద్ధమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. మండలి చైర్మెన్ వద్ద అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉన్న వ్యక్తికి విప్‌గా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని చెప్పేందుకు ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. పీఏసీ ...3లో

ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి..

తండ్రి ఆత్మహత్య ● పండుగపూట విషాదం

● కుటుంబ కలహాలతోనే..?..కామారెడ్డి జిల్లాలో ఘటన



నవతెలంగాణ- తాడ్వాయి (లింగంపేట్)

కలహాలు.. ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. అభం శుభం ఎరగని పిల్లలను బావిలోకి తోసి తండ్రి సైతం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పండుగ వేళ.. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ...3లో



తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ సంఘం
సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనికి వినతి

- కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, ఉద్యోగులు, విద్యారంగం వంటి పలు సమస్యలపై విన్నపం

నవతెలంగాణ-ఖమ్మం

ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలు, ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తుల బకాయిలు, ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్ విధానం, విద్యా రంగంలో ఉన్న సమస్యల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ ఆదివారం ఖమ్మంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. తమ్మినేని వీరభద్రం సానుకూలంగా స్పందించి తమ పార్టీ ఆధ్వర్యంలో సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అయన్ను కలిసిన వారిలో.. సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కుప్పిశెట్టి సురేష్, మానుకోట జిల్లా రాష్ట్ర కౌన్సిలర్ సత్యనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి మల్లయ్య తదితరులు ఉన్నారు.

మెడికల్ సీట్లు సాధించిన గిరిపుత్రులకు.. మంత్రి సీతక్క సన్మానం

నవతెలంగాణ-ములుగు



ములుగు జిల్లాలోని అన్నంపెల్లి గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించగా ఆదివారం మంత్రి సీతక్క వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. తన సొంత గ్రామం జగ్గన్నపేట శివారు గ్రామం అన్నంపెల్లికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించడం సంతోషంగా ఉందన్నారు. మెడికల్ సీట్లు సాధించిన పోరిక సూరజ్, పోరిక సభపతి సౌరబ్ అభయానంద్, పోరిక సాయిరాం, పోరిక కళ్యాణిలను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, కుల సంఘ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కన్న కూతురిపై లైంగికదాడి

రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఘటన

నవతెలంగాణ-షాబాద్

కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తండ్రి కన్న కూతురును కాటేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని ఓ గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. షాబాద్ మండలంలోని ఓ గ్రామంలో అతని భార్య కొన్ని సంవత్సరాల క్రితం చనిపోయింది. ఆతనికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే అతడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కూతురు ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. కుమారుడు చిన్నవాడు. భార్య లేకపోవడంతో కూతుర్ని (మైనర్‌ను) భయపెట్టి లైంగికదాడికి పాల్పడేవాడు. ఎప్పటిలాగే శనివారం రాత్రి దసరా పండుగకు పీకలదాకా మద్యం తాగి వచ్చి, రాత్రి కూతుర్ని భయపెట్టి అరువకుండా నోట్లో బట్టపెట్టి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో కంగుతిన్న కొడుకు.. స్థానికుల సహాయంతో 100కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించి నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆదివారం అతనిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.



ఎంఎస్ఎన్ ఆర్గానిక్స్ పరిశ్రమను తరలించాలి

అఖిలపక్ష నాయకులతో కలిసి బీబీనగర్ వాసుల ధర్నా

నవతెలంగాణ-బీబీనగర్

యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలోని ఎంఎస్ఎన్ ఆర్గానిక్స్ పరిశ్రమను వెంటనే అక్కడ నుంచి తరలించాలని స్థానిక ప్రజలు అఖిలపక్ష నాయకులతో కలిసి పరిశ్రమ గేటు ఎదుట ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నాయకులు మాట్లాడుతూ.. కాలుష్య కారకమైన ఈ పరిశ్రమ వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, అంతేకాకుండా దీర్ఘకాల వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు, వృద్ధులు.. శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. పరిశ్రమను మూసివేసి ఇక్కడి నుంచి వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పరిశ్రమ మూసివేసేంత వరకు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు ధర్నా నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక పోలీసులు ధర్నా స్థలికి చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు నిర్వహించకుండా శాంతియుతంగా ధర్నా నిర్వహించాలని గ్రామస్తులు, నాయకులను కోరారు. ధర్నా అనంతరం పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులతో నాయకులు, పోలీసులు చర్చలు జరపగా.. ఒక్కరోజు గడువు ఇవ్వాల్సిందిగా యాజమాన్యం కోరడంతో గ్రామస్తులు ధర్నా విరమించారు. సమస్యను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని పరిశ్రమ ప్రతినిధులు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పొట్టోళ్ల శ్యామ్‌గౌడ్, గోళి పింగళిరెడ్డి, మల్లగారి శ్రీనివాస్, గోలి నరేందర్‌రెడ్డి, పొట్ట నవీన్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సురకంటిసత్తిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

హరీశ్ మీకిది తగదు

ఉల్లంఘనలు జరగలేదు : మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ శాసనమడలి చీఫ్‌విప్ సహా ఇతర నియామకాలు రాజ్యాంగబద్ధంగానే జరిగాయని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఎక్కడా ఉల్లంఘనలు జరగలేదన్నారు. మండలి చీఫ్‌విప్‌గా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిని ఎలా నియమించారని హరీశ్‌రావు ప్రశ్నించిన నేపథ్యంలో మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం తగదన్నారు. కేసీఆర్ హయాంలో హరీశ్‌రావు శాసనసభ వ్యవహారాల మంత్రిగా ఉన్న సమయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని, అప్పుడు రాజ్యాంగం గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు చెందిన 12 మంది ఎమ్మెల్యేలను ఒక్కొక్కరిగా బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని విమర్శించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే మండలి చైర్మెన్, అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాలు తీసుకుంటారని వివరించారు. సంప్రదాయం ప్రకారమే ప్రతిపక్ష సభ్యుడికి పీఏసీ చైర్మెన్ పదవి ఇచ్చినట్టు మంత్రి తెలిపారు. అనర్హత పిటిషన్ల అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందన్నారు.

సీఎం రాకతో మురిసిన 'కొండారెడ్డిపల్లి'

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- బతుకమ్మలు, బోనాలు, పూలతో.. సీఎంకు స్వాగతం

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి/వంగూరు



రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి మొదటిసారిగా ఆయన స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి శనివారం విచ్చేయడంతో గ్రామస్తులు ఆనందోత్సాహాలతో ఉప్పొంగిపోయారు. దసరా పండుగకు స్వగ్రామంలో జరుపుకోవడం కోసం ప్రతి ఏడాది రేవంత్‌రెడ్డికి కొండారెడ్డిపల్లికి వస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సీఎం అయ్యాక ఇప్పటివరకు ఆయన స్వగ్రామానికి రాలేదు. శనివారం ప్రత్యేక హెలీకాప్టర్‌లో కొండారెడ్డిపల్లికి చేరుకున్న సీఎంకు గ్రామస్తులు, అధికారులు, ప్రజాప్రతినిధులు.. బతుకమ్మలు, బోనాలు, గజమాలతో పూలవర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. అనంతరం రేవంత్‌రెడ్డి అందరినీ పలకరిస్తూ ముందుకు కదిలారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

గ్రామంలో రూ.72 లక్షలతో నిర్మించిన కొత్త పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మామిడి మొక్కను నాటారు. రూ.55లక్షలతో అత్యాధునికంగా నిర్మించిన అమర జవాను యాదయ్య స్మారక గ్రంథాలయం, రూ.58 లక్షలతో నిర్మించిన బీసీ సామాజిక భవనం, రూ.45 లక్షలతో నిర్మించిన పశువైద్యశాల భవనాలను సీఎం ప్రారంభించారు. అలాగే, గ్రామంలో రూ.18 కోట్లతో చేపట్టనున్న భూగర్భ మురుగు నీటి పైప్‌లైన్ నిర్మాణం, మురుగునీటి శుద్ధి కేంద్రం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ. 64 లక్షలతో ప్రయాణ ప్రాంగణం, ప్రధాన రహదారి మీదుగా విద్యుత్తు దీపాలంకరణ, రూ.32 లక్షలతో చిల్డ్రన్‌పార్కు, బహిరంగ వ్యాయామశాల పనులకూ సీఎం శంకుస్థాపనలు చేశారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ ఆలయంకు చేరుకున్న ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో పూజారులు స్వాగతం పలకగా... స్వామి వారి దర్శించుకున్నారు. దసరా పండుగ సందర్భంగా శనివారం సాయంత్రం గ్రామశివారులోని జమ్మిచెట్టు దగ్గరికి చేరుకొని పూజలు నిర్వహించి అందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి దసరా పండగను స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో జరుపుకొనేందుకు ముఖ్యమంత్రి రానున్న

దసరా పండుగను స్వగ్రామంలో జరుపుకున్న రేవంత్‌రెడ్డి

ఆయన వెంట నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేష్ రెడ్డి, స్థానిక ప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు.

అధికారులు, పోలీసుల అత్యుత్సాహంపై గ్రామస్తుల ఆగ్రహం

గ్రామంలో పుట్టి, తమ మధ్య పెరిగి.. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి.. కొండారెడ్డిపల్లికి రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కాగా, గ్రామస్తులు సీఎం వద్దకు వెళ్లి విజయదశమి శుభాకాంక్షలు తెలుపుదామనుకున్న స్థానికులకు నిరాశేమిగిలింది. సీఎంను కలవడం కాదుకదా.. కనీసం దూరం నుంచైనా చూడటానికి పోలీసులు అనుమతించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం ముందు అతివినయం ప్రదర్శిస్తూ తమను దూరంగా నెట్టి వేశారని కొంతమంది గ్రామస్తులు తెలిపారు. విలేకరులకూ ఎంట్రీ పాస్‌లు ఇవ్వకపోవడంపై మీడియా ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

గ్రీన్ ఎనర్జీ దిశగా ప్రపంచం అడుగులు

రైతులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు

- రైతుకు ప్రాధాన్యత కల్పిస్తూ బడ్జెట్‌లో రూ.73 వేల కోట్లు కేటాయింపు
- ఆయిల్‌ఫామ్ టన్ను గెలలు రూ.20 వేలకు పైగా మద్దతు ధరకు కృషి
- అశ్వారావుపేటలో 2.5 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

నవతెలంగాణ-అశ్వారావుపేట



నేడు ప్రపంచం థర్మల్ విద్యుత్ నుంచి గ్రీన్ విద్యుత్ దిశగా మారుతున్నదని, రాబోయే ఆరేండ్లలో రాష్ట్రంలో దాదాపు 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తున్నదని డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలోని రైతులు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో ఉన్న ఆయిల్‌పామ్ కర్మాగారం సొంత అవసరాలకు రూ.36.5 కోట్లతో నిర్మించిన 2.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని శనివారం మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలిసి భట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతుల కోసం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సును భట్టి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు ఆయిల్‌పామ్ సాగుపై అడిగిన సందేహాలను మంత్రులు, అధికారులు నివృత్తి చేశారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. ప్రతి పైసా ప్రజల కోసం ఖర్చు చేస్తూ ప్రతి కుటుంబంలో వెలుగులు నింపేలా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. విజయదశమి రోజు రైతుల సంక్షేమానికి పనిచేసే ఆయిల్ ఫెడ్ కంపెనీ బయో మాస్ ప్లాంట్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో గెలలు గానుగ పట్టే క్రమంలో వచ్చే ఉప ఉత్పత్తి అయిన గెలలు పీచు(చెత్త)తో 2.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్లాంట్ నిర్మించుకున్నట్టు చెప్పారు. రైతుల సంక్షేమం కోసం వ్యవసాయ శాఖకు రూ.73 వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. రైతులకిచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.18 వేల కోట్లతో చేశామని, మిగిలిన రైతులకు కూడా త్వరలో మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలతో వరదలు ముంచెత్తడంతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం సైతం అందజేశామని గుర్తు చేశారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గతంలో ఈ ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ అమ్మడానికి చాలా మంది ప్రయత్నించారని, రైతులకు లాభాలు అందించే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని అమ్మకుండా ఉంచేందుకు తాను కృషి చేశానని అన్నారు. ఆయిల్‌పామ్ పంటకు రూ.20 వేలకుపైగా ధర వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుం దని తెలిపారు. రైతులు బయట ఎక్కడా ఆయిల్‌పామ్ విత్తనాలు కొనుగోలు చేయొద్దని, ప్రభుత్వం సరఫరా చేసే మొక్కలు మాత్రమే వేయాలని తెలిపారు. నర్సరీలో అనేక పరీక్షలు నిర్వహించిన తర్వాత మాత్రమే రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. దేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, సన్నాలు పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించామని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో దేశంలోనే తెలంగాణ ఆయిల్‌పామ్ సాగులో ప్రథమ స్థానంలో ఉండ బోతుందని అన్నారు. గిరిజనుల ప్రాంతమైన అశ్వారావు పేట అడవులతో దట్టంగా ఉండేదని, నేడు ఆయిల్ పామ్ మొక్కలతో పచ్చగా ఉండటం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, వైరా, కొత్తగూడెం, అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్, కూనంనేని సాంబశివరావు, జారే ఆదినారాయణ, మట్ట రాగమయి, ఆయిల్ ఫెడ్, నీటిపారుదల అభివృద్ధి, వేర్ హౌస్, మార్క్ ఫెడ్ కార్పొరేషన్ల చైర్మెన్లు జంగా రాఘవరెడ్డి, మువ్వా విజయ్ బాబు, రాయల నాగేశ్వరరావు, కొత్వాల శ్రీనివాస రావు, వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యానశాఖ కార్యదర్శి, ఆయిల్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యస్మీన్ భాషా, సింగరేణి సీఎండీ బలరాం, కలెక్టర్ జితేష్ వీ.పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు బాబూరావు, మధుసూధన్ రావు, జే.కిషోర్(ఇన్‌చార్జి), ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్ రెడ్డి, ప్రాజెక్టులు మేనేజర్ ఎస్.శ్రీకాంత్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ పి.తిరుమలేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి.. 60 మందికి పైగా అస్వస్థత.. ఇద్దరు మృతి

నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావ్‌పేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

కలుషితమైన నీటిని తాగి 60 మందికి పైగా అస్వస్థతకు గురవగా.. వారిలో ఇద్దరు మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్‌రావ్ పేట్‌లో గురువారం జరిగిన ఈ ఘోర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ పురాతన బావి నీటితో.. మిషన్ భగీరథ నీటిని కలిపి వాటిని నీటి ట్యాంకుల్లో నింపి కాలనీలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాగా, గురువారం ఆ నీటిని తాగిన గ్రామస్తులు ఒకొక్కరుగా వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల్లో చేరడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన బోడి మహేష్(26), బాయికాడి సాయవ్వ(80) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందారు. మరో 60 మందికిపైగా వివిధ ఆస్పత్రుల్లో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. అయితే, తాగునీటి బావి పక్కనే చెత్తాచెదారం, మురుగు నీటితో నిండిన పెద్ద చెరువు ఉన్నది. ఆ కలుషిత నీరు.. భూగర్భం ద్వారా బావిలోకి చేరి ఉండొచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో ఆ బావిలో మూడ్రోజుల క్రితం కుక్కపిల్ల పడి మృత్యువాత పడినట్టు సమాచారం. దాంతో తాగునీరు కలుషితం అయి ఉండొచ్చని గ్రామస్తులు అంటున్నారు. కాగా, గ్రామస్తులు అస్వస్థతకు గురయిన ఘటన వెలుగులోకి రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామంలో హెల్త్‌క్యాంపు నిర్వహించి.. వైద్యం అందిస్తున్నారు. ఏరియా ఆస్పత్రిలో ఇప్పటివరకు 30 మందికి ట్రీట్మెంట్ చేసినట్టు హాస్పిటల్ సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

కానిస్టేబుల్ సాగర్ ఆత్మహత్య

గంజాయి చోరీ ఘటనలో సస్పెండ్

- ఇద్దరు ఎస్ఐలు, మరో వ్యక్తి కలిసి బలి పశువును చేశారంటూ సూసైడ్ వీడియో
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో ఘటన

నవతెలంగాణ-బూర్గంపాడు

గంజాయి కేసులో సస్పెండ్ అయిన కానిస్టేబుల్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏన్కూరుకు చెందిన భూక్యా సాగర్ బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేశాడు. ఈ ఏడాది జనవరిలో బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో పలు కేసుల్లో సీజ్ చేసిన గంజాయి మాయమైన ఘటనలో విచారణ చేపట్టిన అధికారులు కానిస్టేబుల్ సాగర్‌ను బాధ్యుడిని చేసి సస్పెండ్ చేశారు. ఈ క్రమంలో గంజాయి చోరీ కేసులో తనను బలి పశువును చేశారంటూ ఆరోపిస్తూ దసరా పండుగ రోజు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతూ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో పని చేసిన ఎస్ఐలు సంతోష్, రాజ్‌కుమార్, బూర్గంపాడుకు చెందిన గొనెల నాని అనే వ్యక్తితో కలిసి గంజాయిని అమ్ముకున్నారని సాగర్ తెలిపారు. గంజాయి మాయమైన విషయంలో ఎస్ఐల పాత్ర ఉందని, వారిని వదిలేసి తనపై చర్యలు తీసుకోవడంతో మనస్తాపానికి గురైనట్టు సాగర్ సూసైడ్ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. తన స్వగ్రామమైన ఏన్కూరులో శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా.. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మంకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పరకాల కాంగ్రెస్‌లో భగ్గుమన్న గ్రూపు విభేదాలు

కొండా వర్సెస్ రేవూరి మధ్య వర్గపోరు

నవతెలంగాణ-గీసుగొండ

వరంగల్ జిల్లా పరకాల కాంగ్రెస్ పార్టీలో గ్రూపు విభేదాలు భగ్గుమన్నాయి. మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రావూరి ప్రకాశ్‌రెడ్డి గ్రూపుల మధ్య ఫ్లెక్సీ వివాదం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ధర్మారంలో మంత్రి కొండా వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో రేవూరి ఫొటో లేకపోవడంతో రేవూరి వర్గీయులు వాటిని చింపివేశారు. దాంతో ఇరు గ్రూపుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దాంతో పోలీసులు రంగప్రవేశం చేసి కొండా వర్గీయులు 5మందిని అరెస్టు చేశారు. దాంతో కొండా వర్గీయులు పెద్ద ఎత్తున చేరుకొని వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి ధర్మారం వద్ద ధర్నా చేపట్టారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే తమపై అక్రమంగా కేసులు పెట్టించి వేధిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో ఒక్కసారిగా ఉమ్మడి జిల్లా రాజకీయాలు వేడెక్కాయి.

సారొస్తారొస్తారూ..!

(మొదటిపేజీ తరువాయి)



చెప్పున్నారు. ఇప్పుడు ఆపార్టీకి పెద్ద దిక్కులుగా కేటీఆర్, హరీశ్‌రావు మాత్రమే మిగిలి ఉన్నారనీ, కేసీఆర్ కేవలం ఉత్సవ విగ్రహమేనని విమర్శలు చేస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు, మంత్రులైతే అసలు కేసీఆర్ బతికే ఉన్నారా...అని లేని సందేహాలను ప్రజలకు కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం చేపట్టిన పనులకు సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. తమ లక్ష్యాన్ని సమర్థించుకొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా, ఈ విషయంలో మాత్రం ప్రజలు ఆయన్ని విశ్వసించే పరిస్థితులు క్షేత్రస్థాయిలో కనిపించట్లేదు. రైతు రుణమాఫీలోనూ కాంగ్రెస్ సర్కారుకు అనేక చిక్కుముడులు పడుతూనే ఉన్నాయి. క్రమంగా ఆపార్టీపై, రేవంత్‌రెడ్డి నాయకత్వంపై ప్రతిపక్షాలు దాడిని పెంచాయి. రైతు రుణమాఫీ కాగానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావించిన ప్రభుత్వం ఇప్పుడు కొద్దిగా వెనుకంజ వేస్తున్నట్టు కనిపిస్తున్నది.

అయితే రాష్ట్ర ఎన్నికల సంఘం మాత్రం కచ్చితంగా అక్టోబర్ చివరి వారం లేదా నవంబర్ రెండో వారంలోపు స్థానిక ఎన్నికల్ని నిర్వహించకతప్పదని తేల్చిచెప్తున్నది. ఆ మేరకు ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని రాజకీయపార్టీల నేతలతోనూ సమావేశాలు నిర్వహించింది. వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించింది. బీసీ రిజర్వేషన్ల ఖరారుపై కూడా ఎన్నికల సంఘం స్పష్టమైన వైఖరినే ప్రకటించింది. రిజర్వేషన్ల ఖరారు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదనీ, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేలోపు ఆ జాబితా ఇస్తే, అమలు చేస్తామనీ, లేకుంటే పాతపద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించేస్తామని తేల్చిచెప్పింది. దీనితో స్థానిక సమరం దాదాపు ఖాయంగానే కనిపిస్తున్నది.

ఈ దశలో బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేసుకోవడంపై దృష్టిసారించింది. ఆపార్టీ ప్రజాందోళనల్ని తాజాగా జిల్లాలకు విస్తరింపచేసింది. ఈ రేస్‌లో తామెక్కడ వెనుకబడి పోతామో అని భావిస్తున్న బీజేపీలో నేతల మధ్య అనైక్యత, ఆధిపత్యధోరణి పార్టీ శ్రేణులకు తలనొప్పిగా మారింది. చివరకు ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి 'పార్టీలో నా మాటే ఫైనల్' అని పత్రికాముఖంగా చెప్పుకొనే స్థితికి దిగజారింది. పార్టీలో పెద్ద తలలుగా ఉన్న డాక్టర్ కే లక్ష్మణ్ ప్రస్తుతం 'టచ్ మీ నాట్' అనే ధోరణిలోనే వ్యవహరిస్తున్నారు. ఇక బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వరరెడ్డి తనకు పార్టీలో ప్రాధాన్యత ఇవ్వట్లేదనీ, పార్టీ ఆఫీసులో మాట్లాడాలంటే, అనుమతి తీసుకోవాలని చెప్తున్నారని వాపోతున్నారు. దీనితో ఆయన అసెంబ్లీ ప్రాంగణంలోని బీజేపీ శాసనసభాపక్ష కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్నారు. మరో కేంద్రమంత్రి, బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ తన దూకుడు మాత్రం తగ్గించట్లేదు. జనంలోకి హిందుత్వ అజెండాను చొప్పించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అంత దూకుడు వద్దని పార్టీ అధినేత జీ కిషన్‌రెడ్డి చెప్తున్నా...'డోంట్ కేర్' అంటూ నోటికొచ్చిన మాటలు మాట్లాడుతూనే ఉన్నారు. ఇక మరో ఎమ్మెల్యే రాజాసింగ్...తాను పార్టీలో సీనియర్ అయినా పట్టించుకోవట్లేదని వేరు కుంపటి పెట్టుకొని, తనగోల తాను పడుతున్నాడు. దీంతో పార్టీని ఏకతాటిపైకి తేవడం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి తలనొప్పిగా మారింది.

ఇక వామపక్షాలు మాత్రం ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజాసమస్యలపై కలిసొచ్చే అంశాల్లో ఐక్య ఉద్యమాలు చేపడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా సీపీఐ(ఎం) భూపోరాటాలను ఉధృతం చేసింది. డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఎప్పుడిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంది. వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై నిరసన గళాన్ని ప్రభుత్వానికి వినిపిస్తున్నది. మొత్తానికి పార్లమెంటు ఎన్నికల్లో పరువు పోగొట్టుకున్న బీఆర్ఎస్, ఊహించని విధంగా 8 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించిన బీజేపీ రాష్ట్రంలో రెండోస్థానంలో నిలవడం కోసం అష్టకష్టాలు పడుతున్నాయి. దీనికి స్థానిక ఎన్నికలు కొలమానంగా నిలిచి, ప్రజాభిప్రాయాన్ని వెల్లడించనున్నాయి.

మానుకోట కలెక్టరేట్‌లో కాల్పులు

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మృతి

- ఆత్మహత్యనా..? గన్ మిస్‌ఫైరా..?
- విచారణ జరుగుతున్న ఎస్పీ

నవతెలంగాణ-మహబూబాబాద్



మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం తుపాకి కాల్పుల్లో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గుడి బోయిన శ్రీనివాస్(53) మృతి చెందారు. కాగా, తన గన్‌తో ఆత్మహత్య చేసుకున్నారా లేక గన్ మిస్ ఫైర్ అయిందా అనేది తెలియడం లేదు. జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేక స్వయంగా విచారణ నిర్వహిస్తున్నారు.

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో క్యాంటీన్ పక్కనున్న స్ట్రాంగ్ రూమ్‌లో ఎన్నికలకు సంబంధించిన విలువైన సామగ్రి నిల్వ చేశారు. ఇక్కడ ఒక పోలీస్ అవుట్ పోస్టునూ ఏర్పాటు చేసి 24 గంటలు కానిస్టేబుల్‌ను కాపలా పెట్టారు. ఆదివారం అక్కడ ఏఆర్ కానిస్టేబుల్ శ్రీనివాస్ గన్‌తో కాపలాగా ఉన్నారు.

ఆదివారం సాయంత్రం కాల్పుల శబ్దం రావడంతో కలెక్టరేట్ వాచ్‌మెన్ వెళ్లి చూడగా శ్రీనివాస్ రక్తమడుగులో పడి మృతి చెంది ఉన్నారు. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేక స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. శ్రీనివాస్‌కు భార్యతో విభేదాలు ఉన్నట్టు ఎస్పీ తెలిపారు. శ్రీనివాస్ భార్య వరలక్ష్మి కొంతకాలంగా శ్రీనివాస్‌తో విభేదించి పుట్టింట్లో ఉంటుంది.

వీరికి ఒక కొడుకు సుశాంత్ ఉన్నారు. శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు అంటుండగా.. గన్ మిస్‌ఫైర్ అయిందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భార్యాభర్తల మధ్య ఆత్మహత్య చేసుకునే అంత పెద్ద విభేదాలు ఏమున్నాయనే కోణంలోనూ విచారణ నిర్వహిస్తున్నారు. కాగా, మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు.

మనపై ఉత్ప్రేరకాల ప్రభావం

ఉమెన్ హెల్త్

నమస్కారం అండీ! అందరూ కులాసాగా ఉన్నారని ఆశిస్తున్నాను. మీరు మీ భావోద్వేగ ఉత్ప్రేరకాల(ట్రిగ్గర్స్)ను గుర్తించారని భావిస్తున్నాను. మరి అవి ఎలా పనిచేస్తాయో తెలుసుకుంటున్నారా? మన ఉత్ప్రేరకాలను గుర్తించడం ఎంతో ముఖ్యం. గత వారంలో ఈ విషయంపై మాట్లాడుకున్నాం కదా! ఈ వారం మరిన్ని విశేషాలు తెలుసుకుందాం...

ఈ ఉత్ప్రేరకాల గురించి ఎవరైనా మాట్లాడినప్పుడు, మనకు వారిపై కోపం, అపోహలు ఏర్పడతాయి. ఈ అపోహల వల్ల క్షోభ, resentment వంటి భావాలు పుట్టుకొస్తాయి. తద్వారా సంబంధాలు దెబ్బతింటాయి. దాంతో పాటు మన అవసరం తక్కువగా అనిపించవచ్చు. మానవ సంబంధాలలో దూరం పెరుగుతుంది. నిజానికి ఈ ఉత్ప్రేరకాలు మనపై ఎంత ప్రభావం చూపిస్తున్నాయో మనం గుర్తించలేం. ఉత్ప్రేరకం చలించినప్పుడు మనలో కొన్ని మార్పులు చోటు చేసుకుంటాయి. గుండె వేగంగా కొట్టుకోవడం, ముఖం ఎర్రగా మారడం, ఊపిరి పీల్చడం వేగం అవ్వడం వంటివి జరుగుతాయి. దీనిని heightened emotional state లేదా fight or flight response అంటారు. ఈ సందర్భంలో flight mode గురించి కూడా మాట్లాడాలి.




తార్కిక ఆలోచన కోల్పోతాం

flight modeకి వెళ్లినప్పుడు, మనం తార్కిక ఆలోచనలను కోల్పోతాము - శాస్త్రీయంగా దీనిని "amygdala hijack" అంటారు. rational brain పనిచేయడం ఆగిపోతుంది. emotional brain మాత్రమే స్పందిస్తుంది. అందువల్ల flight modeలో ఉన్నప్పుడు మనం awareness కలిగి ఉండడం మొదటి దశ. తరువాత pause (దీర్ఘంగా శ్వాస తీసుకోవడం, పది నుండి ఒకటి వరకు లెక్కపెట్టడం) చేయడం, భావాన్ని గుర్తించడం, నెమ్మదిగా భావాన్ని అనుభవించడం, నర్వస్ సిస్టమ్‌ను సమీకరించడం ద్వారా మన భావాలు సులభంగా విడుదల అవుతాయి. ఈ విధానం ద్వారా మనం చాలా అసౌకర్యకరమైన పరిస్థితులను నివారించగలుగుతాం. ఇతరులను బాధపెట్టడం నివారించగలుగుతాం. అలాగే మనం ప్రశాంతంగా ఉండగలుగుతాం. మన భావాలను అర్థం చేసుకుని బయటి పరిస్థితుల ప్రభావం లేకుండా మనం బలంగా ఉండగలుగుతాం.

ఆలోచనలను మార్చు కుందాం

ముఖ్యమైన విషయం ఏమిటంటే మనం ఎప్పుడూ బయటి పరిస్థితులను మార్చలేము. కానీ మనలోపల మార్పు చేయడం, లోటస్ ఆకుల వంటి భావాలను అభివృద్ధి చేయడం ఎంచుకోవచ్చు. మరింతగా మనం ఈ ప్రయాణంలో మన ఆలోచనలను మార్పు చేయడానికి కూడా ప్రయత్నించాలి. ప్రతీ రోజూ కొన్ని క్షణాలు మీకు నచ్చిన సాధనలను చేస్తూ, చిత్తశుద్ధిని పెంపొందించుకోండి. ధ్యానం, జ్ఞాన బోధనలు లేదా రికార్డు చేసిన భావనలు - ఇవన్నీ మన భావోద్వేగాలను గుర్తించడానికి సహాయపడతాయి.





మనపై దృష్టిపెడదాం

సారాంశం ఏమిటంటే మన ఉత్ప్రేరకాలను గుర్తించుకుందాం. amygdala hijack నుండి తప్పించుకోవడానికి pause చేయడం అభ్యసించుకుందాం. అసౌకర్యకరమైన పరిస్థితులను నివారించుకుందాం. చివరగా మనపైన దృష్టి పెట్టి, భావోద్వేగ మాస్టరీని పొందుదాం. దీని కోసం మనం ఈ రోజు మొదటి అడుగు వేద్దాం! ఈ ప్రయాణంలో మనం ఒకరికొకరు సహాయపడితే మన ప్రగతిని మరింత వేగవంతం చేయగలుగుతాం. ప్రతిదీ మన చేతిలోనే ఉంది. మనలోని శక్తిని కనుగొనవలసిన సమయం ఇది! మనందరం కలిసి ఈ యాత్రను అందంగా సాగిద్దాం.

Dr.Prathusha. Nerella
MD(General Medicine) CCEBDM; CCGDM; NLP; FID
Senior General Physician
Positive Psychologist certified Nutritionist
Diabetes And Lifestyle Expert
Pranic Healer Chiief Holistic Health Consultant And Medical Director @ Praveha General, Diabetes And Lifestyle Clinic - A Holistic Centre With Integrated Approach.
Ph: 8897684912/040-49950314



ఇట్ల చేద్దాం

మిక్సీజార్ బ్లేడ్స్ పదునుగా ఉండాలంటే దాంట్లో కొద్దిగా ఉప్పువేసి తిప్పాలి.





వంటింట్లో బొద్దింకలు పోవాలంటే కొద్దిగా బోరిక్ పౌడర్‌ను వంటింటి మూలల్లో ఉంచాలి.

చిన్న మార్పులతో...



ఫంక్షన్ చిన్నదా, పెద్దదా అనే తేడా లేదు.. ఏ అకేషన్ అయినా సరే మహిళలు స్పెషల్ గా కనిపించాలని కోరుకుంటారు. ఇందు కోసం కొన్ని రోజుల ముందు నుంచి రకరకాల బ్యూటీ టిప్స్ ఫాలో అవుతుంటారు. అసలైన ఫంక్షన్ రోజున లేచింది మొదలు మేకప్ చేసుకుంటూనే ఉంటారు. ఇది సెలబ్రిటీల నుంచి, సామాన్యుల వరకు అందరూ చేసే పనే. అయితే మేకప్ వేసుకోవడం అన్ని సందర్భాల్లోనూ సాధ్యం కాకపోవచ్చు. పైగా ఖర్చుతో కూడుకున్న పనికూడా.. అంతేకాదు అదే పనిగా మేకప్ వేసుకున్నా చర్మం పాడవుతుంటుంది. కొన్ని రకాల స్కిన్ సమస్యలు వస్తుంటాయి. అయితే మేకప్ లేకుండా కూడా ముఖాన్ని అందంగా, కోమలంగా తీర్చిదిద్దుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అయితే దీనికోసం కొన్ని టిప్స్ పాటించాలని సూచిస్తున్నారు. అవి ఏమిటో ఈ రోజు తెలుసుకుందాం..

రోజువారి జీవనశైలిలో చిన్నపాటి మార్పులతో సహజసిద్ధమైన మెరుపు పొందవచ్చు. దీని కోసం ప్రతిరోజు 8 గ్లాసుల నీళ్లు తాగడం తప్పనిసరి. దీనివల్ల శరీరంలోని టాక్సిన్లు బయటకి వెళ్లిపోతాయి. దాంతో చర్మం సహజంగా కాంతిని సంతరించుకుంటుంది.

వారానికి రెండు సార్లు అయిన ఐస్ క్యూబ్స్ తో ముఖంపై మర్దన చేసుకుంటూ ఉండాలి. ఐదు నిమిషాల పాటు ఇలా చేస్తే చర్మం తేలికగా మారుతుంది. ముడతలు తగ్గి చర్మం బిగుతుగా తయారవుతుంది. దద్దుర్లు ఉంటే తగ్గిపోతాయి.

మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ వల్ల కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడతాయి. రోజు నిద్ర పోయే ముందు అలోవెరా జెల్ తో గాని, కొబ్బరి నూనెతో కానీ కళ్ల కింద మర్దన చేయాలి.

నిద్రపోయే ముందు ముఖాన్ని మంచినీటితో శుభ్రంగా కడుక్కోవాలి.. అప్పుడు ముఖంపై చేరిన దుమ్ము కణాలు తొలగిపోతాయి. దీని ద్వారా చర్మం మృదువుగా కనిపిస్తుంది.

ఎన్సీపీ నేత దారుణ హత్య

మహారాష్ట్రలో రాజకీయ ప్రకంపనలు
శాంతిభద్రతలు క్షీణించాయని ప్రతిపక్షాల ఆరోపణ
తమ పనేనన్న బిష్ణోయ్ గ్యాంగ్

ముంబయి : మహారాష్ట్రలో ఎన్సీపీ నేత, మాజీ మంత్రి బాబా సిద్దిఖీని (66) దుండగులు శనివారం రాత్రి కాల్చి చంపిన ఘటన రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఎమ్మెల్యే అయిన కుమారుడు జీషన్ సిద్దిఖీ నివాసం ఎదుట ఆయనపై దాడి జరిగింది. దుండగులు ఆయనపై మొత్తం ఆరు రౌండ్లు కాల్పులు జరిపారని, వాటిలో మూడు ఆయనకు తగిలాయని పోలీసులు తెలిపారు. కాల్పుల కోసం ఉపయోగించి 9 ఎంఎం తుపాకీని వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జరిగిన వెంటనే సిద్దిఖీని లీలావతి ఆస్పత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. సిద్దిఖీ భౌతిక కాయానికి ఆదివారం రాత్రి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. సిద్దిఖీ హత్యకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో హంతకుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన అని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే చెప్పారు. నిందితులు ఉత్తరప్రదేశ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన వారని తెలిపారు. నిందితులను గుర్మయిల్ సింఘా, ధర్మరాజ్ కశ్యప్‌గా గుర్తించారు. గుర్మయిల్ నాలుగు సంవత్సరాలుగా జైలులోనే ఉన్నాడని, బెయిల్ ఎలా వచ్చిందో తెలియడం లేదని అతని తల్లి చెప్పారు. అతనితో తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె తెలిపారు. ఈ ఘటన వెనుక గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ప్రమేయంపై కూడా ముంబయి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలో విచారణలో సహకరించేందుకు ఢిల్లీ పోలీసులు ప్రత్యేక బృందాన్ని పంపారు. ఫోరెన్సిక్ నిపుణుల బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించింది. సిద్దిఖీని చంపింది తామేనని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. కూపర్ ఆస్పత్రిలో సిద్దిఖీ భౌతిక కాయానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం స్వగృహానికి తరలించారు.

ప్రతిపక్షాల మండిపాటు

పదిహేను రోజుల క్రితమే సిద్దిఖీని హత్య చేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. సిద్దిఖీ కదలికలపై రెక్కీ కూడా నిర్వహించారు. దీంతో ఆయనకు వై కేటగిరీ భద్రత కల్పించారు. సిద్దిఖీ మృతిపై పలువురు ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వారు ఆరోపించారు. ఘటనకు రాష్ట్ర హోం మంత్రి బాధ్యత వహించాలని ప్రతిపక్ష నేత విజయ్ వడెట్టివార్ డిమాండ్ చేశారు. ముంబయి నగరం మరోసారి అండర్ వరల్డ్ గుప్పిట్లోకి వెళుతోందని ఈ ఘటన రుజువు చేస్తోందని కాంగ్రెస్ నేత తారిక్ అన్వర్ ఆందోళన వ్యక్తం చేశారు. భద్రత ఉన్నప్పటికీ సిద్దిఖీని కాల్చి చంపారని, అలంటప్పుడు సామాన్యుల గతేమిటని కాంగ్రెస్‌కే చెందిన మరో నేత రషీద్ అల్వీ ప్రశ్నించారు. ఇది దురదృష్టకరమైన సంఘటన అని శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ చెప్పారు. రాజకీయ నాయకత్వం కారణంగా మహారాష్ట్ర అధికారులు గతంలో ఎన్నడూ లేని విధంగా నైతిక స్థైర్యాన్ని కోల్పోయారని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు. ముంబయికి ఇద్దరు పోలీస్ కమిషనర్లు ఉన్నప్పటికీ నగరం సురక్షితంగా లేదని శివసేన (ఉద్ధవ్) అధినేత ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ) అధ్యక్షుడు ప్రకాష్ అంబేద్కర్ డిమాండ్ చేశారు. సిద్దిఖీ హత్య వెనుక పెద్ద కుట్ర జరిగిందని సమాజ్‌వాదీ పార్టీ ప్రతినిధి ఫకృల్ హసన్ చంద్ అభిప్రాయపడ్డారు. ఈ ఘటనతో మహారాష్ట్ర ప్రజలే కాక దేశం యావత్తూ భయభ్రాంతులకు గురవుతోందని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు.

కస్టడీ కోరిన పోలీసులు

బాబా సిద్దిఖీ హత్య కేసులో ఒక నిందితుడి వయసును ధృవీకరించేందుకు పరీక్ష నిర్వహించాలని పోలీసులు నిర్ణయించారు. నిందితుల వద్ద 28 బులెట్లు లభించాయి. నిందితులను సుమారు ఎనిమిది గంటల పాటు ప్రశ్నించిన అనంతరం వారికి ముంబయిలోని జీటీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆ తర్వాత న్యాయస్థానంలో హాజరు పరిచారు. విచారణ నిమిత్తం వారిని 14 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరారు.





(ఫైల్)

ఎవరీ సిద్దిఖీ ?

ఈ సంవత్సరం ప్రారంభంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సిద్దిఖీ ఇటీవలే అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. శాసనసభలో బాంద్రా వెస్ట్ స్థానానికి ఆయన మూడుసార్లు ప్రాతినిధ్యం వహించారు. 2014 ఎన్నికలలో బీజేపీ చేతిలో ఓటమి చవిచూశారు. 1992-97 మధ్యకాలంలో ఆయన రెండుసార్లు మున్సిపల్ కార్పొరేటర్‌గా కూడా పనిచేశారు. 2000వ సంవత్సరం ప్రారంభంలో కాంగ్రెస్-ఎన్సీపీ ప్రభుత్వంలో సహాయ మంత్రిగా వ్యవహరించారు. సిద్దిఖీ రాజకీయ నాయకుడే కాదు. ప్రైవేటు పార్టీలు నిర్వహించడంలోనూ ఆయనకు పేరుంది. బాలీవుడ్ నటులు సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్ మధ్య తలెత్తిన వివాదాన్ని ఆయనే పరిష్కరించారు. వారి మధ్య సంధి కుదిర్చారు. సల్మాన్‌కు సిద్దిఖీ మంచి మిత్రుడు కూడా.

తెలంగాణ సాధనకు స్ఫూర్తి అలయ్ బలయ్

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు.

అలయ్ బలయ్ ఐక్యతకు ప్రతీక: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

అలయ్ బలయ్ ఐక్యతకు ప్రతీకని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా విజయదశమి పండుగను జరుపుకుంటారన్నారు. అదే స్ఫూర్తితో ఈ కార్యక్రమం మరింత ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు మాట్లాడుతూ అందరూ కలిసి మెలిసి ఉండాలన్న సంకల్పమే అలయ్ బలయ్ కార్యక్రమమని తెలిపారు. సమాజంలో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హర్యానా గవర్నర్ దత్తాత్రేయ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసిమెలిసి ఉండాలని అభిప్రాయ పడ్డారు. అభివృద్ధిలో రెండు రాష్ట్రాలు దేశంలో నెంబర్‌వన్‌గా నిలవాలన్నారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్. విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే ఈ వేడుకను ఒక్క హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ముఖ్య పట్టణాలకు విస్తరింప జేయాలని సూచించారు. ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న ఈ వేడుక భవిష్యత్‌లో మరింత ఆదరణ పొందాలని ఆకాక్షించారు. ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మిత్ సింగ్, మేఘాలయ గవర్నర్ విజయ్ శంకర్, రాజస్థాన్ గవర్నర్ హరిభౌ కిషన్‌రావ్ బాగ్డే తమ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా కళాకారుల సంప్రదాయ నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. పోతురాజుల విన్యాసాలు, హైదరాబాదీ సంప్రదాయ వాయిద్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గతానికి భిన్నంగా రాష్ట్రంలోని చేతి వృత్తులైన చేనేత, కమ్మరి, కుమ్మరి, వండ్రంగి తదితర వృత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మంత్రి పొన్నం ప్రభాకర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు వివిధ పార్టీల నుంచి పలువురు నేతలు హాజరయ్యారు. బీజేపీ నుంచి డికె అరుణ, ఈటల రాజేందర్, లక్ష్మణ్, కాంగ్రెస్ నుంచి పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్, వి.హన్మంతరావు, కె.కేశవరావు, బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాసగౌడ్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, టీజేఎస్ ఎమ్మెల్సీ ప్రొ.కోదండ రాం, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఏపీ మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు.

దారి తప్పుతున్న రాజకీయాలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో రాజకీయాలు దారితప్పుతున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికలప్పుడు రాజకీయాలు, తర్వాత పేద ప్రజల సంక్షేమంపై దృష్టి పెట్టాలి. కానీ ప్రస్తుతం తెలంగాణలో అది లోపించింది. గత కొన్నాళ్లుగా రాజకీయ పార్టీల మధ్య దూషణల పర్వం కొనసాగుతోంది. నేతలు మాట్లాడుతున్న భాషను ప్రజలు అసహ్యించుకుంటున్నారు. ఇప్పటికైనా వారు తమ తీరును మార్చుకోవాలి. దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ అలయ్ బలయ్ ద్వారానైనా వారిలో మార్పు రావాలని కోరుకుంటున్నా" అని వ్యాఖ్యానించారు. అన్ని పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు స్వచ్ఛందంగా తమను తాము మార్చుకోవాలని అభిప్రాయపడ్డారు.

ఇద్దరు పిల్లలను బావిలోకి తోసి..

(మొదటిపేజీ తరువాయి)

మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ధర్మబాద్ మండలం నాయ్‌గావ్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి(37).. తాడ్వాయి మండలం నందివాడకు చెందిన అపర్ణను పదేండ్ల క్రితం పెండ్లి చేసుకొని ఇల్లరికం వచ్చాడు. వీరికి ఇద్దరు కొడుకులు విగ్నేష్ (6), అరవింద్ (4) ఉన్నారు. కాగా దసరా వేడుకల్లో భాగంగా బంగారం (జమ్మి ఆకు) పంచుతానని శనివారం సాయంత్రం 7 గంటల సమయంలో పిల్లలను తీసుకొని బయటకు వెళ్లాడు. అయితే ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం ఉదయం గ్రామసమీపంలోని ఓ వ్యవసాయ బావిలో ఇద్దరు చిన్నారుల మృతదేహాలను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబీకులు వచ్చి చూడగా.. విగ్నేష్, అరవింద్‌గా గుర్తించారు. కాగా శ్రీనివాస్‌రెడ్డికి చెందిన సెల్‌ఫోన్, చెప్పులు బావి వద్దనే ఉండటంతో ఆయన కూడా బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావించి బావిలోని నీటిని పోలీసులు తోడించడంతో అతని మృతదేహం లభ్యమైంది. కాగా కుటుంబ కలహాలతోనే తన ఇద్దరు కొడుకులను బావిలోకి తోసి ఆయన కూడా ఆత్మహత్య చేసుకొని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, తాడ్వాయి ఎస్ఐ, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



(ఫైల్)

డబ్బుల విషయంలో గొడవలు..?

డబ్బుల విషయంలో కొన్ని రోజులుగా అత్తమామతో పాటు భార్యతో గొడవలు జరుగుతున్నట్టు సమాచారం. వీరి కుటుంబానికి పది ఎకరాల భూమితో పాటు బర్రెలు ఉన్నాయి. అటు వ్యవసాయంతో పాటు ఇటు పశువులను చూసుకుంటూ జీవిస్తున్నారు. ఇల్లరికం వచ్చిన తనను విస్మరిస్తున్నారని, డబ్బులు ఇవ్వడం లేదని పలువురి వద్ద వాపోయినట్టు తెలుస్తోంది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురై తన పిల్లలను తీసుకెళ్లి వారిని బావిలోకి తోసి తాను ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని స్థానికులు తెలిపారు.

ప్రొఫెసర్ సాయిబాబా కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

గడిపారు. పలుమార్లు దరఖాస్తు పెట్టుకున్నా అటు కేంద్రం ప్రభుత్వం గానీ, ఇటు మహారాష్ట్ర ప్రభుత్వం గాని వైద్య సహాయం అందించకుండా ఇబ్బందులపాల్జేశాయి.

జీవిత చరిత్ర

గోకరకొండ నాగసాయిబాబా 1967లో జన్మించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అమలాపురంలో పేద రైతు కుటుంబంలో జన్మించాడు. ఇంటికి విద్యుత్ సౌకర్యం కూడా లేదు. ఐదేండ్ల వయసులోనే పోలియో సోకి రెండు కాళ్లూ పూర్తిగా దెబ్బతిన్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ, ఢిల్లీ యూనివర్శిటీ (డియూ)లో ఆయన పీహెచ్‌డి పూర్తి చేశాడు.

సవాళ్లు ఎదురైనా పోరాటం ఆపలేదు తమిళనాడు సీఎం స్టాలిన్

ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మృతికి సంతాపం తెలియజేస్తున్నా. ఆయన మరణం పౌరహక్కుల ఉద్యమానికి తీరనిలోటు. అణగారినవర్గాలపై జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించారు. తన స్వేచ్ఛకు, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లినా అవిశ్రాంతంగా పోరాడారు. ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

సాయిబాబా మరణం బాధాకరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హక్కుల ఉద్యమకారుడు, ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా అకాల మరణం బాధాకరం. ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి. దేశంలోని ప్రజా ఉద్యమాలకు సాయిబాబా మరణం తీరనిలోటు.

మానవతావాది : సీతక్క

ప్రజల పక్షపాతి, పౌరహక్కుల నేత జీఎన్ సాయిబాబా మృతిపట్ల మంత్రి ధనసరి అనసూయ సీతక్క సంతాపం తెలిపారు. సమాజంలో అసమానతలను రూపుమాపేందుకు జీవితాంతం పోరాడిన మానవతావాది సాయిబాబా అని చెప్పారు. తప్పుడు కేసుల్లో సుదీర్ఘకాలం జైల్లో ఉన్నారని గుర్తు చేశారు.

ప్రజాసంఘాల సంతాపం

సాయిబాబా మరణం పట్ల పలు ప్రజా సంఘాలు సంతాపం తెలియజేశాయి. ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని వ్యాఖ్యానించాయి. అంగవైకల్యంతో బాధపడుతూ ప్రజల పక్షాన నిలిచారని గుర్తు చేశాయి. సంతాపం తెలిపిన సంఘాల నాయకుల్లో అఖిల భారత లాయర్స్ యూనియన్(ఐలు) రాష్ట్ర కమిటీ, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ, ప్రధానకార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎం. సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య ఉన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే విద్యావ్యవస్థ నిర్వీర్యం

ఎంపీ మల్లు రవి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ హయాంలో విద్యా వ్యవస్తను నిర్వీర్యం చేశారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లు రవి విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఎన్ ప్రీతం, బీసీ కార్పొరేషన్ చైర్మెన్ నూతి శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో 28 ఇంటిగ్రేటెడ్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ విద్యార్థులకు ఒకే చోట విద్యను అందించటం మంచి పరిణామమన్నారు. యంగ్ ఇండియా గురుకులాలతో సమాజంలో సమూలమైన మార్పు వస్తుందని చెప్పారు. సంపూర్ణ విప్లవ కేంద్రాలుగా సమీకృత గురుకులాలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు.

మహేందర్ రెడ్డి నియామకం రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

చైర్మెన్ విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వ్యవహరించిందని విమర్శించారు. "కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నది. బిల్ పాస్ చేయించడం, ప్రభుత్వ బిజినెస్ జరిగేలా చూడడం చీఫ్ విప్ బాధ్యత. మహేందర్ రెడ్డి ఇప్పుడు ఎవరికి విప్ జారీ చేస్తారు. అధికార పార్టీ సభ్యులకా? ప్రతిపక్ష పార్టీ సభ్యులకా? లేక బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన విప్‌ను పాటిస్తారా? తేలాల్సి ఉంది. ఆయా పార్టీలు తమ పార్టీ ఆదేశానుసారం నడుచుకోమని విప్ జారీ చేస్తాయి. అనర్హత వేటు వేయాల్సిన కౌన్సిల్ చైర్మెన్ స్వయంగా పట్నం మహేందర్‌రెడ్డి చీఫ్‌విప్ ఎంపికైనట్టు బులెటిన్ ఎలా ఇస్తారు" అని హరీశ్ నిలదీశారు. ఎమ్మెల్సీ హోదాలోనే పంద్రాగస్టు, సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగురవేశారని గుర్తు చేశారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర గవర్నర్‌తో పాటు డీవోపీటీకి లేఖ రాస్తామని చెప్పారు. పట్నం మహేందర్ రెడ్డి ఏ పార్టీకి చెందిన వ్యక్తో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇదిగో యువ సాహిత్యం

తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో YOUTH LITERARY FEST - 2024



సాహిత్య సృజనలో ఉన్న యువతీయువకులు చాలామంది పాల్గొన్నారు. నవల, కథ, కవిత్వం, పాట, విమర్శ రాస్తున్నవాళ్ళు ఇందులో ఉన్నారు. ఇలా ఒకే వేదిక మీదకి అందుబాటులో ఉన్న వాళ్లందరూ పాల్గొనటం ఎంతో వైవిధ్యంగా అనిపించింది. వాళ్ళ స్వీయ అనుభవాలను, రచనా ప్రయాణాన్ని రికార్డు చేయడం అద్భుతమైన ప్రయోగం. సమాజం, పుస్తకాలు, వ్యక్తులు, సంస్థలు వాళ్లమీద వేసిన ప్రభావాలను వినడం ఎంతో ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. ఇప్పటి యువత రాస్తున్న కవిత్వం మీద మాట్లాడే అవకాశం నాకు వచ్చింది. 1984 తర్వాత పుట్టినవాళ్లు ఒక విభాగంగా, 2000 సంవత్సరం తర్వాత పుట్టిన వాళ్ళు ఒక విభాగంగా చేసుకొని అధ్యయనం చేశాను. మొదటి విభాగం వారిమీద వివిధ సామాజిక ఉద్యమాల ప్రభావం, వారిదైన అందమైన బాల్యం ఉంది. కానీ రెండవ విభాగంవారికి అవి చాలా తక్కువ. ముఖ్యంగా రెండో విభాగం యువతపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ. దృక్పథం స్పష్టత ఉన్నవాళ్లు, లేనివాళ్ళు ఇద్దరూ ఈ రెండు విభాగాల్లో ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఒక కొత్త భావచిత్రాల ప్రపంచంలోకి వెళ్లొచ్చిన అనుభూతి ఈ రెండు విభాగాల యువత రాసిన కవిత్వాన్ని చదివితే కలుగుతుందని మాత్రం ప్రకటించగలను.

– డా. ఎస్.చందయ్య , అసిస్టెంట్ ప్రొఫెసర్, నిజాం కళాశాల

అభినందనీయం



సమాజంలో ఒక్కరోజులోనే మార్పు రావాలని కోరుకోవటం అత్యాశే అవుతుంది. అధ్యయనమే సమాజ మార్పునకు మార్గం. శాస్త్రీయ కోణంలో సాహిత్య విశ్లేషణలు ఉండాలని నా ఆకాంక్ష. ఆ దిశగా యువ రచయితలు ముందడుగు వేయాలి. దేన్నైనా చేయగలిగే దృఢ సంకల్పం యువతలో ఉంటుంది, సాహిత్యంలో అనేక ప్రయోగాలు చేస్తూ ముందుకెళ్లడం మంచి పరిణామం. తెలంగాణ సాహితి ప్రయత్నం అభినందనీయం. ప్రశంసనీయం. దారితప్పుతున్న సమాజాన్ని తమ సాహిత్యం ద్వారా బాగు చేయాల్సిన బాధ్యత యువతపైనే ఉంది. అనేక కొత్త ఒరవడులు పుట్టుకొస్తున్న తరుణంలో సాహిత్యంలో శాస్త్రీయ దృక్పథాన్ని జొప్పించాలనీ, శాస్త్రీయ కోణంలో విశ్లేషణలు చేయాల్సిన అవసరం మనపై ఉంది. సాహిత్యమనేది సిబ్బి అయితే దాని మీద పొరలుగా పొందికగా సాహిత్యాన్ని (నవల, కథ, విమర్శ, కవిత, పాట) పేర్చడం బతుకమ్మ.


– డా.మామిడి హరికృష్ణ,
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు



నేను రాసిన నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం లభించింది. అయినా ఆ నవల నేపథ్యాన్ని వివరించే అవకాశం నాకు ఈ ఫెస్ట్ ద్వారానే వచ్చింది. ఇంత మంది తమ స్వీయ నవల నేపథ్యాన్ని వివరించడం... గొప్ప అనుభూతిని ఇచ్చింది.

– గడ్డం మోహన్ రావు, నవల రచయిత
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం గ్రహీత

యువతిపై గురుతర బాధ్యత ఉంది



రచనకు కావాల్సిన వస్తువును ఎంపిక చేసుకోవడం, బాధ్యతాయుతమైన లక్ష్యం వైపు అడుగులు వేయడం లాంటి గురుతర బాధ్యత యువ రచయితలపై ఉంది. ఉన్నతమైన రచనలు శతాబ్దాన్ని, యుగాన్ని ప్రభావితం చేసే చోదక శక్తులుగా ఉంటాయన్నారు. రచయితలు ఎదుటివారు చెప్పే ప్రతి విషయాన్ని ఓపికగా వినే లక్షణాన్ని అలవర్చుకోవాలి. అంతర్జాతీయ సంస్థల స్థాయిలో వారి రచనలపై వారి మాటల్లోనే తెలియజేయడం అభినందనీయం. ఈ కొత్త ఒరవడికి తెలంగాణ సాహితి బాటలు వేసింది.

– డా.ఎస్. రఘు, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం



మనం ఎక్కడో ఉండి రాస్తూ మన పరిధిలోని రచయితలు, వాళ్ల పుస్తకాల వరకు మాత్రమే అవగాహనతో ఉంటాం. కానీ మనకు అవతల చాలామంది ప్రతిభావంతులు ఉన్నారని, ఎన్నో ఏళ్లుగా సాహితీకృషి చేస్తున్నారని తెలుసుకోవడం అవసరం. అప్పుడే మనల్ని, మన పనిని జాగ్రత్తగా అంచనా వేసుకుంటాం. లేకపోతే మనం మాత్రమే గొప్ప అనే అహంకారపు నీడ మన మీద పడుతుంది. అది చాలా ప్రమాదం. ఇలాంటి కార్యక్రమాల్లో అందర్నీ కలుసుకోవడం, వారి రచనల గురించి తెలుసుకోవడం వల్ల మన ఎక్కడ ఉన్నాం, ఏం రాస్తున్నాం, ఇంకా ఏం రాయాలి.. అనేవి తెలుస్తాయి. ఆ అవకాశం ఈ ఫెస్ట్ ఇచ్చింది. యువతనంతా వేదిక ఎక్కించి, వారి రచనల గురించి వారినే మాట్లాడి, విశ్లేషించుకోమనడం బాగుంది.

– సాయి వంశీ (విశీ), కథా రచయిత


యువత ప్రాపంచిక దృక్పథంతో రచనలు చేయాలి



సమాజం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉన్న తరుణంలో యువత రచనలపై దృష్టి సారించడం ప్రవాహానికి ఎదురు ఈదడమే. తనకేంటి లాభం అని ఆశిస్తున్న కాలంలో సమాజంలోని ప్రజలను చైతన్యపర్చడానికి యువ రచయితలు ముందుకు రావడం అభినందనీయం. మంచి లక్ష్యం, సృజనాత్మకతతో కూడుకున్న రచనలు ఎల్లకాలం నిలబడి ఉంటాయి. ప్రతి రచనకూ భాష ముఖ్యమైనదనీ, రచనలెప్పుడూ ప్రజల భాషలో ఉండేలా యువ రచయితలు నిలబడతారు. ప్రతి రచనలోనూ ప్రాపంచిక దృక్పథం ఉండాలి. గొంతులేని సామాన్య ప్రజానీకానికి ఉపయోగపడేలా రచనలు రావాలని, ఎక్కువ మంది అమ్మాయిలు రచనారంగం వైపు రావటం మంచి పరిణామం.

– కె.ఆనందాచారి, తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి

యూత్ ట్రెండ్ సెట్



యువ కవులకు కవిత్వం పట్ల అభిలాష ఉంది. మారుతున్న కాలంలోనూ కవిత్వం చెప్పడంలో యూత్ ట్రెండ్ సెట్ చేయడం సంతోషంగా ఉంది. యువ కవులు సొంత అనుభవాలను రాస్తూనే, సమాజ సమస్యలతో అనుసంధానం కావాలి. నవల, పాట, కవిత్వం, నాటకం, కథ తదితరాంశాల్లో నోటి మీద చెప్పగలిగే వారున్నారు. సాహిత్యంలో ఏ అంశంపైనైనా తమదైన ముద్ర యువత వేసుకుంటున్నారు. ఇది హర్షించదగ్గ పరిణామం.

– ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ కవి, రచయిత



తెలంగాణ సాహితి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అక్టోబర్ 4,5 తేదీల్లో జరిగిన 'యూత్ లిటరరీ ఫెస్ట్' ఓ కొత్త అనుభూతిని కలిగించింది. యువకవులు, రచయితలు తమ తమ అనుభవాలను, జ్ఞాపకాలను పంచుకోవడానికి ఓ వేదికనిచ్చింది. పాట, కవిత్వం, కథ, విమర్శ, నవల ప్రక్రియల్లో రచనలు చేస్తున్న ఎంతోమంది యువకవులకు, రచయితలకు అసలు సిసలైన చర్చావేదికలా నిలిచిందని చెప్పవచ్చు. ముఖ్యంగా నేను సభాధ్యక్షత వహించిన పాటల సెషన్‌లో నాతో పాటు పాల్గొన్న చాలామంది గీతరచయితలు తమ పాటల ప్రస్థానాన్ని గురించి చెప్పుకునే అవకాశం దొరికింది. వారి వారి సాధక బాధకాలను గురించి, సినీరంగంలో నేడు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి, సన్నివేశానికి అనుగుణంగా, బాణీకి తగ్గట్టుగా పాట రాయడానికి వారు పడే కష్టం గురించి.. ఇలా ఎన్నో విషయాలు ఒకరినొకరు పంచుకోవడానికి అవకాశాన్నిచ్చింది తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ ఇలా యువకవులతో, రచయితలతో కార్యక్రమాలు చేయడం వల్ల వాళ్ళలోని క్రియేటివిటీని వెలికితీయడానికి అవకాశముంటుంది. యూత్ కి తమ భావాలను స్వేచ్ఛగా వేదికపై వినిపించుకోవడానికి అవకాశముంటుంది.

– డా. తిరునగరి శరత్ చంద్ర, కవి, సినీగీతరచయిత



ఇది ఒక ప్రయోగం. ప్రయోజనకరమైన ప్రయోగం. తెలుగు నేలపై ఇది నిజంగా తొలి ప్రయత్నమే. యువ కలాలు తమ రచనలపై అంతరంగాన్ని ఆవిష్కరించారు. యువత ఎందులోనూ తీసిపోదు అని నిరూపించింది 'తెలంగాణ సాహితి - డివైఎఫ్ఐ' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ లిటరరీ ఫెస్ట్ -2024. తెలుగు నేలపై యువత సాహిత్య రంగంలో వెనుకబడి ఉంది. సాహిత్యం చదవడం లేదు. సాహిత్య సభలకు రావడం లేదు. యువత తమ సృజనపై సీరియస్‌గా లేరు అనే చర్చలు ఉండనే ఉన్నాయి. మరీ ముఖ్యంగా నలభై ఏండ్ల లోపు వారి రచనలు సీరియస్ ఉండటం లేదు అనే అపవాదు సైతం మోయాల్సి వచ్చింది. కానీ అక్టోబర్ 4,5 తేదీల్లో జరిగిన యూత్ లిటరరీ ఫెస్ట్ - 2024 అలాంటి అపోహలను తొలిగించే ప్రయత్నం చేసింది.

వర్తమాన సమాజం పట్ల నిబద్ధత, రాజకీయ పరిజ్ఞానం, ఉన్నది ఉన్నట్లు మాట్లాడే తత్వం ఇలా సాహిత్య సృజనకు సరిపడా సరంజామా అంతా యువత దగ్గర సిద్ధంగా ఉంది. వస్తు ఎంపిక, నిర్వహణలో సైతం కొత్తదనం సంతరించుకుంది. సాహిత్య రచనలోకి కొత్త కలాలు ప్రవేశంతో వస్తువులో, శిల్పంలో మార్పు వచ్చింది. వ్యక్తీకరణ నైపుణ్యాలు సైతం కొత్తదనాన్ని సంతరించుకుంటున్నాయి. యువ కలాల సృజనాత్మకత మట్టి పరిమళాలతో పులకిస్తుంది. కొత్త ప్రమేయాలు సరికొత్తగా ఆవిష్కరించబడుతున్నాయి. కానీ వారి నైపుణ్యాలను, ప్రతిభా పాటవాలను ప్రదర్శించడానికి సరైన వేదికలు ఉండటం లేదు. తమ వ్యక్తీకరణలో ఉండే లోపాలను సరిదిద్దే శిక్షణ కొరవడుతున్నది. ఫలితంగా సాహిత్య సృజనలోకి 'అ'సాహిత్యం ప్రవేశిస్తుంది.

మరి కొత్త కలాలకు, గళాలకు వేదిక ఇస్తున్న వారెందరున్నారు? అందుకే తెలంగాణ సాహితి ఒక అడుగు ముందుకేసి యువతనే వ్యక్తులుగా ఎంపిక చేసి వారి ద్వారా రచనా మెళకువలు పెంచుకునే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యం నుంచి వచ్చిన కొన్ని ఆలోచనల ఫలితంగానే మొదటిసారి యూత్ లిటరరీ ఫెస్ట్ జరిగింది. అరవై మంది యువ సృజనకారులు నవల, కథ, విమర్శ, పాట, కవిత్వంపై లోతైన విశ్లేషణ చేశారు. మరో వందమంది సృజనకారులు ఈ ఫెస్ట్ లో సామూహిక కవితా పఠనం, గానం చేశారు. కల్చరల్ ఫెస్ట్ సైతం ఆలోచింపజేసింది. ఇన్నిరకాల సాహిత్య సృజనకారులు ఈ వేదిక మీది నుంచి సారవంతమైన ఆలోచనలు పంచుకున్నారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఈ యూత్ లిటరరీ ఫెస్ట్ తొలి అడుగుగా చరిత్రలో నమోదవుతుంది.

ఆ ఒరవడిలో 4,5 అక్టోబర్ 2024న రెండు రోజుల పాటు జరిగిన యూత్ లిటరరీ ఫెస్ట్ వేదిక అయింది. లిటరరీ ఫెస్ట్ ఆలోచనకు, ప్రణాళికకు, ఆచరణకు తెలంగాణ సాహితి మూలధాతువు. దానికి డివైఎఫ్ఐ తోడై నిలిచింది. నిర్దిష్టంగా ఈ రెండు రోజులలో స్వీయ నవలా విశ్లేషణ, స్వీయ కథా విశ్లేషణ, విమర్శపై యువత అవగాహన, సినిమా పాటలపై లోతైన విశ్లేషణ, యువత కవిత్వతత్వం ఇలా ఐదు విభాగాలుగా లిటరరీ ఫెస్ట్ కొనసాగింది. తెలుగుభాష భవిష్యత్ మీద నిర్దుష్ట కార్యక్రమ రూపకల్పన ఈ సమావేశం ప్రధాన లక్ష్యం.

సమాజంలో అనేక తోవలు, కోవలు, పాయలు ఉంటాయి. ఎవరి మార్గంలో నడిచేవారు వారి బాటసారులతో సంభాషించుకోవాలి. అదే సమయంలో ఏదో కూడలిలో కలిసినప్పుడు, ఉమ్మడి ప్రయాణం గురించి, ప్రయాణపు ఉమ్మడితనం గురించి కూడా మాట్లాడుకోవాలి. భాషాసాంస్కృతిక అస్తిత్వం నుంచి చూసినప్పుడు తెలుగువారంతా ఒకటిగా బయటి ప్రపంచానికి కనిపించాలి. ఆ తపనతోనే యూత్ లిటరరీ ఫెస్ట్ నిర్వహించాం. ఈ కూడలిలో కలుసుకున్న యువ సాహిత్యకారులు తమ రచనలపై స్వీయ విశ్లేషణ చేయడం, ఒకరి రచనల గురించి మరొకరితో పంచుకోవడం చూస్తే సాహిత్యం సింగడేసిందా అన్నట్టు సాగింది ఈ యూత్ లిటరరీ ఫెస్ట్ - 2024.

– అనంతోజు మోహన్‌కృష్ణ, 88977 65417




తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యూత్ ఫెస్ట్ ఎంతో మందిలో ఆలోచనను రేకెత్తించింది. కొత్తగా కవిత్వం, కథ, నవల, పాట రాసేవాళ్ళకు కావలసిన మెలకువలెన్నో నేర్పింది. నలభై సంవత్సరాల లోపు యువకులను వేదికకు పిలిచి వారి స్వీయ అనుభవాలను పంచుకోమని చెప్పి వారి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఈ ఫెస్ట్ లో భాగంగా కవిత్వ విభాగంలో నేను పాల్గొన్నాను. నా సాహితీ ప్రయాణాన్ని, నాకు తెలిసిన కవిత్వానుభవాలను పంచుకున్నాను. తోటి కవుల సాహితీ ప్రస్థానాన్ని తెలుసుకునే అవకాశం కలిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కథకులు, నవలాకారులు, విమర్శకులు, సినీ గీతరచయితల అనుభవాలను వినటమే కాకుండా ఆ మిత్రులందరిని కలుసుకునే అవకాశం కలిగింది. అన్ని ప్రక్రియల మీద సాధికారికంగా చర్చ జరిగింది. తెలిసిన విషయాలు పంచుకున్నాం. తెలియని విషయాలను ఎన్నో తెలుసుకున్నాం. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. యువకులకు మార్గదర్శనం చేయటంలో ఈ ఫెస్ట్ విజయవంతమయింది.

– తండ హరీష్, యువకవి, విమర్శకులు



మనకు తెలియని ఒక ఉద్వేగానికి గురైనప్పుడు రాసేదే కవిత్వం. వర్తమాన కవులు రాస్తున్న కవిత్వంపై ఒక పరిశీలన చేస్తే యువత ఉద్యమ కవిత్వం, సంఘటనాత్మక కవిత్వం, మైనారిటీ కవిత్వం, దళిత కవిత్వం, స్త్రీ వాద కవిత్వం ఇలా ఏ అంశల నైనా తమదైన ముద్ర వేసుకుంటున్నారు. ఇలాంటి వేదికలు ఆ కృషిని మరింత బలోపేతం చేస్తాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

– తగుళ్ళ గోపాల్,
కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత




యువ కథకులు వాళ్ల కథ నేపథ్యాన్ని వివరిస్తూ కథ రాయడానికి ఎదురైన సందర్భాలను, తమ చుట్టూ వున్న సామాజిక విషయాలు అధ్యయనం చేయడం, ఇవన్నీ అందరితో పంచుకోవడం, వారి నుండి నేనూ నేర్చుకోవడం బాగుంది. ఇంత మంచి అవకాశం యువ కథా రచయితలకు ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్నందుకు తెలంగాణ సాహితీ టీంకి అభినందనలు.

– శ్రీ ఊహా, కథా రచయిత్రి




ఏదో ఊహాలోకంలో ఉండి పట్టీ పట్టనట్లు ట్రాన్స్‌లో రాసేవి కాదు ఆ కథలు. పూర్తి హోష్‌లో ఉండి జోష్‌తో రాస్తుంది. తెలియని జీవితాలు, వాటి నేపథ్యాలు తెలియపర్చడం తన దృక్పథం. రచనలో చదువరులు లీనమై ఎక్కడో ఒక దగ్గర తమను తాము చూసుకోగలగాలి. సొంత గాథలను వినిపించే సాహసం చేయాలి అనేది నా ప్రగాఢ భావన.

– మానస ఎండ్లూరి




లిటరరీ ఫెస్ట్ కవులు, కళాకారులకు మంచి అనుభూతిని మిగిల్చిన సమ్మేళనం. పాటలపై స్వీయ విశ్లేషణలో పాల్గొనడం, మాట్లాడడం చాలా ఆనందాన్ని మిగిల్చిన సందర్భం. పాట రాయడం వెనుక ఉన్న అంతరంగాన్ని, రాసిన తర్వాత ఆ పాట ఒప్పించడానికి నడిచే తతంగాన్ని తెలియజేయడం ఈ సభలో ముఖ్య ఘట్టం. తత్కారాల మేళవింపులో, ఛీత్కారాల, అవమానాల భారాలను అధిగమించి పాటల పూదోటలు పూయిస్తున్న ఈ తరం సినీ గేయరచయితల అంతరంగాలను ఆవిష్కరించినందుకు తెలంగాణ సాహితికి అభినందనలు. – నాగరాజు కువ్వారపు, సినీ గేయ రచయిత



సినిమా అనగానే దర్శక, నిర్మాతల పేర్లే గుర్తు పెట్టుకుంటారు కాని గీతరచయితల పేర్లు గుర్తు పెట్టుకోకపోవడం ఒకింత బాధాకరం. సినిమాపాటలు రాస్తాం.. కాని విడుదలవ్వడానికి చాలా కాలం పడుతుంది.. సినీరంగంలో గుర్తుండిపోయే పాటలు రాసిన కవే నిలబడతాడు.

– కదలి సత్యనారాయణ, సినీగీతరచయిత



ఒక పాట సృష్టికి సంగీత దర్శకుని తర్వాత ముఖ్య భూమిక పోషించేది గేయ రచయిత. కానీ తను కనపడడు, వినపడడు. కేవలం యూట్యూబ్‌లో పేరు వరకే పరిమితమౌతాడు. అలాంటి గేయ రచయితలను ఒకచోట కలిపి, వాళ్ళనోట పాటగురించి, వాళ్ళకష్టాలు, అవమానాలు, ప్రశంశలు, విమర్శలు విజయాలు అందుకుంటున్న తీరు నలుగురితో పంచుకునే అవకాశం కల్పించడం గొప్ప విషయం. దీని వలన ఎందరో మిత్రులతో పరిచయాలు, ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవడంతో పాటు ఆత్మస్థైర్యం కూడా పెంపొందించుకునే అవకాశం కలిగింది. నిర్వాహకులకు ధన్యవాదాలు

– గడ్డం వీరు



సినిమాపాట అనగానే చాలామందికి చిన్న చూపు ఉంది. కాని సినిమా పాట రచన అనేది చాలా కష్టతరమైనది. అది అనుకున్నంత ఈజీ కాదు. ఎంతో కష్టపడి ప్రయాణం చేసేవాళ్ళకు సినిమాపరిశ్రమ ఎప్పుడూ స్వాగతం చెబుతుంది. నా అనుభవాలను పంచుకోవడానికి ఓ వేదికను కల్పించిన తెలంగాణ సాహితికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ఎంతోమంది లబ్ధ ప్రతిష్ఠులతో కలిసి వేదికను పంచుకోవడం సంతోషంగా ఉంది. – పూర్ణాచారి, సినీగీత రచయిత



తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ యూత్ ఫెస్ట్-2024 చాలా బాగా జరిగింది. సాహిత్య కార్యక్రమాలు చాలా జరుగుతుంటాయి కానీ ఇందులో యూత్ కోసం యువతనే ముందుపెట్టి రెండు రోజుల పాటు వివిధ అంశాల (నవల, కథ, కవిత్వం, పాట, విమర్శ) మీద ఫెస్ట్ నిర్వహించడం సాహిత్య రంగంలో కొత్త సాంప్రదాయానికి నాంది. వారి వారి అంశాలను విశ్లేషించే వ్యక్తులతో పాటు, సభాధ్యక్షులు కూడా యువతే ఉండటం ఇక భవిష్యత్తు మీదే అని నిర్దేశించినట్టుగా ఉంది. దీని ద్వారా భవిష్యత్తులో ఎలాంటి కార్యక్రమాలు జరిగినా సభను సజావుగా నిర్వహించే వీలు ఉంటుంది. ఇందులో యువత ఎవరు రాసిన రచనల మీద వారే విశ్లేషణ చేయడం ద్వారా వారి రచనా నేపథ్యం, ఎలాంటి సందర్భంలో రాశారు, వేటిని ఆధారం చేసుకొని రాశారనే అంశాలు తెలిశాయి. కొత్తగా రేసేవారు, కొన్ని రాసి ఆగినవారికి ఈ ఫెస్ట్.. స్ఫూర్తి దాయకం. ఈ ఫెస్ట్ వల్ల వెంటనే ఫలితం కాకున్నా దీనిలో దీర్ఘకాలిక ప్రయోజనం దాగి ఉందని నా అభిప్రాయం. – బద్ది గణేశ్, యువ కథా రచయిత



విరామం లేని ప్రయత్నాలే యువ రచయితల విజయానికి సోపానాలు. సోషల్ మీడియా మీద అతిగా ఆధారపడొద్దు. ఏది మంచి ఏది చెడు అని విశ్లేషించుకోవాల్సిన అవసరం రచయితలపైన వుంది.

– నస్రీన్‌ఖాన్, ప్రముఖ రచయిత్రి



రచయితలు, కవులు తమ రచనల ద్వారా సమాజానికి మార్గ నిర్దేశం చేస్తారు. అందులో ఇంతమంది యువత వుండడం స్ఫూర్తిదాయకం. యువ తరచయితలను ప్రోత్సహించడంలో డివైఎఫ్ఐ సైతం ఎప్పుడూ ముందు వరుసలో వుంటుంది.

–అనగంటి వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి




తెలంగాణ సాహితీ, డివైఎఫ్ఐ సంయుక్తంగా నిర్వహించిన యూత్ లిటరరీ ఫెస్ట్ యువ రచయితలకు ఎంతగానో తోడ్పడుతోంది. నవల, కథ, కవిత, పాట, విమర్శల్లో స్వీయ విశ్లేషణా కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో ఉపయోగకరం. కొత్తవారికి, ఇప్పటికే రాస్తున్న యువతకి రచనా నిర్వహణకి సంబంధించిన మెలకువలు, వస్తువు ఎంపిక చేసుకునే పద్ధతులు, నిర్వహణలో బిగువు, రచనకి దృక్పథం కలిగి ఉండాల్సిన అవసరం అర్థం చేయించేలా ఫెస్ట్ జరిగింది. సుమారు అరవై మందికి పైగా యువ సృజనకారులను ఒకే చోట పోగేసి మాట్లాడించిన తీరు అద్భుతంగా అనిపించింది. దీనికి ప్రధానంగా కృషి చేసిన తెలంగాణ సాహితీ యువ సమన్వయకర్త అనంతోజు మోహన కృష్ణని అభినందించాల్సిందే. తెలంగాణ సాహితీ, డివైఎఫ్ఐ కి జేజేలు.

– ఎం. విప్లవకుమార్



సాహిత్య విమర్శ చాలా స్పష్టంగా ఉండాలి. వ్యక్తులను బట్టి విమర్శ ఉండదు. నిస్సందేహంగా రచనలపై భిన్న పార్శ్వాలు బయటకు రావాలి. అలా విమర్శ చేసినప్పుడే మంచి రచనలు బయటకు వస్తాయి. యువత తమ రచనలను మెరుగు పరుచుకోవడానికి ఇలాంటి చర్చలు నిరంతరం జరగాల్సిన అవసరం ఉంది.

– బందారి రాజ్ కుమార్, యువకవి, విమర్శకులు



యువత సాహిత్య అభిప్రాయాలు పంచుకోవడమే అరుదైన విషయం. అలాంటిది మా రచనలపై మాతోనే మాట్లాడించడం గొప్ప అనుభూతిని ఇచ్చింది. కొత్త రచయితలు తయారు కావడానికి ఇదొక మంచి వేదిక.

– మన్ ప్రీతమ్ కె.వి. యువ కథా రచయిత




కొత్త రచనలకు, కొత్త రచయితలకు చక్కని మార్గాన్ని సూచించే విధంగా ఉంది. కేవలం పెద్ద రచయితలకే కాకుండా నవతరానికి, వారి ఆలోచనలను ప్రపంచానికి చాటి చెప్పే విధంగా, వారి రచనలను మరింత మెరుగు పరుచుకునే అవకాశం కూడా ఉంటుంది. యువత సాహిత్యంలోకి రావాలంటూ వేదికల మీద చెప్పూ, యువత రచనల్లోని తప్పులను మాత్రమే వెలికి తీసి దానిని సరిదిద్దుకునేల చేయకుండా, వారు చేస్తున్న తప్పేంటో చెప్పకుండా ఉంటున్న తరుణంలో యువతకు మంచి ప్రోత్సాహంలా నిలిచింది తెలంగాణ సాహితి, డివైఎఫ్ఐ. ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు

– కెపి లక్ష్మీనరసింహ



భాషా, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ, ఉద్యమ భావజాల వ్యాప్తికి నవల గొప్ప కాన్వాస్. ఈ నేల బిడ్డల అమరత్వాన్ని, గోసతో తండ్లాడిన బడుగు బతుకుల్ని, మట్టిమనుషుల తత్వాన్ని, ప్రేమను చిత్రికగట్టుటకు నవల ఒక వేదిక. నవల రాయడమంటే గిజిగాడు గూడు కట్టిన విధం, అవ్వ శిబ్బి అల్లిన రీతి. తెలంగాణలో సాకబోసిన అక్షర కన్నీళ్ళతో నవల ఊరబోనం అవుతుంది. అస్తిత్వాన్ని కాపాడుకోడానికి, వృత్తికులాల ఉనికికి నవల రాయడం అవసరం. ప్రజలమనిషి నుండి పొత్తి దాకా తెలంగాణ నవలలు దారి పొడవునా అల్లబడిన చైతన్యపాఠాలు, మరిచిన త్యాగాలను రికార్డ్ చేసిన పతాకాలు. తెలంగాణ సాహితి నిర్వహించిన ప్రతీ కార్యక్రమంలో యువత భాగస్వామ్యం అత్యధికం. అది సముచితం. రెండు రోజుల లిటరరీ ఫెస్ట్ యువ రచయితలకు, కవులకు లభించిన అరుదైన ప్లాట్ ఫామ్. కొత్త రచనా దారికి ఇది వినూత్న పాదు. యువసృజనకు నాడీకేంద్రం. ఇదొక కార్యశాల, సాహితీకర్మాగారం.

– డా. నర్రా ప్రవీణ్ రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు,
నర్రా ఫౌండేషన్, తెలంగాణ తెలుగు పరిశోధక మండలి



ఈ తరం యువకులను, వారి సాహిత్యాన్ని ఆ సాహిత్యం మీద చర్చాగోష్ఠిని ఒకే వేదిక మీద చూడటం చాలా సంతోషంగా అనిపించింది. అత్యంత కష్టసాధ్యమైన పనిని సఫలీకృతం చేసినందుకు నిర్వాహకులకు శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో సినీ గీత రచయితగా పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– డా. మల్లెగోడ గంగా ప్రసాద్, సినీగీతరచయిత

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
కరీంనగర్
సోమవారం | అక్టోబర్ 14, 2024 | www.navatelangana.com

కేబుల్ బ్రిడ్జిపై వెలగని డైనమిక్ లైటింగ్ సిస్టం..



నవతెలంగాణ - భగత్‌నగర్

కరీంనగర్‌కే తలమానికంగా ఉన్న కేబుల్ బ్రిడ్జి కళ తప్పింది. తెలంగాణ సంస్కృతికి ఆలవాలమైన బతుకమ్మ పండగతో పాటు, దసరా రోజు కూడా పైలాన్స్‌పై ఏర్పాటు చేసిన డైనమిక్ లైటింగ్ సిస్టం వెలగకపోవడంతో కేబుల్ బ్రిడ్జి బోసిపోయింది. కేబుల్ బ్రిడ్జి అంటేనే రంగురంగుల విద్యుత్ కాంతులతో మెరిసిపోతూ చూపరులను ఎంతగానో ఆకట్టుకునేది. అలాంటిది కొన్ని రోజులుగా డైనమిక్ లైటింగ్ సిస్టం వెలగకపోవడంతో సెల్ఫీలు, పెళ్లి ఫొటో షూట్‌లు, లఘు చిత్రాల షూటింగ్ కోసం వచ్చే వారు, సినీ ఔత్సాహికులు నిరాశ చెందుతున్నారు. కేబుల్ బ్రిడ్జ్‌పై లైటింగ్‌ని పునరుద్ధరించడంతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

చెడుపై మంచి విజయమే విజయదశమి

ప్రజా ప్రభుత్వానికి సలహాలు సూచనలు ఇవ్వండి
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
ఘనంగా దసరా వేడుకలు

నవతెలంగాణ - తిమ్మాపూర్

చెడుపై మంచి విజయమే విజయదశమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సలహాలు, సూచనలు ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. మండలంలోని ఎల్ఎండి కాలనీలో విజయదశమిని పురస్కరించుకొని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రామ్‌లీలా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, రావణ దహనం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో సంక్షేమ పథకాలను విజయవంతంగా చేపడుతుందన్నారు. పేద విద్యార్థులకు విద్యను ఉచితంగా అందించాలని ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా 28 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. రాష్ట్ర జిల్లా ప్రజలందరికీ మంత్రి దసరా శుభాకాంక్షలు తెలిపారు. రామ్‌లీలా ఉత్సవ కమిటీ కన్వీనర్ కుంట రాజేందర్ రెడ్డి, కో కన్వీనర్ గవ్వ రాజేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులను శాలువాతో ఘనంగా సత్కరించారు. బుర్ర సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు, చిన్నారుల నృత్యాలు, భారీ క్రాకర్ షో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఓ మహేశ్వర్, ఎస్ఆర్ఎస్పీ ఈఈ నాగభూషణం, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఎల్కపెల్లి సంపత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్, నాయకులు రెడ్డిగాని రాజు, కొత్త తిరుపతిరెడ్డి, రమేష్, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గంగిడి లక్ష్మారెడ్డి, గోపు మల్లారెడ్డి, పోలు రాము, రమేష్, బుదారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వినయ్‌ని అభినందించిన సీఐ రవి



నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 29వ వార్డుకు చెందిన ఆకునూరు స్వరూప, రాజు మొదటి కుమారుడు ఆకునూరు వినయ్ ఒక సంవత్సర కాలంలోనే నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. జమ్మికుంట సీఐ వరగంటి రవి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ మాట్లాడారు. 2023లో కేంద్రీయ విద్యాలయంలో టిజిటి, 2024 ఫిబ్రవరిలో గురుకులం స్కూల్ ఫిజికల్ డైరెక్టర్, ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పిఈటి) కరీంనగర్ జిల్లా మొదటి విజేత, డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) సాధించడం గర్వకారణమని అన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించిన వినయ్ యువతకు ఆదర్శమని అన్నారు. వినయ్‌ని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వినయ్ చిన్నతనం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో, యూనివర్సిటీలలో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల పూర్వ విద్యార్థులు అంబాల ప్రభాకర్ ప్రభు, దొడ్డ కుమారస్వామి, శనిగరపు కుమార్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళి



నవతెలంగాణ - హుజురాబాద్

ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రజా ఉద్యమకారుడు జి.ఎన్.సాయిబాబా మృతిపట్ల ఆదివారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్రజాసంఘాల నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ సాయిబాబా జీవించి ఉన్నంతకాలం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం, ప్రజల బాగోగుల కోసం తపన పడ్డారని అన్నారు. ఆయన మృతి బడుగు బలహీన వర్గాలకు తీరనిలోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు భీమోజు సదానందం, పలకల ఈశ్వర్‌రెడ్డి, పొడిశెట్టి వెంకటరాజం, వేల్పుల రత్నం, మార్త రవీందర్, ఓదెలు, తదితరులు పాల్గొన్నారు.

పండగ పూట విషాదం..
బావిలోపడి యువకుడు మృతి



నవతెలంగాణ - మానకొండూర్ : మానకొండూర్ మండలంలోని వెల్ది గ్రామంలో పండగపూట విషాదం నెలకొంది. ఇల్లందుల త్రినాథ్ (19) అనే యువకుడు రంగపేట గ్రామ శివారులో వ్యవసాయ బావిలోపడి మృతి చెందాడు. స్థానిక సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అదే గ్రామానికి చెందిన త్రినాథ్ స్నేహితులైన కిరణ్, స్వస్తిక్‌తో కలిసి ఆటోలో రంగపేట గ్రామంలో ప్యాంటు కుట్టించుకోవడానికి వెళ్లారు. సాయంత్రం సుమారు ఏడు గంటలకు త్రినాథ్ వ్యవసాయ బావిలో పడి పోయాడని స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకుని అక్కడే ఉన్న కిరణ్, స్వస్తిక్, సందీప్‌ను వివరాలు అడిగారు. సమాచారం అందుకున్న పోలీసులు. ఘటన స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఆదివారం ఉదయం బావిలోని నీటిని మోటార్లతో తోడి మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తన కొడుకు మృతిపై అనుమానం ఉందని తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నవతెలంగాణ - శంకరపట్నం : శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామానికి చెందిన బండారుపల్లి భాగ్యలక్ష్మి, రామస్వామి కొడుకు వినయ్(26) శనివారం రాత్రి తాడికల్ గ్రామంలోని బంధువుల ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని హుజురాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లుగా ఎస్సై కొత్తపల్లి రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవతెలంగాణ - హుజురాబాద్ : హుజురాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన ఆర్టిస్టు నాగరాజు ద్విచక్ర వాహనంపై వస్తుండగా వెనుక నుండి మరో వాహనం ఢీకొనడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడికి హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టు పైనుండి పడి గీత కార్మికుడికి గాయాలు



నవతెలంగాణ - వీణవంక : తాటి చెట్టు పైనుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన వీణవంక మండలంలోని వల్బపూర్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లె స్వామి వృత్తిలో భాగంగా శుక్రవారం ఉదయం తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కాగా తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్వామిది నిరుపేద కుటుంబం అని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి
ఎమ్మెల్సీ అభ్యర్థి కడారి అనంతరెడ్డి



నవతెలంగాణ - కరీంనగర్

రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లోని అర్హత గల ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అన్నారు. శనివారం విజయదశమి పండుగను పురస్కరించుకొని ఆయన కరీంనగర్‌లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెద్దఎత్తున ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు తమ ఓటును దరఖాస్తు ఫారంలో రిజిస్ట్రేషన్ చేసుకొని సంబంధిత ఫారాలను ఆన్‌లైన్‌లో కానీ సంబంధిత అధికారులకు కార్యాలయంలో గాని అందజేయాలని సూచించారు. ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమమే లక్ష్యంగా పని చేసేందుకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. చట్టసభల్లో ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు, ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. విజయదశమి పండుగ సందర్భంగా ఎమ్మెల్సీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కరీంనగర్‌లో ప్రారంభించినట్లు, నవంబర్ 6లోపు అర్హత గల ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు ఓటును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇక నుంచి ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా పర్యటించి పెద్దఎత్తున ఓటు నమోదు కార్యక్రమాన్ని చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, మాజీ కార్పొరేటర్ తుమ్మల రమేష్‌రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతరెడ్డి, తిరుపతి స్వామి, సురేందర్, అశ్విన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు అస్లాం ఎంపిక



నవతెలంగాణ - గంగాధర : గంగాధర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన అస్లాం అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ నెల 4 తేదీన సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన అస్లాం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అస్లాం పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 17 వరకు జోగులాంబ గద్వాలలో జరిగే అండర్ - 14 క్రికెట్ పోటీల్లో పాల్గొంటారని పీడి బాబు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన అస్లాంను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు గూడూరి అనిత కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా దసరా వేడుకలు



చొప్పదండి : వేడుకలకు హాజరైన ప్రజలు



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర క్రీడా మైదానంలో విజయదశమి సందర్భంగా రామ్‌లీలా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్వామి రాధా మనోహర్‌దాస్, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. వేడుకల్లో బాణాసంచా పేలుళ్ల మధ్య రావణదహన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఉత్సవాల్లో కరీంనగర్ స్వప్న, ప్రశాంత్, సందీప్ నృత్య బృందాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇప్పనపల్లి విజయలక్ష్మిసాంబయ్య, కౌన్సిలర్లు చేపూరి హేమ, మాడూరి శ్రీనివాస్, స్వతంత్ర భారతి, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, కృష్ణ, చేపూరి సత్యనారాయణ, కటుకం మహేష్, రమేష్, ఎన్నం మునీందర్, తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - హుజురాబాద్

దసరా పండగ వేడుకలు శనివారం రాత్రి హుజూరాబాద్ పట్టణంలో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రామ్‌లీలా రావణాసుర వధ కార్యక్రమం ప్రజల, ప్రజా ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. పండుగను పురస్కరించుకొని శ్రీరామచంద్ర స్వామి ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను అలంకరించిన వాహనంలో డప్పు చప్పుళ్లతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా మైదానానికి తీసుకొని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్సవాల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. హుజూరాబాద్ పట్టణానికి హైడ్రా అధికారులు వచ్చినట్టు తనకు తెలిసిందని అన్నారు. ఏ అధికారి ఆయన మీ ఇంటికి వచ్చినట్లయితే తనకు ముందుగా తెలియజేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్‌చైర్మన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు అపరాధ ముత్యంరాజు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకుడు గందె శ్రీనివాస్, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



హుజురాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం దసరా పండుగ సందర్భంగా దుర్గామాతకు, జమ్మిచెట్టుకు టౌన్ సీఐ తిరుమల్ గౌడ్, పోలీస్ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆయుధ పూజ నిర్వహించి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్స్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వీణవంకలో..

నవతెలంగాణ - వీణవంక

వీణవంక మండల కేంద్రంలో శనివారం సాయంత్రం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. శమీ వృక్షానికి గూడ జగదీశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. వీణవంక హైస్కూల్ ఆవరణలో రావణాసుర బొమ్మను టపాకాయలతో కాలి దహనం చేశారు.

వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పరిపాటి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. డప్పు చప్పుల మధ్య శమీ పూజ మహోత్సవం చేసి, జమ్మిని ఒకరికొకరు పంచుకొంటూ దసరా శుభాకాంక్షలు తెలిపారు.



మానకొండూర్ : శమీ పూజలో పాల్గొన్న భక్తులు

నవతెలంగాణ - మానకొండూర్

మండలవ్యాప్తంగా దసరా వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో ప్రజలు శమీ పూజ నిర్వహించారు. అనంతరం కొన్ని చోట్ల రావణ దహనం చేశారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి ఆయుధ పూజ నిర్వహించారు. మండలకేంద్రంలో నిర్వహించిన శమీ పూజలో మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్ పాల్గొన్నారు. దుర్గమాత రథోత్సవం ఊరేగింపులో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం





నవతెలంగాణ - వీణవంక

వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో దుర్గామాత సేవాసమితి ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. 16వ సంవత్సరం పురస్కరించుకొని అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినవారిని సన్మానించారు. లోకిని సంపత్ (స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం), మేకల తిరుపతిరెడ్డి (స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం), కనుకం ప్రసాద్ (ఫైర్‌మెన్ పోలీస్ డిపార్ట్మెంట్), బండారి మహేందర్ (గ్రామపంచాయతీ కార్యదర్శి), పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఘనంగా సన్మానించారు. గణేష్ కళాబృందం కళాకారుల ఆటపాటలు, చిన్నారులు నిహా అంజుం(గోదావరిఖని), నిమ్మల లిఖితలు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. కార్యక్రమంలో మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ ముదిరాజ్, దుర్గామాత సేవా సమితి అధ్యక్షుడు రాజోజుల అంజయ్య, ఉపాధ్యక్షుడు నల్లవెల్లి భవానిశంకర్, కోశాధికారి ఎలుబాక రవిందర్, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, గణేష్ కళాబృందం అధ్యక్షులు గోనెల పెద్దులు, ప్రధాన కార్యదర్శి పూదరి రమేష్, కోశాధికారి దూలం నరేష్, సేవా సమితి సభ్యులు బండారి సందీప్, ఎలుబాక నరేష్, కొలిపాక రామస్వామి, గాయకులు దరిపెల్లి మురళి, డప్పు కళాకారుడు మధు పాల్గొన్నారు.

శక్తివంతమైన సమాజానికి పాటుపడదాం
సహాయ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



నవతెలంగాణ - కరీంనగర్

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శక్తివంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆకాంక్షించారు. ఆదివారం కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం ఆవరణలో పార్టీ నేతలు, భక్తులతో కలిసి శమీపూజ నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

వేడుకలు సక్సెస్‌పై ఎమ్మెల్యే కవ్వంపల్లి హర్షం

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలోని ఎల్ఎండి కాలనీ రాంలీలా మైదానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన దసరా ఉత్సవాలకు జనం పోటెత్తారు. మానకొండూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచే కాకుండా కరీంనగర్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. దసరా ఉత్సవాలు విజయవంతం కావడంపై మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలు భారీగా తరలిరావడం అబ్బురపరిచిందని పేర్కొన్నారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించిన రాంలీలా ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. దసరా వేడుకలను తిలకించేందుకు విచ్చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ దంపతులకు, అదనపు కలెక్టర్ దంపతులకు, ఆర్డీవో, నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీరు, కార్యనిర్వాహక ఇంజనీరు, ఇతర అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

యువతకు టీ షర్టులు పంపిణీ



నవతెలంగాణ - మానకొండూర్

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ మోదుంపల్లి శేఖర్ శనివారం గ్రామ యువకులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మహనీయులు జీవితాలను ఆదర్శంగా తీసుకొని, తల్లిదండ్రుల ఆశయాల కనుగుణంగా ప్రతి ఒక్కరూ జీవితంలో గొప్పగా ఎదగాలని సూచించారు. అనంతరం దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గసిగంటి సంపత్, రొడ్డ అంజయ్య, మోదుంపల్లి శ్రీనివాస్, ఎం.గోపి, రామగిరి అంజనేయులు, కొండ్ర అర్జున్, శశిధర్, రాజు, నవీన్, హరీష్ పాల్గొన్నారు.

అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం



నవతెలంగాణ - కరీంనగర్

నగరంలోని ఎస్ఎఫ్ఎస్ గార్డెన్‌లో అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనం ముషాయిరా కార్యక్రమం నిర్వహించారు. విశిష్ట అతిథిగా సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ముషాయరాలు సమాజానికి మేలుకొలుపుగా దోహదపడతాయన్నారు. సమాజంలో జరుగుతున్న సామాజిక అసమానతలను రూపుమాపేందుకు, ప్రజలను తట్టి లేపేందుకు, సమాజాన్ని చైతన్య పరిచేందుకు ఉర్దూ కవి సమ్మేళనాలు నిర్వహణ అత్యంత ఆవశ్యకమన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి విచ్చేసిన సియాసత్ ఉర్దూ దినపత్రిక ఎడిటర్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్‌ను శాలువా కప్పి నరేందర్‌రెడ్డి ఆత్మీయంగా సన్మానించారు. అనంతరం సుడా చైర్మెన్ కోమటిరెడ్డిని నిర్వాహకులు ఆత్మీయంగా సన్మానించారు.

పురంశెట్టి బాలయ్యకు సన్మానం



నవతెలంగాణ - గన్నేరువరం

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన మైలారం గ్రామస్తుడు పురంశెట్టి బాలయ్యను గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు వరాల మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర కార్యదర్శిగా తన గ్రామానికి చెందిన బాలయ్య నియామకం గర్వకారణం అని అన్నారు. బాలయ్య మాట్లాడుతూ మున్నూరు కాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గాలకు కృతజ్ఞతలు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసిన యప్‌టీవీ సీఈవో

నవతెలంగాణ - వీణవంక : వీణవంక మండల కేంద్రంలో శనివారం సాయంత్రం యప్‌టీవీ సీఈఓ పాడి ఉదయ్ నందన్‌రెడ్డి స్వగృహంలో విజయదశమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శమీ వృక్షానికి పూజలు చేశారు. అనంతరం ఎప్పటిలాగానే దసరా రోజున స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. 220 మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు రూ.4లక్షలా 40వేల స్కాలర్‌షిప్ అందజేశారు. అనంతరం పాడి ఉదయ్‌నందన్‌రెడ్డి మాట్లాడుతూ తన తాత పాడి సుధాకర్‌రెడ్డి చూపించిన మంచి మార్గంలో తాను పుట్టిన స్వగ్రామానికి తనవంతుగా చదువుకోవడానికి పేద, మధ్యతరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు చదువు ఒక్కటే ఉన్నత శిఖరాలకు అధిరోహించడానికి ఏకైక మార్గమని సూచించారు. చదువు ద్వారానే మహిళా సాధికారతను, సమాన అవకాశాలు కల్పించవచ్చని అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
జగిత్యాల- పెద్దపల్లి
సోమవారం | అక్టోబర్ 14, 2024 | www.navatelangana.com

నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం కార్పొరేషన్ 6 డివిజన్‌లో గడ్డం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని రామగుడం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ ఠాకూర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రజలందరికీ అందుబాటులో సమాచారం ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, 6 గ్యారంటీలలో మహిళలకు బస్సు ఫ్రీ, 500 రూపాయలకే గ్యాస్, రైతులు రుణ మాఫీ, ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంటు



ఇవ్వడం జరుగుతుందని,ఇది కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళిస్వామి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్‌తోపాటుపలువురు నాయకులు, కార్యకర్తలున్నారు.

అకారణంగా దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

నవతెలంగాణ-రాయికల్:
మండలంలోని రామాజీపేట్ గ్రామంలో ప్రజలపై అకారణంగా దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రాయికల్ జగిత్యాల ప్రధాన రహదారిపై పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి 3 గంటల పాటు ఆందోళన చేపట్టారు.శనివారం రాత్రి వేములవాడ నరేష్ (38) అనే వ్యక్తి జంబిపూజ సమయంలో పూజ అయిన తర్వాత జంబి ఆకు తెంచుకోవాలని సూచించినందుకు అకారణంగా చితకబాదారని బాధితుడు వాపోయాడు. అతనితో పాటుగా మరో ఇరువురు వ్యక్తులపై యువకులు దాడి చేశారని, గ్రామంలో గత కొన్ని రోజులుగా ఏ పండగ జరిగిన కొందరు యువకులు మద్యం మత్తులో గ్రామస్తులపై దాడులకు పాల్పడుతూ భయాందోళనకు గురి చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు.వారిని ప్రశ్నించిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు.దాడులకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ వై.కృష్ణారెడ్డి, సి. హెచ్ సుధీర్‌రావు గ్రామస్తులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



సీనియర్ సిటీజన్స్ దసరా సమ్మేళనం

నవతెలంగాణ-జగిత్యాల టౌన్
తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో దసరా సమ్మేళనం నిర్వహించారు. శనివారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బతుకమ్మ పోటీల్లో విజేతలకు, దసరా క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జమ్మి ఆకులు పంచుకొంటూ అలయ్, బలయ్‌తో దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దసరా ప్రత్యేక సీనియర్ సిటీజన్స్ పిలుపు పత్రికల ను సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథము, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్, పి.సి.హన్మంత్ రెడ్డి, ఎం.డి.యాకూబ్, కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, దిండిగాల విఠల్, పబ్బా శివానందం, రాజ్ మోహన్, కండ్లే గంగాధర్, కాలగిరి గంగారెడ్డి,రాజేశ్వర్, ఉప్పుగళ్ల మురళిదర్, దేవేందర్ రావు, నారాయణ, సత్యనారాయణ, పుప్పాల నర్సింగా రావు, జిల్లా, డివిజన్, మండలాల సీనియర్ సిటీజేన్స్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



టిఫిన్‌లో జెర్రి

నవతెలంగాణ-జగిత్యాల టౌన్
జగిత్యాల పట్టణంలోని గణేష్ భవన్ ఉడిపి హెటల్లో టిఫిన్‌లో జెర్రి ప్రత్యక్షమైంది. ఇడ్లీలో మహిళకు జెర్రి రావడంతో ఆమె హెటల్ ముందు ఆందోళనకు దిగింది. హెటల్ యజమాని ఇది జెర్రి కాదంటూ దారమేనంటూ నోట్లో వేసుకున్నాడు. జెర్రి అని తెలడంతో వెంటనే ఉమ్మేసాడు. తర్వాత హెటల్ నిర్వాహకులు ఇడ్లీలను బల్దియా ట్రాక్టర్ లో తరలించే ప్రయత్నం చేయగా బాధితురాలు అడ్డుకుని ఇడ్లీలతో రోడ్డుపై భైఠాయించారు. ఫుడ్‌సెఫ్టీ అధికారులు హెటల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పద్మశాలీ సమాజ్ బెహరాన్ ఆధ్వర్యంలో పూలపండుగ

నవ తెలంగాణ-జగిత్యాల:
తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన పూల పండుగ బంతుకమ్మను బేహరాన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ బేహరన్‌లోని కన్నడ భవన్ ఆడిటోరియంలో పద్మశాలీ సమాజ్ బెహరన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ జీవన సంస్కృతిని ప్రతిబింబించేలా సాయంత్రం 5 నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఎంతో అట్టహసంగా నిర్వహించారు. పద్మశాలీ సమాజ్ బెహరాన్ కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ పద్మశాలి కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి వేడుకలు మన సంప్రదాయాలు ఆచార వ్యవహారాలను పాటించ దానికి, ఇక్కడ పుట్టి పెరిగిన పిల్లలకు కూడా తెలంగాణ సంస్కృతిని తెలియ చెప్పేలా ఇలాంటి వేడుకలు దోహద పడుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సమాజ్ బహరైన్ గౌరవ అధ్యక్షులు అల్లే గంగాధర్ నేత, అధ్యక్షులు వేముల కృష్ణ నేత, ఉపాధ్యక్షులు గంగుల సుదర్శన్ నేత, ప్రధాన కార్యదర్శి యేముల సుధాకర్ నేత, కోశాధికారి మేరుగు శ్రీనివాస్ నేత, సంయుక్త కార్యదర్శి బాలె శ్రీధర్ నేత, ఈవెంట్ కమిటీ హెడ్ దొంతుల శంకర్ నేత, సభ్యత్వ కార్యదర్శి దీకొండ శ్యామ్ ప్రసాద్ నేత, సలహా కమిటీ సభ్యులు ఇతర సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



గ్రామాల్లో దసరా వేడుకలు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం
ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాలు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు.గ్రామాల్లో ర్యాలీగా జంబిగద్దె వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి జంబి ఆకులను ఒకరికొకరు ఇచ్చుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. యామాపూర్ గ్రామంలో కల్వకుంట్ల రామారావు జంబి గద్దె వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విడిసి అధ్యక్షులు జేడీ విజయ్, నాయకులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాగుల గణేష్, భోరిగం మహేష్, క్యాతం రాజిరెడ్డి, కనుక నాగేష్,అయేటి శ్రీనివాస్, కాస దశరథం, నాయిని నడిపి గంగారం తదితరులు పాల్గొన్నారు.



జమ్మి గద్దె వద్ద పూజ చేస్తున్న రామారావు

జర్నలిస్టుల ఆధ్వర్యంలో పీఎస్ఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఎండపల్లి
ఎండపల్లి మండలం జగిత్యాల మూల మలుపు వద్ద టీయూడబ్ల్యూజే (ఐజేయూ) స్థానిక విలేఖరుల ఆధ్వర్యంలో పొనుగోటి శ్రీనివాస రావు 58వ పుట్టిన రోజు పుట్టినరోజు వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నల్లాల కుమార్, బొడ్డు రాజేశం, బాలసాని శ్రావణ్ కుమార్, నాగసముద్రాల శ్రీనివాస్ విశ్వకర్మ, చిలుక సతీష్, బెత్తపు లక్ష్మిరాజం, గుండగంగయ్య, ఉప్పు రమేశ్, ఐజేయూ తెలంగాణ రాష్ట్ర మండలి సభ్యుడు నక్క లక్ష్మన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



రైలు ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఓదెల:
ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జీలకుంట గ్రామానికి చెందిన రెడ్డి ఆదిత్య మూడు రోజుల క్రితం జీలకుంట గ్రామం నుండి బతుకుదెరువు కోసం పొత్కపల్లి గొల్లపల్లి గ్రామానికి వచ్చారు.ప్రమాదవశాత్తూ ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు.మృతునికి భార్య,కుమారుడు, కూతురు ఉన్నారు.

విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్
- కమిషనరేట్‌లో ఆయుధ, వాహన పూజలు

నవతెలంగాణ-గోదావరిఖని:
విజయదశమి పండుగ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల్ జోన్‌ల ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి అన్ని రంగాలలో విజయం చేకూర్చాలని, రామగుండం పోలీస్ కమిషనరేట్ అన్ని రంగాలలో అగ్రభాగంలో ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆకాంక్షించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ ఆయుధపూజ, వాహనపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శక్తికి ప్రతీకగా నిలిచే దుర్గామాత సమక్షంలో ప్రతి ఆయుధానికి ఎంతో శక్తి కలిగి ఉంటుందని, అలాంటి విజయాలను చేకూర్చే విజయదశమి పర్వదినోత్సవం అందరికి సుఖసంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. పోలీస్ శాఖలో ప్రతి స్థాయిలోని అధికారి ప్రజా రక్షణలో ముందుంటూ మన్ననలు అందుకుంటూ పోలీస్‌శాఖ గౌరవం మరింత పెరిగేలా పని చేయాలన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకుంటారని అన్నారు. సమాజంలో చెడును పారద్రోలేందుకు పోలీసు విభాగం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం వాహనాల పూజ నిర్వహించి అందరికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సుందర్ రావు, ఆర్‌ఐలు దామోదర్, మల్లేశం, వామన మూర్తి, సంపత్, శ్రీనివాస్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం, ఎస్ఐ, ఆర్ఎస్ఐలు, డ్రైవర్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ పాల్గొని ఆయుధ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆయుధ పూజ నిర్వహిస్తున్న రామగుండం పోలీస్ కమిషనర్

సమస్యలపై పట్టింపు లేక ఒక స్ట్రక్చర్ సమావేశాన్ని కోల్పోయిన గుర్తింపు సంఘం

నవతెలంగాణ-గోదావరిఖని:
సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పట్టింపు లేక ఒక స్ట్రక్చర్ సమావేశాన్ని గుర్తింపు సంఘం కొల్పోయిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్‌ఆర్జీ 1 బ్రాంచి కమిటీ అధ్యక్షులు ఆరెపల్లి రాజమౌళి, కార్యదర్శి మెండే శ్రీనివాస్ ఒక ప్రకటనలో ఆరోపించారు. యాజమాన్యం నిర్వహించిన ఎన్నికలలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలిచి నేటికీ 9 నెలలు గడిచినా సీఐటీయూ చేసిన పోరాటం మేరకు యాజమాన్యం రెండు సంవత్సరాలకే గుర్తింపు పత్రం ఇచ్చి ప్రతి నెల రెండో మంగళవారం ఏరియా లెవెల్‌లో స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహిస్తామని చెప్పి సర్క్యులర్ ఇచ్చినా గెలిచిన సంఘం స్ట్రక్చల్ సమావేశాలలో మాట్లాడాల్సిన కార్మిక సమస్యలపై పట్టింపు లేకుండా యాజమాన్యం నిర్వహిస్తున్న బదా ఖానాను వ్యతిరేకిస్తున్నామంటూనే కార్యక్రమాల్లో వేదికలపై ఉంటున్న తీరు సరైనది కాదని పేర్కొన్నారు. ఇప్పటికే లాభాల వాటా విషయంలో గుర్తింపు సంఘంగా విఫలమయ్యారని, ఇప్పటికైనా మీకున్న రెండు సంవత్సరాల కాలంలో ఒక స్ట్రక్చర్ మీటింగ్‌ను కోల్పోయారని, వెంటనే యాజమాన్యంకు కార్మిక సమస్యలైన మంచినీటి సమస్య తీర్చేందుకు, గ్రావిటీ ఫిల్టర్ బెడ్డు యుద్ద ప్రతిపాదికన నిర్మాణం పూర్తి చేసి త్రాగునీరు అందించాలని, సిఎస్‌పి 1 బొగ్గు దుమ్ము ధూళితో చుట్టుపక్కల ప్రజలతోపాటు కార్మికులు అనారోగ్య సమస్యలకు గురి అవుతున్నారని, వెంటనే బొగ్గు దుమ్ము ధూళి నివారణ చర్యలు చేపట్టాలని, గనులకు వెళ్లే రహదారిని బాగు చేయించాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని, క్వార్టర్ లేని కార్మికులకు రామగుండం కార్పొరేషన్ ఇంటి కిరాయి చెల్లించాలని, సింగరేణి ఏరియా హాస్పిటల్‌ను ఆధునికరించి అన్ని వ్యాధులకు స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించాలని, డిస్పెన్సరీలో పూర్తిస్థాయి వైద్యులతో పాటు రక్త పరీక్షలు నిర్వహించడానికి పాతాలజిస్టును నియమించి ఆస్పత్రిని అప్ గ్రేడ్ చేయాలని, ఏరియాలోని అన్ని గనులపై కార్మికుల వస్తువులు భద్రపరుచుట కొరకు సేఫ్టీ లాకర్ల ఏర్పాటు చేయాలని, క్లర్కుల కొరకు ఆఫీసులలో కొత్త ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని, క్వార్టర్లలో ఉంటున్న ఇతరులను ఖాళీ చేయించాలని, కార్మిక కాలనీలలోని రోడ్లు బాగు చేయించాలని కోరుతూ ముందుగానే నోటీసు ఇచ్చి ఈ నెలలోనైన స్ట్రక్చర్ మీటింగ్లు ఏర్పాటు చేసి ఏరియా సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.



శ్రీనివాస్



రాజమౌళి

ఎమ్మెల్యేకు దసరా శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను గోదావరిఖని జవహార్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన దసరా వేడుకల సందర్భంగా 48వ డివిజన్ కార్పొరేటర్ పొన్నం విద్య లక్ష్మణ్ గౌడ్, పెద్దపల్లి జిల్లా మోకు దెబ్బ అధ్యక్షుడు బెందే నాగభూషణం గౌడ్ కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.




కొత్త సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:
దసరా పండగ సందర్భంగా గోదావరిఖని స్టేడియంలో జరిగిన వేడుకలలో కొత్త సినిమాకి సంబంధించిన సినిమా పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ చేతులమీదుగా పోస్టర్ విడుదల చేశారు. గోదావరిఖనికి చెందిన సింగరేణి కార్మికుడు అయిన ఎండి.హుస్సెన్ కొడుకు ఎండి. అజహరుద్దీన్ తీసిన కొత్త సినిమాకు ప్రొడ్యూసర్‌గా, డైరెక్టర్‌గా చేస్తూ సినిమాలో అందరు మన స్థానికులను 100 మందికి పైగా నటీనటులతో కొన్ని సంవత్సరాలుగా తీసిన సినిమా సూపర్ హిట్ కావాలని ఆకాంక్షించారు. ఈ సినిమాలో నటీనటులుగా ఆడేపు సురేశ్, రామంచి రాకేశ్, అన్వేష్, గోపి నటించారు. డైరెక్షన్ టీమ్‌లో గోపి, రాకేష్, విద్యాసాగర్‌లు చేశారు. 100 మందికిపైగా స్థానికులే నటీనటులుగా ఉండటం విశేషం.ఈ సినిమా పనులు అన్ని దాదాపు పూర్తి కాగా ఇంకో 2 నెలల్లో తెలుగు రాష్ట్రాలలో విడుదలకు సిద్ధం అవుతున్నట్టు డైరెక్టర్ అజార్ తెలిపారు.

కొత్త రాజిరెడ్డి మరణం టీడీపీకి తీరని లోటు

నవతెలంగాణ-గోదావరిఖని:
తెలుగుదేశం పార్టీ రామగుండం నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొత్త రాజిరెడ్డి మరణం పార్టీకి తీరని లోటని పార్టీ నాయకులు అన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రామగుండం నియోజకవర్గం పక్షాన ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. భౌతిక ఖాయంపై తెలుగుదేశం పార్టీ జెండా కప్పి ఆత్మకుశాంతి చేకూరాలని ఆకాంక్షించారు. వారి కుటుంబాన్ని ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల ఏడుకొండలు, టీఎన్‌టీయూసీ పెద్దపల్లి పార్లమెంట్ అధ్యక్షుడు ముదిగంటి దామోదర్ రెడ్డి, నాయకులు గుండబోయిన ఓదెలు, పెగడల్లి రాజనర్సు, సుందిళ్ల స్వామి తదితరులున్నారు.



గ్రామస్తుల ఆందోళన..

నవతెలంగాణ-కథలాపూర్
కథలాపూర్ మండలం దుంపేట శివారులో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. దుంపేట శివారులో ఉన్న రెండు ఎకరాల పదిగుంటల భూమి తమ గ్రామానికి చెందిందని ఆందోళన చేపట్టా రు. ఈ క్రమంలో గ్రామస్తులకు రెడ్డి జనసంఘ నాయకుల మధ్య తోపులాట జరిగింది. గత కొంతకాలంగా ఆ భూమిలో మండల రెడ్డి జన సంక్షేమ సంఘం వారు మామిడి చెట్లు,చుట్టు ఫినిషింగ్ చేసి వాడుకుంటున్నారు.తమ గ్రామానికి చెందిన భూమిని రెడ్డి జన సంక్షేమ సంఘం వారు వాడుకుంటు న్నారన్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీఐ సురేష్ బాబు, ఎస్ఐ నవీన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ మధుకర్ సంఘటన స్థలం చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంగా నాయకులు,భూమారెడ్డి,మహేందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి,సంజీవ రెడ్డి,మండల రైతు సంగాలను సామరస్యంగా మాట్లాడుకోవాలని తెలిపారు.



ఘనంగా విజయదశమి వేడుకలు

నవతెలంగాణ-మల్లాపూర్
మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ప్రజలు విజయదశమి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సంద ర్భంగా ఆయా గ్రామాల లో దుర్గాదేవిని గ్రామంలో పురవీధుల గుండా ఊరేగించారు. గ్రామ శివారులో ఏర్పాటుచేసిన మహిషాసుర దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు దుర్గాదేవిని ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు.



సరస్వతి ఆలయ కార్య నిర్వహణ అధికారి మృతి

నవతెలంగాణ-మల్యాల
మల్యాల మండలంలోని నూకపల్లి ఇందిరమ్మ అర్బన్ కాలనీలో గల సరస్వతి అమ్మవారి ఆలయంలో కార్య నిర్వాహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎ.రాజం మృతి చెందారు. విజయదశమి సందర్భంగా దేవీ నవరాత్రులలో భాగంగా ఆయుధ పూజా జంబి అనంతరం జగిత్యాలలోని తమ నివాసం వెళ్లగా సాయంత్రం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు జగిత్యాలలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలోని చనిపోయారు.



వాహన పూజ ఆదాయం రూ.3,37,900

నవతెలంగాణ-మల్యాల
మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో దేవీ నవరాత్రోత్సవాల (దసరా) సందర్భంగాగత సంవత్సరం వాహన పూజల ద్వారా మూడు రోజులకు రూ. 2,67,600 రూపాయల ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణాధికారి తెలిపారు. ఈ సంవత్సరం మూడు రోజులకు రూ.3,37,900ల ఆదాయం సమకూరిందని అని, గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం వాహన పూజల ద్వారా రూ.70,300లు అదనంగా సమకూరిందని తెలిపారు.

అంజన్నను దర్శించుకున్న జడ్జీ

నవతెలంగాణ-మల్యాల
జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానానికి కరీంనగర్ జిల్లా ఎస్సీ ఎస్టీ సెషన్స్ కోర్టు జడ్జీ ఏ.నీరజ కుటుంబ సమేతంగా విచ్చేసి అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జడ్జీ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్ శేషవస్త్రం కప్పి స్వామి వారి ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు కపిందర్, ప్రధానచార్యులు రామకృష్ణ, అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-మల్లాపూర్
మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన యువకుడు ఆర్థిక ఇబ్బంది లతో హైదరా బాద్ శివారు లో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ముత్యం పేట గ్రామానికి చెందిన మారగాని రాజు (35) ఒక సంవత్సరం క్రితం బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. రాజు గత కొన్ని నెలలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడు తున్నాడు. హైదరాబాద్ శివారులో మాసాయిపేట వద్ద ఉన్న రైల్వే ట్రాక్ వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, ముగ్గులు పిల్లలు ఉన్నారు.



పోతారంలో ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం పోతారం గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు, సీఎస్‌సీ ఆరోగ్య సంరక్షణ జిల్లా కోఆర్డినేటర్ భాస్కరి తిరుపతి సూచనలతో గ్రామ కార్యదర్శి దివ్య ఆధ్వర్యంలో భవన, ఇతర నిర్మాణ కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరం ఆదివారం నిర్వహించారు. సంక్షేమ బోర్డు ద్వారా లేబర్ కార్డు పొందిన కార్మికునికి 50 రకాల ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్క కార్మికుడు ఈ ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. లేబర్ కార్డుపైన 22 మందికి ఆదివారం ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతీ ఒక్క కార్మికుడు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసి రోజ, ఫ్లోబోటోమిస్ట్ మెరుగు రమ్య, బర్ల కుమార్ తదితరులున్నారు.

యువకుడి మృతి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన నల్ల పోచమ్మ వాడలో విషాదం చోటుచేసుకుంది. పెద్దపల్లి పట్టణంలోని నల్ల పోచమ్మ వాడలో గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉంది

ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్

నవతెలంగాణ-ఓదెల
ఓదెల మండలం పొత్కపల్లి గ్రామంలో దుర్గాదేవి నవరాత్రుల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గుండేటి ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీర్వాదంతో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమాన్ని సాధించుకుందామన్నారు. ప్రజాకాంగ్రెస్ ప్రభుత్వం,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలపై మాకు పూర్తి విశ్వాసం ఉందన్నారు.మంత్రి శ్రీధర్ బాబు,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణల నాయక త్వంలో ఉద్యమకారుల అందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కందుల సదాశివ, ఆళ్ళ శ్రీనివాస్ రెడ్డి,వెంకట్ రెడ్డి,రవిందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,మేకల శ్రీనివాస్,ఉప్పల సదయ్య, ఉడుత రాజయ్య ,తోకల మల్లయ్య,ఉషకమల్ల శ్రీనివాస్,బాను,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



దుర్గామాతను దర్శించుకుంటున్న గుండేటి ఐలయ్య

ప్రమాదవశాత్తు పొలంలోకి దూసుకెళ్లిన కారు

నవతెలంగాణ-ఓదెల
ఓదెల మండలం గుంపుల గ్రామ శివారులో ఆదివారం కారు పొలంలోకి దూసుకెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మడక గ్రామం నుండి జమ్మికుంట మండలం సీతంపేటకు వెళ్తున్న క్రమంలో గుంపుల గ్రామ శివారులో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. బాయమ్మ పల్లి గ్రామం నుండి గుంపుల గ్రామం వరకు రోడ్డు పనులు జరుగుతుండడంతో కారు అతివేగంగా వెళ్లడం వల్ల రోడ్డు పై పోసిన కంకర వల్ల కారు పొలంలోకి దూసుకెళ్లింది.



ఘనంగా దసరా వేడుకలు..

నవతెలంగాణ-మెట్‌పల్లి
మెట్‌పల్లి పట్టణ,మండల గ్రామాల్లో శనివారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మెట్‌పల్లి మార్కెట్ యార్డ్‌లో జరిగిన దసరా వేడుకల్లో ఎమ్మెల్యే సంజయ్,మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావులు శమీ పూజలు నిర్వహించి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాణవేని సుజాత,నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

నవతెలంగాణ-మెట్ పల్లి
మెట్‌పల్లి పట్టణంలోని సాయి బాబా ఆలయంలో బాబా 106వ పుణ్యతిథినీ పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పూజల అనంతరం అన్నదాన కర్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని ఆత్మకూరు గ్రామంలోని సాయిబాబాకు వెండి కిరీటంను కాంగ్రెస్ నాయకులు కూన గోవర్ధన్ దంపతులు బహుకరించారు.ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ రణవేణి సుజాత సత్యానా రాయణ, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



అన్నదానంను కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రామగుండం ఇన్‌ఛార్జి

నవతెలంగాణ-గోదావరిఖని:
మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ ప్రత్యేక ఆహ్వానం మేరకు అలయ్ బలయ్ కార్యక్రమంలో రామగుండం బీజేపీ ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడు తూ పార్టీలకు అతీతంగా నాయకులు ఏకతాటి పైకి వచ్చి కలిసి ప్రజల కోసం, రాష్ట్రం కోసం, దేశం కోసం కలిసి మెలిసి పని చేయాలి అనే ఉద్దేశంతో ఒకరికొకరు ఆలింగనం చేసుకునే కార్యక్రమమే అలయ్ - బాలయ్ అని, పార్టీలు ఏవైనా సరే కండువాలు పక్కన పెట్టి అందరిని కలిపేది అలయ్ బాలయ్ అని అన్నారు. 2005లో తెలంగాణ ఉద్యమ సందర్భంగా అన్ని పార్టీలు కలిసి పని చేయాలని ఉద్దేశంతో బండారు దత్తాత్రేయ పెట్టిన కార్యక్రమమని, ఇలా ప్రతి ఏడు దసరా మరుసటి పెట్టే కార్యక్రమం ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందని అన్నారు. అన్ని పార్టీల వారితో స్నేహపూర్వకంగా మెలగడం దత్తన్నకే చెల్లిందని కొనియాడారు.



అలయ్-బలయ్ కార్యక్రమంలో పాల్గొన్న సంధ్యారాణి

ఘనంగా దసరా వేడుకలు



ఆలయాల్లో ప్రత్యేక పూజలు

- రామ్ లీలా మైదానంలో రావణ దహనం

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విజయ దశమి వేడుకలను ప్రజలు శనివారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకోని దేవాలయాలు, దుర్గామాత మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన వస్త్రాలు ధరించి వాహన, జమ్మి చెట్టుకు పూజలు చేశారు. సాయంత్రంవేళ జమ్మిని ఒకరినొకరు పంచుకుంటూ దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మానేరు తీరంలో శమీ వక్షానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రామ్ లీల మైదానంలో రావణ దహనం చేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల ఊరేగింపు కనుల పండుగగా కొనసాగింది. అంతకుముందు దుర్గామాత విగ్రహాలకు నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళల కోలాటాలు, భజనలు, యువత ఆనందోత్సవాల శోభ యాత్ర నిర్వహించారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు మేర్గు సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ ఆడపు రవీందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ - చందుర్తి

మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం దసరా వేడుకలు ప్రశాంతంగా జరిగాయి.గ్రామ కూడలిలో గ్రామ దేవతల వద్ద అలంకరణ చేసి జంమ్మి పూజ చేసి ఒకరికొకరు పండగ శు భాకాంక్షలు తెలువుకున్నారు.అదేవిదంగా గొడవలు జరుగకుండా పోలీసులు పెట్రోలింగ్ చేశారు.

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

తంగళ్ళపల్లి మండల కేంద్రంలో శనివారం ఘనంగా విజయదశమి వేడుకలు ప్రజలు నిర్వహించుకున్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో విజయదశమి వేడుకలను ఆయా గ్రామాలల్లో తంగళ్ళపల్లి ఆదర్శ యూత్ క్లబ్, పద్మశాలి సంఘం, పద్మనగర్ పద్మశాలి సేవా సంఘం, ఆదర్శ క్లబ్,ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు,ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. కొత్త బట్టలు ధరించి జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించి, ఒకరినొకరు జమ్మిని పంచుకొని అలైబలై చేసుకున్నారు. సాయంత్రం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిషాసుర మర్దిని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిషాసురుని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నూతనంగా ఎన్నికైన సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వేల్పుల స్వరూప తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగ్ గౌడ్, రిటైడ్ జిల్లా జడ్జ్ వరప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బండి దేవదాస్, వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షులు ఎడమల శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సామల గణేష్, క్లబ్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ

నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండలం పోలీస్ స్టేషన్ లో దసరా పండుగను పురస్కరించుకొని వాహనాలు, బైక్‌లు , కంప్యూటర్లు, తుపాకులు, ఇతర వస్తువులను వేధపండితుల మంత్ర ఉచ్చారణతో శనివారం ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఎల్లయ్య గౌడ్ మాట్లాడుతూ ఈ ఏడాది మండల పరిసర ప్రాంతాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సామరస్యమైన జీవితాన్ని ప్రజలు గడపాలని కోరి మండల ప్రజలకు దసర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, కానిస్టేబుల్ కార్తిక్, మల్ల గౌడ్, క్రాంతి, బాబు, రియాజ్, నయీం పాషా ఉన్నారు.



వీర్నపల్లి మండలం కేంద్రంతోపాటు పలు గ్రామాలలో దసరా పండుగను పురస్కరించుకొని శనివారం దుర్గామాత కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన జమ్మికొమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఒకరికొకరూ జమ్మిని పంచుకొని శు భాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు అరుణ్ కుమార్, మాజీ ఉప సర్పంచ్ రవి, రామస్వామి, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లక్ష్మన్, ఆలయ చైర్మన్ దేవయ్య, మండల నాయకులు గ్రామాల పెద్దలు ఉన్నారు.

కసితో చదివిన చదువు ఎప్పటికీ వృథా కాదు

ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్

నవతెలంగాణ - గంభీరావుపేట :

కసితో కష్ట పడిన చదువు ఎప్పటికి వృథా కాదని టాస్క్ ఫోర్స్, ఎక్సైజ్ సీఐ మరాఠీ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం గంభీరావుపేట మండల పరిధిలోని నర్మాల గ్రామానికి చెందిన యువతీ,యువకులు పలు రంగాల్లో ఉద్యోగాలు సాధించడంతో మరాఠీ పరివారం తరపున మల్లిఖార్జున్, చంద్రశేఖర్, అజయ్‌లు ఉద్యోగాలు పొందిన వారితోపాటు వారి తల్లిదండ్రులకు ప్రాథమిక పాఠశాల ఆవరణలో సన్మానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల ఎదుగుదలకు కృషిచేస్తూ, మిత్రులతో కలిసి తిరిగేటప్పుడు నిఘా పెడితే కసితో కష్ట పడిన చదువు ఎప్పటికి వధా కాదన్నారు.ఉన్నత చదువుతో ఉద్యోగాలు పొంది పలువురికి మార్గదర్శకులయ్యారని కొనియాడారు.సన్మానం పొందిన వారిలో రంగినేని పల్లవి (ఏఈఈ),అంగూరి బాల నర్సు (సీఐఎస్ఎఫ్ జవాన్), కస్తూరి వంశీ (ఆర్మీ), పాక వేణు యాదవ్ (పోలీస్ కానిస్టేబుల్), పాక రంజిత్ యాదవ్ (ఆర్మీ జావాన్), తొట్ల కుమార్ యాదవ్(టీచర్), చింతల విద్యా రాణి (టీచర్),ఎంద్రాల అనన్య (వైద్యురాలు), పసుపునూరి శ్రీలేఖ సీఏ (ఐసీఐసీఐ జోనల్ మేనేజర్)ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగారాం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రాజు, తిరుపతి గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఓరగంటి నర్సింహులు, వైస్ చైర్మన్ ధ్యానబోయిన రాజు, నిమ్మల రమేశ్ గౌడ్, ఆర్ఎంపీ డాక్టర్లు మల్లేశం, శ్రీరాములు, ఆంజనేయులు, కిషోర్, రత్నాకర్, అనిల్, ఉమర్ అలీ, సత్యనారాయణ, రాజు, మహేశ్, కళ్యాణ్ రాజేందర్ మల్లేశం, శ్రీనివాస్ సూరజ్, స్వామి, రాజు, భాస్కర్, నవీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొండగట్టు అంజన్న ఆలయంలో చోరీ

అన్నదాన సత్రంలో సరుకుల దొంగతనం

నవతెలంగాణ - మల్యాల

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదాన సత్రంలో నిత్యవసర సరుకులు దొంగతనం జరిగినట్లు దీనికిగానూ ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాములు అనే ఉద్యోగి అపహరించినట్లు సీసీటీవీ ద్వారా పర్యవేక్షించిన ఏఈఓ ఆంజనేయులు మేము జారీచేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అంజన్న ఆలయంలో అన్నదాన సత్రంలో చోరీ జరగడం బాధాకరమని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన నిఘా లేకపోవడం వల్లనే ఉద్యోగులకు భయం భక్తి లేకుండా వీధిలో నిర్వహిస్తున్న ఉద్యోగులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఆలయ పవిత్రతతోపాటు ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని భక్తులు సూచిస్తున్నారు.

అవమాన భారంతో వ్యక్తి ఆత్మహత్య

అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులే కారణం?

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

అప్పు ఇచ్చిన వ్యక్తి ఇష్టం వచ్చినట్లు తిట్టాడని ఓ వ్యక్తి అవమానం భరించలేక పండగపూట ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కేసీఆర్ కాలనీలో పండగపూట విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కెసిఆర్ కాలనీకి చెందిన దుబాసి సాయికష్ణ(27) తల్లిదండ్రులు నారాయణ విజయ లతో కలిసి జీవిస్తున్నారు. నూతి అనిల్ అనే వ్యక్తి వద్ద గతంలో రూ.20వేలు తీసుకున్నాడని, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు సాయి కృష్ణను వేధించేవాడని, బెదిరింపులకు గురి చేసేవాడని తల్లి విజయ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పండగ పూట శనివారం రోజున కూడా చాలాసార్లు ఫోన్ చేసి ఇచ్చిన డబ్బులను చెల్లించాలని, డబ్బులు ఎప్పుడు ఇస్తావురా... అంటూ తిట్టాడని, డబ్బులు ఇవ్వకపోతే చంపుతానని బెదిరించి తన కొడుకు సాయి కృష్ణ ఫోన్‌ను అనిల్ బలవంతంగా లాక్కొని వెళ్లిపోయాడని చెప్పారు. దీంతో సాయి కృష్ణ అవమాన భారంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి విజయ ఇచ్చిన ఫిర్యాదు తీసుకొని, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. సాయి కృష్ణ మృతికి కారణమైన నూతి అనీల్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఎవరైనా అధిక వడ్డీలకు డబ్బులు అప్పులుగా ఇచ్చి వారిని వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై రామ్మోహన్ హెచ్చరించారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ - మల్యాల

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మల్యాల మండలంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. మల్యాల మండలంలోని తాటిపెల్లి గ్రామానికి చెందిన అట్ల మైపాల్ రెడ్డి(40) భార్య మాధవితో కలిసి ధర్మారం మండలంలోని బంధువుల ఊరికి వెళ్లి ఆదివారం తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కటికనపల్లి సమీపంలో రోడ్డుపై కుక్కలు అడ్డురాగా బ్రేక్ వేయడంతో రోడ్డుపై పడ్డాడు. ఈ ఘటనలో మహిపాల్ రెడ్డి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. భార్య మాధవికి గాయాలు కావడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కూతురు, కొడుకు ఉన్నారు. గల్ఫ్ దేశం వెళ్లి జీవనం సాగిస్తున్న మైపాల్ రెడ్డి కొన్ని రోజుల్లో క్రితం కండ్ల ఆపరేషన్ చేయించుకుని 10రోజుల్లో విదేశాలు వెళ్లాల్సి ఉండే, దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. హెల్మెట్ పెట్టుకుని ఉంటే ప్రాణాలతో బయటపడి ఉండేవాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలువురిపై కత్తులతో దాడి

ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-మల్యాల

పలువురిపై కత్తుల దాడి జరిగిన సంఘటన మల్యాల మండలంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. మల్యాల మండలంలోని శనివారం రాత్రి ఓబులాపూర్ గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు కలిసి అదే గ్రామానికి చెందిన మెరుగు మనోహర్‌పై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో మెరుగు మనోహర్‌కు పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. అలాగే మండల మహేష్, మండల దినేష్ అనే వ్యక్తులపై కూడా దాడి చేయగా గాయపడిన మెరుగు మనోహర్ ఫిర్యాదు చేశాడు. దీంతో దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరేష్ కుమార్ తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- లైసెన్సు లేని పత్తి వ్యాపారుల దోపిడీని అరికట్టాలి
- సీపీఐ(ఎం) బోయినిపల్లి మండల నాయకుల డిమాండ్

నవతెలంగాణ - బోయినిపల్లి



మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో మండల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడుతూ యుద్ధ ప్రతిపాదికన సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. లైసెన్స్ లేని పత్తి వ్యాపారుల దోపిడీని అరికట్టి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7500 రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు సింగిరెడ్డి శంకర్,ఎర్ర నాగరాజు, కడుదుల రవి, అను మూల రవి, ఆవుల రాములు, గుడేటి వెంకట్రెడ్డి, అనుముల లింగయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

నవతెలంగాణ - జమ్మికుంట



విజయదశమి పండుగ రోజు అందరూ ప్రశాంతంగా దసరా ఉత్సవాలను జరుపుకుంటున్న సమయంలో అనుకోకుండా జరిగిన ఒక ప్రమాదంలో పలువురు గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న ఘటన జమ్మికుంటలో జరిగింది. స్థానిక ప్రజలు, కారు యజమాని పూజారి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. పూజారి, భార్య రాధిక వారి పనిమనిషి డ్రైవర్ అనిల్ ఏదో అనే నిమిత్తం కాలేశ్వరం వెళ్లి తిరిగి వస్తున్నారు. పట్టణంలోని ఆదిత్య బార్ సమీపంలో రోడ్డు డివైడర్‌ను కారు ఢీకొట్టింది. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఒక్కసారిగా పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది.

కారు ఢీ కొట్టిన విధానం చూస్తుంటే కారులో ప్రయాణించే వారు బతికే అవకాశాలు లేవు. కారు ప్రమాదం జరగగానే ముందు ఉన్న రెండు బెలూన్లు ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పిందని, వెనుక సీట్లో కూర్చున్న పూజారికి, ఆయన భార్య రాధికకు తీవ్ర గాయాలు కాగా హనుమకొండలోని ఒక ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమకు దరఖాస్తు ఇవ్వలేదని, ఇస్తే కేసు నమోదు చేసి విచారణ చేపడుతామన్నారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమా లేక నిద్రమత్తు, అధిక వేగమా అనేది తెలియ రాలేదు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చొప్పదండి విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ - చొప్పదండి



చొప్పదండి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి టి.తరుణ్ కుమార్ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లుగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుండి జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే అండర్ 14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నాడు. ఈ నెల రెండో తేదీన సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఎంపికైనట్టు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థితోపాటు శిక్షణ ఉపాధ్యాయుడు కృష్ణను ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



నవతెలంగాణ - జమ్మికుంట : క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పల్లె ప్రభాకర్ గౌడ్ ఆదివారం మండలంలోని కోరపల్లి గ్రామంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు పది రోజుల నుండి ఈ గ్రామంలో క్రికెట్ పోటీలను నిర్వహించినట్టు చెప్పారు. మొదటి బహుమతి సాధించిన ఏజె లెవెన్ క్రికెట్ టీం కెప్టెన్ రెడ్డబోయిన అజయ్‌కి రూ.12వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. రెండో బహుమతి ఈగల్ 11 క్రికెట్ టీం కెప్టెన్ బోయిని వినయ్ సభ్యులకు 8వేల నగదుతో పాటు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవి గౌడ్ ,పల్లె సంపత్‌గౌడ్, గండి రంజిత్ కుమార్‌గౌడ్‌చ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌కు సన్మానం

నవతెలంగాణ - జమ్మికుంట



ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌ను ఆయన స్వగ్రామం జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని మానాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. జమ్మి ఆకులు, అమ్మవారి కంకణం, అమ్మవారి కండువా కప్పి, శాలువాతో సన్మానించి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కసుభోజల వెంకన్న, ఎండి సలీం పాషా, చిన్నింటి నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

మన్నెంపల్లిలో హైమాస్ట్ లైట్లు ప్రారంభం



నవతెలంగాణ - తిమ్మాపూర్ : తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతో దళిత కాలనీలో దసరా కానుకగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు గ్రామ మాజీ సర్పంచ్ మేడి అంజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. బండి సంజయ్ భవిష్యత్తులో గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గొల్ల గణేష్, కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, రావుల శంకర్‌గౌడ్, కామెర రవి, కందుకూరి ఈశ్వరచారి, పార్నంది జలపతి, పార్నంది దుర్గయ్య, శ్రీనివాస్, వెంకటేష్, రావుల శ్రీనివాస్‌గౌడ్, దుర్గం జంపయ్య, సత్తయ్య, కిషన్ రాజ వీరు, ఎడ్ల ఆదిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందికి దుస్తులు అందజేత

నవతెలంగాణ - తిమ్మాపూర్ :



మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ దసరా పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందికి నూతన దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు గోవిందరావు, నాంపల్లి శ్రీనివాస్, పార్నంది సంపత్, కామెర శ్రీనివాస్, కారోబార్ సురేష్, బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువులో చేతి పంపు..!

నవతెలంగాణ - చందుర్తి



చెరువులో చేతి పంపు అని అనుకుంటున్నారా..! అవును మండలంలోని అనంతపల్లి గ్రామంలోని ధర్మసాని చెరువులో పది సంవత్సరాల కిందట తాగునీటి ఎద్దడి ఏర్పడగా అప్పటి ప్రజా ప్రతినిధులు చెరువులో బోరు వేశారు. దీంతో ఆ చేతి పంపు వర్షాకాలం నీటిలో మునిగి పోవడంతో ఇదేంటీ చెరువులో చేతి పంపు అని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు.

భార్యను హత్య చేసి భర్త పరార్

నవతెలంగాణ - వీర్నపల్లి

వీర్నపల్లి మండలం జవహర్ లాల్ నాయక్ తండా గ్రామానికి చెందిన గుగులోతు సుశీలను భర్త హత్య చేసి పారిపోయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం గుగులోతు రవి తాడు సహాయంతో తన భార్య సుశీలను హత్య చేసి పరారాయ్యాడు. ఈ మేరకు సుశీల అన్న భూక్య లోక్‌నాయక్ ఫిర్యాదుతో గూగులోతు రవిపై సెక్షన్ 103,238 ఆఫ్ బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్లయ్య గౌడ్ తెలిపారు. నిందుతుని కొసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. సుశీలకు కూతురు షర్మిల(16) కొడుకు సాయి చరన్(13) ఉన్నారు. తల్లి మరణం , తండ్రి పరారీ కావడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పిల్లలు తల్లి ఇక తిరిగి రాదని తెలిసి రోదిస్తున్న తీరును చూసి స్తానిక ప్రజలు కంటతడి పెట్టుకున్నారు.

ఉత్కంఠభరితంగా ఆర్యవైశ్య జిల్లా మహాసభ

జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



నవతెలంగాణ - ముస్తాబాద్

జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష ఎన్నికలు ఉత్కంఠ భరితంగా ఆదివారం నిర్వహించారు. కటకం శ్రీనివాస్‌పై బుస్సా పదశరథం 35ఓట్ల మెజార్టీతో గెలిచారు. జిల్లా ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా అధ్యక్షుడు భూషరథం అన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు లింగన్నపేట విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ - గంభీరావుపేట :



మండలం లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గుగులోత్ రాఘవ (7వ తరగతి) ఈ నెల 4 న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన యస్జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 14 క్రికెట్ సెలెక్షన్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంటి గంగారం, ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు అభినందించారు.

జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఆయుధపూజ

నవతెలంగాణ - జమ్మికుంట



విజయదశమి సందర్భంగా జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో సిఐ వరంగంటి రవి ఆధ్వర్యంలో ఆయుధపూజ నిర్వహించారు. ఎస్సై ఆరోగ్యంతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్ సర్కిల్ పరిధిలో ఉన్న ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బంది ఒకరికి ఒకరు జమ్మి ఆకులు అందించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జమ్మికుంట పట్టణంతోపాటు మండలంలోని 20 గ్రామపంచాయతీలలో దసరా పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా, ప్రశాంతంగా జరుపుకున్నారు.

అలరించిన ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో 2007-08 విద్యాసంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరు పాఠశాల జ్ఞాపకాలను పంచుకుంటూ ఆనందోత్సవాలతో గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు సంగోజు సూర్యప్రకాష్, ఏటుకూరి శ్రీనివాస్‌రావు, ఇందారపు ప్రకాష్, గుల్లపల్లి రవిశంకర్, దెబ్బటి సత్యనారాయణ, గంగాభవాణి, సునీత, పరికిపల్ల వెంకటరమణ, ఇమాదుద్దీన్‌లను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని తుంగెడ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు డీఎస్సీ 2024లో స్కూల్ అసిస్టెంట్‌గా నియమకమయ్యారు. ఎన్నికైన బోర్కుటే వెంకటేష్, పుదరి ప్రశాంత్‌లను గ్రామస్తులు సత్కరించి అభినందించారు. వారిని ఆదర్శంగా తీసుకొని గ్రామ, మండల యువకులు ప్రభుత్వ కొలువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, వెంకటేష్, మాజీ ఉప సర్పంచ్ సాయి కృష్ణ, ప్రశాంత్, అశోక్, పెంటయ్య, కాశయ్య, శంకర్, గోవింద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దవాగు అదనపు వంతెన నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని లగ్గాము గ్రామ శివారు, పెంచికల్‌పేట్ మండలాలకు మధ్యలో రూ.18 కోట్ల సీఆర్ఐఎఫ్ నిధులతో మంజూరైన పెద్దవాగుపై అదనపు వంతెన నిర్మాణానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ దహెగాం, పెంచుకల్‌పేట్ మండలాల ప్రజలకు అనుసంధానంగా ఉన్న పెద్దవాగు వంతెన అదనపు నిర్మాణం శుభసూచకమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆక్షించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి యజ్ఞంలో అందరూ భాగస్వాములు అయినప్పుడే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో డీఈ లక్ష్మీనారాయణ, కాంట్రాక్టర్ జగన్, ప్రవీణ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల అధ్యక్షులు మధుకర్, ధనుంజయ్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, ప్రభాకర్ గౌడ్, తిరుపతి గౌడ్, ఘనపురం నగేష్, దామోదర్, ధాము, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో సత్సంబందాలు ఏర్పడుతాయి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్



నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని గుస్సాని కబడ్డీ జట్టుకు రూ.16 వేల నగదుతో పాటు షీల్డును అందజేశారు. రెండవ బహుమతి తిర్యాణి జట్టుకు రూ.8వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహాభావం పెరుగుతుందని, ఆటల పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. అనంతరం కబడ్డీ పోటీల్లో పాల్గొన్న జట్లకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నులే నారాయణ, ప్రశాంత్, జమల్‌పూరి సుధాకర్, పెంటు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ డైట్ మైదానంలో ఘనంగా దసరా వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ అభివృద్ధే తన లక్ష్యమని అందుకోసం కష్టపడే ప్రతీ ఒక్కరికి తన సహాయ సహకారాలుంటాయని కేఎస్ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని డైట్ కాలేజీ గ్రౌండ్‌లో సనాతన హిందూ ఉత్సవ సమితి కేఎస్ఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన విజయదశమి వేడుకలకు హాజరయ్యారు. వేదిక ప్రక్కన ఏర్పాటు చేసిన శమీ చెట్టుకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవంతంగా వేడుకలు నిర్వహించిన సనాతన హిందూ ఉత్సవ సమితిని అభినందిస్తూ మున్ముందు జరపబోయే కార్యక్రమాలకు కూడా తన సహాయ సహకారాలుంటాయని తెలిపారు. అంతా కలిసి ఆదిలాబాద్ అభివృద్ధికి పాటు పడదామన్నారు. అనంతరం రావణుని విగ్రహం వద్ద దహన పూజలు గావించి, విగ్రహానికి నిప్పు పెట్టారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్ష,కార్యదర్శులు ప్రమోద్ కుమార్ ఖత్రి, గెడం మాధవ్, గౌరవాధ్యక్షులు వామన్, ఉపాధ్యక్షులు రవీందర్, ట్రెజరర్ సూర్యకాంత్, ఇతర కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆశమ్మ, లోక ప్రవీణ్‌రెడ్డి, పోరెడ్డి కిషన్, కౌన్సిలర్లు బండారి సతీష్, అర్చన రామ్ కుమార్, ఆవుల వెంకన్న పాల్గొన్నారు.

బుల్లాయి సంబరాలు ప్రారంభం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో దసరా పండుగ నుండి బుల్లాయి సంబరాలు ప్రారంభమయ్యాయి. మహిళలు ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా బుల్లాయి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. అందరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆటపాటలతో బుల్లాయి సంబరాలు జరుపుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది.

జిల్లా వ్యాప్తంగా ఘనంగా దసరా వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దసరా పండుగ వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం అంబరాన్నంటేలా సాగాయి. జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఆద్యంతం కనుల విందుగా జరిగాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి శిరీష్ శర్మ నిర్వహించిన శమీ వృక్ష పూజా కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకన్న పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో నిర్వహించే రావణ దహన కార్యక్రమానికి గాను శ్రీరాముని ఎంపిక కోసం నిర్వహించిన లక్కీ డ్రాలో స్థానిక రాయల్ టైలర్స్ యజమాని ఎంపిక కాక



ఆసిఫాబాద్



ఆసిఫాబాద్

రావణ దహనం చేశారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనగా బాణాసంచా పేల్చి విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వివేక్, గుండా వెంకన్న, రూప్నర్ రమేష్, సాయిని రాజశేఖర్, మధుకర్ పాల్గొన్నారు.

'థార్' విజేత కౌటాల వాసి

దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రాల్లోని శారద గణేష్ మండలి వద్ద నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 'థార్' వాహనానికి లక్కీ డ్రా నిర్వహించారు. విజేతను ఎంపిక చేయడానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలువేరు వెంకన్న, గంధం శ్రీనివాస్ హాజరై లక్కీ కూపన్లు తీశారు. కౌటాల మండల కేంద్రానికి చెందిన కుదురుపాక సురేష్(6180) లక్కీ డ్రా లో 'థార్' వాహన విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : విజయదశమి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో భాజ భజంత్రీలతో గ్రామస్తులు జమ్మి చెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జమ్మి ఆకు బంగారాన్ని ఒకరికి ఒకరు ఇచ్చుకొని దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మండలంలోని గ్రామాల్లో దేవీ నవరాత్రుల సందర్భంగా నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మండపాల వద్ద కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దహెగాం : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రావణుని దహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్

ముగిసిన బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-కౌటాల

దసరా, బతుకమ్మ సంబరాలు ఆదివారంతో ముగిసాయి. మండల వ్యాప్తంగా ఆదివారం దసరా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. సద్దుల బతుకమ్మ సంబరాలు కొన్ని గ్రామాల్లో గురువారం నిర్వహించుకోగా మరి కొన్ని గ్రామాల్లో శుక్ర, ఆదివారాల్లో జరుపుకున్నారు. మండలంలోని దన్నూరేటీ గ్రామంలో ఆదివారం నిర్వహించారు. దసరా పండుగ విజయదశమి వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొని జమ్మి చెట్టుకు పూజలు చేసి జమ్మి ఆకును ఒకరికొకరు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భారీ ఎత్తున జనం పాల్గొన్నారు.

దహెగాం : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎనిమిది రోజుల పాటు తీరొక్క పూలతో ఆడిపాడిన మహిళలు చివరి రోజైన సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ ఆటపాటలతో ఆడిపాడి స్థానిక చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

ఘనంగా ధమ్మచక్ర పరివర్తన్ దివస్ వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో 68వ ధమ్మ చక్ర పరివర్తన దివస్ వేడుకలు జై భీంసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జై భీమ్ సేన అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు అశోక్, సుధాకర్, రవిదాస్, నితిన్, శంకర్, సెంటర్ కమిటీ అధ్యక్షుడు దుర్గం హెక్టు, కృష్టాజి, తుకారాం, పెంటయ్య పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : బౌద్ధ కమిటీ ఆధ్వర్యంలో అశోక విజయ దశమి, 68వ ధమ్మచక్ర పరివర్తన దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా బుద్ధ వందన, అంబేద్కర్ విగ్రహం వద్ద పంచశీల జెండా ఆవిష్కరించారు. అంబేద్కర్ అందించిన 22 ప్రతిజ్ఞలు ప్రతి ఒక్కరు పాటించాలని మండల అధ్యక్షుడు నగరాడే రాజు సూచించారు. కార్యక్రమంలో తులసి రామ్, విక్రమ్, వసంత్, తిరుపతి, శ్రీనివాస్, సునీల్, జయంత్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్

వాంకిడి : మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో 68వ ధమ్మచక్ర పరివర్తన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌లో పంచశీల జెండాను ఆవిష్కరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జయరాం ఉప్రె, విలాస్, ప్రసాద్, సిద్ధార్థ యువజన సంఘం నాయకులు, రమాబాయి మహిళా మండలి నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



వాంకిడి



సిర్పూర్(టి)

ఆయుధ పూజలో జిల్లా పోలీసులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దసరా పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి పోలీస్ ఆయుధాలతో పాటు వాహనాలకు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ డీవీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రశాంతమైన, శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకొని మతసామరస్యానికి ప్రతీకగా నిలవాలన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగ నిర్వహించుకుంటామని తెలిపారు. ఎప్పటికైనా మంచి మార్గమే విజయానికి సోపానం అవుతుందన్నారు. జిల్లా ప్రజలకు పోలీస్ అధికారులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు పెద్దయ్య, అంజన్న, ఆర్ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా దుర్గామాత నిమజ్జనోత్సవం



నవతెలంగాణ-భైంసా

సమస్యాత్మక ప్రాంతమైన భైంసాలో ఆదివారం దుర్గామాత నిమజ్జ నోత్సవ వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం వేళ పురాణబజార్, భవాని చౌక్‌లలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ పూజలు నిర్వహించి, నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. మద్యం, మత్తుపానీయాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో భైంసాలో ఉత్సవాలు జరగడం శుభ పరిణామం అన్నారు. నిమజ్జనోత్సవాల్లో యువకుల నృత్యాలు, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాలనీ, భవానిచౌక్, గణేష్‌నగర్, పురాణా బజార్, తదితర ప్రాంతాల నుంచి గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు శోభయాత్ర చేరుకుంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. పలువురు సీఐలు, ఎస్సైలతో పాటు 300 మంది పోలీసు బలగాలు భద్రత చేపట్టాయి.

శివుని విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ మండలంలోని భీంసరి శ్మశానవాటికలో శివుని విగ్రహ ఏర్పాటుకు మాజీ ఎంపీటీసీ బిక్కి గంగాధర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తన సొంత నిధులతో శివుని విగ్రహం ఏర్పాటు చేస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీంసరి గ్రామస్తులు పాల్గొన్నారు.

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి



నవతెలంగాణ-ఉట్నూర్

విజయదశమి పండుగ సందర్భంగా ఖానాపూర్ ఎమ్మెల్యే భోజ్జు పటేల్ దంపతులు ఆయుధ పూజ చేశారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సవాల నడుమ ప్రశాంత వాతావరణంలో పండుగను ప్రజలు జరుపుకోవాలని, అందరూ సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో దసరా వేడుకలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో శనివారం దసరా పండగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జామిని చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలో తొడసం వంశస్థులు ఖాందేవునికి పూజలు, గాదిగూడ మండలంలోని కోలామ గ్రామంలో సీడాం వంశస్థులు దసరా పండుగను ఆదివాసి సంస్కృతి సాంప్రదాయం ప్రకారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తొడసం నాగోరావ్, తొడసం రాజు పటేల్, తేలంగ్ రావ్ పటేల్, బాపు రావ్ కటొడ, ఆనంద్ రావ్ కతొడ, మోతిరాం కటోడ, తోడసం గంగారాం, సీడాం వంశస్థులు సీడాం భీర్షావ్, జంగు, దేవ్ రావ్, లక్ష్మణ్, బాపురావ్, దేవ్ రావ్ పాల్గొన్నారు.

పొడగొట్టుకున్న ఫోన్ అందజేత

నవతెలంగాణ-జన్నారం



మండలం టీజేపల్లి గ్రామానికి చెందిన షేక్ మజార్ తన ఫోను మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ వాగు దగ్గర శనివారం పొడగట్టుకున్నాడు. ఆదేరోజు జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ లోపే మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన ఏరుగట్ల వెంకటేష్‌కు ఫోన్ దొరికింది. ఆయన ఆ ఫోన్‌ను తీసుకువచ్చి అదనపు ఎస్ఐ తానాజీ నాయక్ అప్పజెప్పారు. దీంతో షేక్ మజార్‌ను పిలిపించి ఆ ఫోను అప్పజెప్పి వెంకటేష్‌ను అభినందించారు.

9

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

సోమవారం | అక్టోబర్ 14, 2024 | www.navatelangana.com

పోలీస్‌స్టేషన్‌లో ఆయుధపూజ

నవతెలంగాణ-లక్షెట్టిపేట



విజయదశమిని పురస్కరించుకుని శనివారం లక్షెట్టిపేట పోలీసుస్టేషనులో సీఐ నరేందర్, ఎస్ఐ సతీష్ సిబ్బంది సమక్షంలో ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పురోహితుడు కొత్తపల్లి భరద్వాజ్ శర్మ ఆధ్వర్యంలో ముందుగా ఆయుధపూజ, అనంతరం వాహనాల పూజ, శమీ పూజ చేశారు. అనంతరం సీఐ, ఎస్ఐ పోలీస్ సిబ్బందికి దసరా శుభాకంక్షాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ-2 రామయ్యతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దసరా సంబరాలు

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలో శనివారం దసరా సంబరాలు అంబరాన్ని అంటాయి. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు విశ్వనాథ ఆలయంలోని అమ్మ వారి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. విగ్రహాలతో శమి చెట్టు వరకు ఊరేగింపుగా వెళ్లి గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన శమీ చెట్టుకు పూజ చేశారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుతో కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఏ భాస్కర్ పాల్గొన్నారు. జమ్మి చెట్టు కార్యక్రమం అనంతరం తిరిగి ఆలయాలకు చేరుకున్నారు. ఒక్కరు జమ్మి పెట్టుకుంటు దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దసరా సందర్భంగా ఎటువంటి అవంచానియా సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందొబస్తు ఏర్పాటు చేశారు.



మంచిర్యాల : జిల్లా కేంద్రంలో శమీ పూజలో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ దంపతులు

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ స్టేడియంలో ఏర్పాటు చేసిన రావణ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాణం సంధించి రావణ సూరిని విగ్రహాన్ని దహనం చేశారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనడంతో తిలక్ స్టేడియం జన సంద్రంగా మారింది నియోజక వర్గ ప్రజలకు వినోద్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా సందర్భంగా స్టేడియంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.



మంచిర్యాల : బెల్లంపల్లిలో దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్

లక్షెట్టిపేట : పట్టణంలో భక్తిశ్రద్ధలతో షమీ పూజతో పాటు దసరా వేడుకలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. జమ్మి గద్దె వద్ద ఏర్పాటు చేసిన మైదానంలో జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి చెట్టు ఆకులను తీసుకోవడానికి భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. జమ్మి ఆకులను ఒకరికొకరు తీసుకొని పంచుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దలు, యువకులు చిన్న పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జన్నారం : మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా పండగను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని పొనకల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో దుర్గామాత విగ్రహాన్ని ఊరేగింపు చేసి నిమజ్జనం చేశారు. అలాగే కావాలి చింతగూడ గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను డీజే సప్పులు డప్పు వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ సమీపాన ఉన్న వాగులలో నిమజ్జనం చేశారు. అనంతరం అన్ని గ్రామాలలో ప్రజలు ప్రజాప్రతినిధులు అధికారులు శమీ చెట్టుకు పూజలు చేసి ఆకు(బంగారాన్ని) తెంపుకొని ఒకరికి ఒకరు పెట్టుకుని అలాయ్ బలయ్ చేసుకున్నారు. యువకులు చిన్నారులు బంగారాన్ని చేతిలో పెడుతూ పెద్దవాళ్ల మొక్కి ఆశీస్సులు తీసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాండూర్ : మండలంలో విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో శమీ వృక్షాల దగ్గర పూజలు నిర్వహించి గ్రామస్తులు ఒకరికొకరు అలాయి తీసుకున్నారు. తాండూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కుమారస్వామి, ఎస్ఐ కిరణ్ కుమార్ సౌజన్యలు ఆయుధ పూజలు నిర్వహించారు. మాదారంలో శమీ పూజ కార్యక్రమంలో బెల్లంపల్లి జీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ కార్మిక నాయకులు పేరం శ్రీనివాస్, మాదారం ఎస్ఐ మానస గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత ఊరగింపు ఘనంగా సాగింది. బోయపల్లి, కాసిపేట తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీల ద్వారా బహుమతులను ఎంపిక చేశారు. మండలంలోని అచలాపూర్ తాండూర్లలో రావణాసురుని మహానకాండ నిర్వహించారు.

కాసిపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాపూర్, స్టేషన్ పెద్దనపల్లిలో రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమగూడెం భరత్ కాలనీ, కాసిపేట, ముత్యంపల్లి, పెద్దనపల్లి, కొండాపూర్, ధర్మారావుపేట, సోనాపూర్, దేవాపూర్, పల్లంగూడ, మల్కేపల్లి, కోమటిచేను తదితర గ్రామాల్లో జమ్మి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం ఒకరికి ఒకరు జమ్మి పెట్టుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దసరా సందర్భంగా ఆయా గ్రామాల్లో డీజే చప్పుల్లతో నృత్యాలు చేసి కుటుంబ సమేతంగా వేడుకలు జరుపుకున్నారు.



కాసిపేటలో శమీ చెట్టు ఆకులు తీసుకుంటున్న మహిళలు



నస్పూర్ : ఆర్కే-6 గనిలో శమీ పూజ నిర్వహిస్తున్న ఏరియా జీఎం సంజీవ్‌రెడ్డి దంపతులు



లక్షెట్టిపేటలో..



తాండూర్‌లో..

సర్వమానవ శ్రేయస్సే అశోక విజయ దశమి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

సర్వమానవ శ్రేయస్సు కోసమే అశోక విజయదశమి జరుపుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు కోరారు. శనివారం పట్టణంలో అశోక విజయదశమిని పురస్కరించుకొని అశోకుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళింగ యుద్ధం తర్వాత జరిగిన మానవ నష్టాన్ని చూసి చలించిన అశోకుడు తాను అహింస మార్గంలో ప్రయాణించిన రోజన్నారు. అహింస మార్గాన్ని ప్రపంచం మొత్తం చాటలని నిర్ణయం తీసుకున్నాడన్నారు. సర్వ మానవ సమానత్వం కోసం ప్రతి మనిషి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు భైరం లింగన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, పెండెం రాజశేఖర్, అలుగునూరి నరేష్ పాల్గొన్నారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-నస్పూర్



చెన్నూర్ మున్సిపల్ పరిధిలో సద్దుల బతుకమ్మ సంబరాలు శనివారం ఆడపడుచులు ఘనంగా నిర్వహించారు. పూల వేడుకల్లో ఆడపడుచులు ఉత్సహంగా పాల్గొన్నారు. యువతులు, చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. ప్రపంచమంతా పూలతో దేవుడిని పూజిస్తే ఆ పూలనే దేవుడిగా పూజించే బతుకమ్మ పండగ మన తెలంగాణ లోనే ఉంది. ఈ నెల 2న ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగిసింది. బతుకమ్మ సంబరాల్లో మొదటిరోజు నుండి బతుకమ్మను తీరొక్క పూలతో అలంకరించి బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. ఆడపడుచుల అతి పెద్ద పండుగ అయిన బతుకమ్మను గౌరమ్మగా కొలుస్తారు. మొదటిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభించి తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మతో ముగించారు. ఆడపడుచులు సద్దుల బతుకమ్మను ఆనందంతో జరుపుకోగా పురుషులు జమ్మికి వెళ్లి దసరా సంబరాల్లో పాల్గొన్నారు.

ఆర్కే గనిపై ఘనంగా దసరా వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియాలో గల ఆర్కే-6 గనిపై దసరా వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జమ్మి పూజా కార్యక్రమంలో ఏరియా జీఎం దంపతులు సంజీవరెడ్డి రాధా కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ దసరా పండగను తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా జరుపుకుంటారని అందులో భాగంగా ఆర్కే-6 గనిలో జరిగే జమ్మి పూజా కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య, గని ఏజెంట్ శ్రీధర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైద, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, గని మేనేజర్ ఈ తిరుపతి, గని రక్షణాధికారి కే శ్రీనివాస్, గని సంక్షేమ అధికారి సురేందర్, పిట్ కార్యదర్శి సంఘం సదానందం పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో జొన్నల సందడి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సాలేగూడ ఆదివాసీ గిరిజన గ్రామంలో దసరా పంటల సంధర్భంగా జొన్నల పంట వేశారు. దసరా నుండి కొనసాగింపు పంట జొన్నలు పోయటం ఆనవాయితీగా వస్తుండగా సందడిగా మారుతుంది. జొన్నలు, శనగ తదితర పంటలు ప్రత్యేకంగా వర్షం, మంచుతో ఆధారంగా పండించే విధంగా చూస్తామని, పంట ఎలాంటి మందులు పిచికారి లేకుండా వీలైతే దేవుని దగ్గరకి వెళ్లి పంట మంచిగా పండాలని మొక్కిన నీటిని తెచ్చి చల్లటం జరుగుతుందని ఆదివాసీలు తెలిపారు. జొన్నలను ప్రతి ఒక్కరు దేవుడికి మొదటగా నైవేద్యం పెడతామని, అలాగే అంబలి, జొన్న రొట్టె ఆరోగ్యానికి విటమిన్‌గా భావిస్తామన్నారు. అన్నం వండి తినడం, ఎడ్లకు, ఆవులకు చొప్ప ఉపయోగపడుతుందని, దీనిని ఆదివాసీ సాంప్రదాయాలలో జొన్నలను హణరాణి అని పిలవడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా ముగిసిన శారద దేవి ఉత్సవాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తొమ్మిది రోజులుగా పూజలు అందుకుంటున్న శారద దేవి నవరాత్రి ఉత్సవాలు జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు సాయంత్రం నిమజ్జనం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఆకట్టుకున్న బాపునగర్ వేడుకలు

పట్టణంలోని బాపునగర్ శారద గణేష్ మండలి వద్ద నవరాత్రి ఉత్సవాలు ఆకట్టుకునేలా ముగిసాయి. మహిళలు ఒకే రకమైన చీరలతో ప్రత్యేకమైన ఆకర్షణగా నిలవగా, పురుషులు కూడా ఒకే రకమైన దుస్తులు ధరించారు. మహిళలు చేసిన దాండియా నృత్యాలు ఆకర్షించాయి. నిమజ్జనం చేసే అమ్మవారి రథాన్ని అందంగా అలంకరించారు. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో పోలీసును డీజేకు అనుమతి ఇవ్వకపోవడంతో ప్రత్యేకంగా బ్యాండు ఏర్పాటు చేసి సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టి పడేలా నృత్యాలు చేశారు.

టీఎస్‌పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా మాసాడి శ్రీరాములు

నవతెలంగాణ-తాండూర్

టీఎస్‌పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మండలంలోని బోయపల్లికి చెందిన మాసాడి శ్రీరాములు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 7న జరిగిన టీఎస్‌పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాసాడి శ్రీరాములును రాష్ట్ర అసోషిమేట్ అధ్యక్షుడుగా ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంబపం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ హర్షం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర అసోషిమేట్ మహిళ అధ్యక్షురాలుగా తాండూరు మండలానికి చెందిన బి జయప్రద, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్‌రావు(తంగళ్లపల్లి) జడ్పీఎస్ఎస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ప్రదీప్(రేచిని) జడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయులు, ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

ముగిసిన దేవి నవ రాత్రులు

- భక్తి శ్రద్ధలతో దుర్గదేవి శోభయాత్ర



మంచిర్యాల : జిల్లా కేంద్రంలో దుర్గ దేవి నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజులుగా భక్తులు దుర్గ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నిమజ్జన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయం, గర్మిల్లా, పాత మంచిర్యాలతో పాటు పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన దుర్గ మాత విగ్రహాల శోభయాత్ర నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. విశ్వనాథ ఆలయం నుంచి వీధుల గుండా జరిగిన శోభయాత్రలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆదర్శ దంపతులకు ఘన సన్మానం

జన్నారం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆ గ్రామ ఆదర్శ దంపతులైన చిందం పోచయ్య సత్తవ్వలను ఆదివారం శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు సిందం చంద్రయ్య మాట్లాడుతూ పోశయ్య దంపతులు ఎంతో అన్యోన్యంగా ఉంటూ గ్రామంలో ఉన్న ప్రజలందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. తనకున్న ముగ్గురు కుమార్తెల వివాహాలు చేసి గ్రామంలో ఎలాంటి వివాదాలు లేకుండా సాధారణ జీవనం సాగించిన పుణ్య దంపతులు అన్నారు. నిరాడంబర జీవి కష్టజీవి ఎలాంటి వివాదాలకు పోనీ వ్యక్తి అన్నారు. తన పని తాను చేసుకుంటూ ఎదుటి వారికి సాయం చేసే గుణం కలిగిన పోచయ్య దంపతులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారికి జ్ఞాపకంగా వారి చిత్రపటాన్ని మెమొంటోగా చేయించి అందించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి సిందం శ్రీనివాస్ నాయకులు దాసరి వెంకటేష్, కమల శ్రీనివాస్, పురం శెట్టి లచ్చయ్య, వేముల నాగేష్, వేముల సత్యవ్వ, గుండ నరసయ్య, చిందం గోపాల్, కమల భూమయ్య, వేముల శంకరయ్య నీలం శేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పునరావాస కాలని రోడ్లు

- 60 ఫీట్ల రోడ్డు వద్ద అడ్డుగా ఫ్లెక్సీలు

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని నమ్నూర్, గుడిపేట్ పునరావాస కాలనీలో రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ప్రమాదం ఘంటికలు మోగుతున్నాయి. జాతీయ రహదారి నుంచి కాలనీ చివరి వరకు కిలోమీటర్ దూరం వుంటుంది. ఇందులో సీసీ రోడ్డు ఒక వైపు మాత్రమే వుండడంతో అటు నుంచి వచ్చే వారు సైతం సీసీ రోడ్డుపై నుండే రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామ పంచాయతీ రోడ్డు నం.3 వద్ద ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా రెండు వైపులా రోడ్డు వేయడం లేదనీ, ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు వేయడం లేదని రెండు కాలనీల ప్రజలు వాపోతున్నారు. కాలనీ వెనుకాల వున్న ఎరువుల గోదాం ఉండడంతో నిత్యం పదుల సంఖ్యలో లారీలు నడుస్తున్నాయి. ఇరుకు రోడ్లపై హెవీ లోడ్ లారీలు రావడంతో రోడ్లు చెడిపోవడమే కాకుండా దుమ్ము దూలీ ఇళ్లలోకి వస్తుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లారీలు పోకుండా ఆపుతున్న కానీ అప్పటి వరకు లారీలు ఆపి మళ్ళీ యధాతధంగా నడుస్తున్నాయి.

అడ్డుగా ఫ్లెక్సీలు..

ఈ రెండు కాలనీలు 63వ జాతీయ రహదారి పక్కనే వుంటాయి. 60 ఫీట్ల రోడ్డు ప్రారంభంలో ఫ్లెక్సీలు కడుతుంటారు. ఈ ఫ్లెక్సీలు రోజుల తరబడి అలానే ఉంచుతారు. ఆ ఫ్లెక్సీ లతో రహదారిపై నుండి వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ ఫ్లెక్సీల వెనుక నమ్నూర్ అంగడి బజార్ వద్ద రోడ్డుపై చెట్లు పెరగడంతో వాహనాల రాక గమనించక వాహనదారులు రోడ్డుపైకి వస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఫ్లెక్సీలు రోజుల తరబడి ఉంచకుండా, రోడ్డు పక్కన పెరిగిన చెట్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుండా మల్లేష్ సేవలు మరువలేనివి




నవతెలంగాణ-తాండూర్

సీపీఐ శాసనసభ పక్ష నేత దివంగత మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ సేవలు మరువలేనివని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ అన్నారు. ఆదివారం మండలంలోని భగత్‌సింగ్ భవన్‌లో గుండా మల్లేష్ నాలుగవ వర్ధంతిని సీపీఐ ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కొండు బానేష్ మాట్లాడుతూ మండలంలోని రేచని గ్రామంలో జన్మించిన మల్లేష్ సీపీఐ నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని తెలిపారు. 1967-1968లో బెల్లంపల్లిలో లారీ ట్రాన్స్ పోర్ట్‌లో క్లీనర్ కమ్ డ్రైవరుగా పని చేసి లారీ డ్రైవర్ల అసోసియేషన్‌కు నాయకత్వం వహించారన్నారు. సింగరేణి కార్మికుడిగా పని చేసిన మల్లేష్ కార్మికుల సంక్షేమానికి పాటుపడుతూ, స్థానికపేదల కోసం భూపోరటాలు చేశారని తెలిపారు. 1972లో సీపీఐ పార్టీలో చేరిన మల్లేష్ ఉద్యమాలే ఊపిరిగా పని చేశారన్నారు. తొలి సారి 1978లో అసిఫా బాద్ నియోజక వర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయినప్పటికీ 1983-1985-1994ఎన్నికల్లో విజయం సాధించారని వివరించారు. కొత్తగా ఏర్పడిన బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి 2009లో గెలుపొందినట్లు తెలిపారు. శాసన సభ పక్ష నేతగా తెలంగాణ వాణిని శ్రీకృష్ణ కమిటీ ముందు డిల్లీలో బలంగా వినిపించారని పేర్కొన్నారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి నియోజకవర్గంలోని పేద ప్రజల బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అసంఘటిత-సంఘటిత కార్మికుల శ్రేయస్సుకోసం గుండా మల్లేష్ చేసిన కృషి మరవరానిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కోడిపాక భాస్కర్, ఇందారపు రాజేష్, వసాల నాగరాజు, మిట్ట శ్రీనివాస్, మలిశెట్టి సత్యనారాయణ, జహంగీర్, కొండుసాయి కుమార్, చదువుల దుర్గమ్మ, కరవెన కళ వతి, శంకర్, ఠాకూర్ శ్యామ్ సింగ్, సత్తయ్య, కంబాల రామయ్య, సంతోష్, గొగర్ల అంజి, కంబాల చందు పాల్గొన్నారు.

నవచిత్రం

రామ్‌చరణ్ కోసం..




చిరంజీవి

చిరంజీవి నటిస్తున్న సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర'. వశిష్ట దర్శకత్వంలో యువీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం నుంచి దసరా సందర్భంగా టీజర్‌ని లాంచ్ చేశారు. సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని భారీస్థాయిలో రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. అయితే రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' రిలీజ్ కోసం ఈ సినిమా విడుదలని వాయిదా వేశారు.

ఈ సందర్భంగా నిర్మాత విక్రమ్ మాట్లాడుతూ,"విశ్వంభర' ఎప్పుడు వస్తే అప్పుడే పండగ. రామ్ చరణ్ కోసం దిల్ రాజు అడగడంతో 'విశ్వంభర' విడుదల వాయిదా వేశాం. సినిమా షూటింగ్ కూడా అనుకున్న ప్రకారమే పూర్తయింది' అని అన్నారు.

'టీజర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. సినిమా ఆల్మోస్ట్ కంప్లీట్ అయిపోయింది. ఒక సాంగ్ బ్యాలెన్స్ ఉంది. అది త్వరలోనే చేస్తాం. చాలా బిగ్ స్కేల్ ఉన్న సినిమా ఇది. చిరంజీవితో వర్క్ చేయడం చాలా ఎగ్జైటింగ్ ఫీలింగ్. ప్రేక్షకులు, అభిమానులు అంచనాలు మించేలా 'విశ్వంభర' ఉంటుంది' అని దర్శకుడు వశిష్ట తెలిపారు.

ఈశ్వర్ రీ-రిలీజ్‌కి రెడీ



ప్రభాస్

హీరో ప్రభాస్ 'ఈశ్వర్' మూవీతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ప్రభాస్ బర్త్ డే సందర్భంగా ఈశ్వర్ మూవీని రీ-రిలీజ్ చేయనున్నారు. ఈనెల 23న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. ఈ నేపథ్యంలో మూవీ ట్రైలర్‌ను అదిరిపోయేలా కట్ చేసి రిలీజ్ చేశారు. రీ ఇంట్రడ్యూసింగ్ ప్రభాస్ అంటూ విడుదలైన ఈ ట్రైలర్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది.

'నీ చేతిలో డబ్బుంటే.. నా ఛాతిలో దమ్ముంది' అంటూ ప్రభాస్ చెప్పిన మాస్ డైలాగ్స్, యాక్షన్ సీక్వెన్స్, కామెడీ, రొమాంటిక్ సాంగ్స్ ఇలా అన్నింటినీ ట్రైలర్‌లో పొందు పర్చారు. ఈ మూవీని జయంత్ సీ పరాన్జీ తెరకెక్కించారు. కె.అశోక్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని లక్ష్మీ నరసింహా మూవీస్ సంస్థ రీ- రిలీజ్ చేస్తోంది. ప్రస్తుతం ప్రేక్షకులు, ఆయా హీరోల అభిమానులు రీ-రిలీజ్‌లను ఓ పండుగలా సెలెబ్రేట్ చేసుకుంటున్నారు. ఇక ఇప్పుడు ప్రభాస్ బర్త్ డేని కూడా 'ఈశ్వర్' రీ-రిలీజ్‌తో గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేసుకునేందుకు ఆయన ఫ్యాన్స్ రెడీగా ఉన్నారు. అయితే ప్రభాస్‌కి ఇప్పుడు పెరిగిన ఫాలోయింగ్, ఫాలోవర్లకు తగ్గట్టుగా 'ఈశ్వర్'ను భారీ స్థాయిలో రీ-రిలీజ్ చేస్తున్నారు. వింటేజ్ ప్రభాస్ మేనియాను డార్లింగ్ ఫ్యాన్స్ అంతా ఇప్పుడు ఈశ్వర్ 4కే సెలెబ్రేట్ చేసుకోబోతోన్నారు అని లక్ష్మీ నరసింహా మూవీస్ అధినేత తెలిపారు.

వాటికి మించి సీజన్ 4



బాలకృష్ణ మోస్ట్ ఎవైటెడ్ అన్‌స్టాపబుల్ సీజన్ 4ను ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్ శనివారం అనౌన్స్ చేసింది. వ్యాఖ్యాతగా బాలకృష్ణను ప్రజెంట్ చేసే అద్భుతమైన ఫస్ట్‌లుక్, 3డీ యానిమేటెడ్ ప్రోమోని లాంచ్ చేసింది.

అల్లు అరవింద్ (ఆహా డైరెక్టర్), అనిల్ రావిపూడి (డైరెక్టర్), తేజస్విని నందమూరి (అన్‌స్టాపబుల్ క్రియేటివ్ ప్రొడ్యూసర్), అజిత్ ఠాకూర్ (ఆహా డైరెక్టర్), రవికాంత్ సబ్బవిస్ (ఆహా సిఇఓ), రాజీవ్ చిలక (గ్రీన్ గోల్డ్ యానిమేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్) సహా పలువురు ప్రముఖులు ఈ ఈవెంట్‌లో పాల్గొన్నారు.

బాలకృష్ణ మాట్లాడుతూ, 'అన్‌స్టాపబుల్ మొదలవ్వడమే ఒక విస్ఫోటనం. నాన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ఈ ప్రోగ్రామ్ చేశాను. ఈ షో కూడా వేరే ఎవరైనా అడిగి ఉంటే చేసేవాడిని కాదు. కేవలం అరవింద్ కోసమే అంగీకరించా. మా టీమ్ కష్టానికి ఫలితమే అన్‌స్టాపబుల్ సక్సెస్. ఐఎండీబీ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఈ షో 18వ స్థానంలో ఉంది. మన దేశంలోనే రీజినల్ లాంగ్వేజ్‌లో నెంబర్ వన్ షోగా నిలిచింది. ఎంతో మంది హీరోలు, దర్శకులు, ప్రొడ్యూసర్లు మొదటి మూడు సీజన్స్‌కి వచ్చి, వాళ్ళ మనసుల్లో మాటని ఎంతో ఓపెన్‌గా పంచుకున్నారు. ఈ షో విజయంలో వారి పాత్ర కూడా ఉంది. నా చిన్న కూతురు తేజస్విని క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఈ షోలో భాగం కావడం ఆనందంగా ఉంది. 'అన్‌స్టాపబుల్ మూడు సీజన్లు సక్సెస్ అయ్యాయి. అందుకే సీజన్-4 కొత్తగా అందించాలన్న ఉద్దేశంతో యానిమేషన్ రూపంలో ట్రైలర్ తీసుకొచ్చారు. సీజన్ 4 చాలా అద్భుతంగా వస్తుంది' అని అన్నారు.

సర్‌ప్రైజ్ చేసే.. డియర్ కృష్ణ



పీఎన్ బీ సినిమాస్ బ్యానర్ పై తెరకెక్కుతున్న యూత్‌ఫుల్ ఎంటర్ టైనర్ 'డియర్ కృష్ణ'. పీఎన్ బలరామ్ రచయితగా, నిర్మాతగా ఈ సినిమా ద్వారా పరిచయం అవుతున్నారు. ఈ కథకు దినేష్ బాబు డైలాగ్స్, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించారు.

అక్షయ్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో 'ప్రేమలు' చిత్ర ఫేమ్ మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఐశ్వర్య కూడా మరో హీరోయిన్‌గా కనిపించనున్నారు.

రియల్ ఇన్సిడెంట్స్‌ను ప్రేరణగా తీసుకొని పీఎన్ బలరామ్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రాసుకున్నారు. హృదయాన్ని బరువెక్కించే ఓ విషాద సంఘటన, శ్రీకృష్ణుడిని నమ్మే ఒక భక్తుడు ఆ భారం అంతా ఆయనపై వేశారు. డాక్టర్లు కూడా ఏం చేయలేమన్న పరిస్థితుల్లో ఒక మిరాకిల్ జరిగింది. ఇలాంటి అద్భుతమైన ఇతివృత్తంతో, నమ్మలేని నిజాలు కాదు ఎవరూ ఊహించలేని స్క్రీన్‌ప్లే రాసిన ఆ భగవంతుడు శ్రీ కృష్ణుని దయతోనే ఈ సినిమా నిర్మించినట్లు నిర్మాత పీఎన్ బలరామ్ పేర్కొన్నారు. ఈ చిత్రం ఎంతో మందికి స్ఫూర్తిగా ఉంటుంది అని, అలాగే యూత్‌ను

ఆశ పడితే.. అంతే



విష్ణు వంశీ, రియ కపూర్

శ్రీ కృష్ణ మూవీస్ బ్యానర్ పై కటకం వెంకటేశ్వర్లు సమర్పణలో విష్ణు వంశీ, రియా కపూర్ హీరో, హీరోయిన్లుగా దర్శకుడు ఎంఆర్ దీపక్ రూపొందిస్తున్న సినిమా 'పెన్ డ్రైవ్'.

కె. రామకృష్ణ నిర్మాత. బుజ్జి బొగ్గారపు సహ నిర్మాత. నేటితరం ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా సమకాలీన కథా కథనాలతో తెరకెక్కనున్న ఈ సినిమా ఈ రోజు పలువురు సినీ ప్రముఖుల ఆధ్వర్యంలో ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సాయి కుమార్ క్లాప్ నివ్వగా, నిర్మాత టి. రామసత్యనారాయణ ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. మరో నిర్మాత కె రామకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేశారు.

దర్శకుడు ఎంఆర్ దీపక్ మాట్లాడుతూ, 'ఇంటర్నెట్, సోషల్ మీడియాలో ఉచితంగా వచ్చే దేనికీ ఆశపడకూడదు. అలా ఆశపడితే ఇబ్బందులు పడతారనే అంశాన్ని చూపిస్తున్నాం. ఈ నెల 22వ తేదీ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి నాలుగు షెడ్యూల్స్‌లో సినిమా పూర్తి చేస్తాం' అని తెలిపారు. 'మంచికి మాత్రమే టెక్నాలజీని ఉపయోగించాలనే సందేశాన్ని ఈ చిత్రంలో చెబుతున్నాం. మంచి కాన్సెప్ట్‌తో ఉన్న సినిమా' అని నిర్మాత కె రామకృష్ణ అన్నారు.

పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా దో కమీనే

దర్శకుడు వి.సముద్ర వారసులు అరుణ్ మహాశివ, రామ్ త్రివిక్రమ్ హీరోలుగా 'దో కమీనే' సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. హారిక సమర్పణలో చందు క్రియేషన్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ చంద్ర పులుగుజ్జు నిర్మిస్తున్నారు. సముద్ర దర్శకత్వం వహిస్తున్నారు. తస్మయి, శ్రీ రాధ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.

ముహూర్తపు సన్నివేశానికి సుమన్ క్లాప్ నివ్వగా, దర్శకులు బి.గోపాల్ ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. హీరో శ్రీకాంత్ స్క్రిప్ట్ అందించారు. నందమూరి మోహనకృష్ణ కెమెరా స్విచ్చాన్ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ వి.సముద్ర మాట్లాడుతూ, 'పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నాం. 'షోలే', 'ఆర్‌ఆర్‌ఆర్' కలిపితే ఎలా ఉంటుందో అలాంటి సినిమా ఇది. నా మిత్రుడు చంద్ర ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తున్నారు. నవంబర్ 3వ వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. మా మూవీ రిలీజ్ అయ్యాక దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంటుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. 'మా చంద్ర క్రియేషన్స్ బ్యానర్‌లో ఈ సినిమాను ఘనంగా లాంచ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. సముద్ర దర్శకత్వంలో ఒక మంచి మూవీతో మీ ముందుకు రాబోతున్నాం' అని నిర్మాత చంద్ర పులుగుజ్జు చెప్పారు.



అరుణ్ మహాశివ, తస్మయి, రామ్ త్రివిక్రమ్

హీరోలు రామ్ త్రివిక్రమ్, అరుణ్ మహాశివ మాట్లాడుతూ,'నాన్న దర్శకత్వంలో నటించాలనేది మా డ్రీమ్. ఆ కల ఇంత త్వరగా నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది. అందుకు మా ప్రొడ్యూసర్ చంద్రకి థ్యాంక్స్ చెబుతున్నాం. త్వరలోనే ఒక మంచి చిత్రంతో మీ ముందుకు వస్తాం' అని అన్నారు.

సరికొత్త పాయింట్‌తో.. నా నిరీక్షణ

పికాక్ మూవీ మేకర్స్ బ్యానర్ పై పి.సంతోష్‌రెడ్డి నిర్మాణంలో అమర్ దీప్ హీరోగా, లిషి గణేష్ కల్లపు హీరోయిన్‌గా సాయివర్మ దాట్ల దర్శకత్వంలో రాబోతోన్న చిత్రం 'నా నిరీక్షణ'. దసరా సందర్భంగా ఈ చిత్ర పూజా కార్యక్రమాలు నిర్మాత సురేష్ బాబు ఆశీస్సులతో గ్రాండ్‌గా జరిగాయి.

ముహూర్తపు సన్నివేశానికి దిల్ రాజు క్లాప్ కొట్టగా, రాజా రవీంద్ర స్క్రిప్ట్ అందజేశారు. నిర్మాత గణపతి రెడ్డి కెమెరా స్విచాన్ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ సాయి వర్మ దాట్ల మాట్లాడుతూ, 'సినిమా కథ గురించి ఇప్పుడే చెప్పలేను. అయితే ఓ మంచి చిత్రాన్ని మాత్రం తీస్తున్నానని కచ్చితంగా చెప్పగలను' అని అన్నారు.

'హీరోగా ఇది నా రెండో చిత్రం. బిగ్ బాస్ తరువాత సెలెక్ట్ చేసుకున్న ఫస్ట్ స్క్రిప్ట్ ఇది. నన్ను నమ్మి ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని అమర్ దీప్ చెప్పారు.

లిషి గణేష్ కల్లపు మాట్లాడుతూ, 'ఇది నా రెండో చిత్రం. కథాకథనాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. సరికొత్త పాయింట్‌తో ఈ సినిమా ఉంటుంది. ఈ



సినిమాలో ఓ మంచి పాత్ర చేస్తున్నా. ఇంత మంచి పాత్రను ఇచ్చిన మేకర్స్‌కు ధన్యవాదాలు' అని అన్నారు. అమర్‌దీప్ చౌదరి, చైతన్య వర్మ, లిషి గణేష్ కల్లపు, రమ్య ప్రియ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత : పి.సంతోష్ రెడ్డి, కథ-స్క్రీన్ ప్లే-దర్శకత్వం :సాయి వర్మ దాట్ల, మాటలు : తిరుమలేష్ బండారు, కెమెరామెన్ : వి.రవి కుమార్, సంగీత దర్శకుడు : శేఖర్ చంద్ర.

కుప్పలు తెప్పలు

ఎస్సీ కమిషన్ వద్ద 47 వేల ఫిర్యాదులు

- వేధింపులు, భూ వివాదాలకు సంబంధించినవే అధికం
- సగానికి పైగా యూపీ నుంచే
- ఆరు రాష్ట్రాల్లోనే 81 శాతం నమోదు



(ఫైల్)

న్యూఢిల్లీ : 2020 నుంచి ఇప్పటి వరకూ జాతీయ ఎస్సీ కమిషన్ (ఎన్సీఎస్సీ) వద్ద 47 వేల ఫిర్యాదులు పెండింగులో ఉన్నాయి. 2020-21 లో 11,917, 2021-22లో 13,964, 2022- 23లో 12,402 ఫిర్యాదులు నమోదయ్యాయని, ఈ ఏడాది ఇప్పటి వరకూ 9,550 ఫిర్యాదులు వచ్చాయని ఎన్సీఎస్సీ తెలిపింది. ఆర్‌టీఐ కింద పీటీఐ వార్తా సంస్థ ఇచ్చిన దరఖాస్తుకు స్పందనగా ఎస్సీ కమిషన్ ఈ వివరాలు అందజేసింది. వేధింపులు, భూ వివాదాలు, ప్రభుత్వ రంగాల్లో సేవలకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు అందాయని ఎన్సీఎస్సీ చైర్‌పర్సన్ కిషోర్ మక్వానా పీటీఐ వార్తా సంస్థకు తెలియజేశారు.

ఫిర్యాదులపై వేగవంతంగా చర్యలు తీసుకోవడానికి వీలుగా వచ్చే నెల నుంచి తాను కానీ లేదా కమిషన్ సభ్యులు కానీ రాష్ట్ర కార్యాలయాలను సందర్శిస్తామని, అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తామని మక్వానా చెప్పారు. తాను వారానికి నాలుగు రోజులు విచారణలు నిర్వహిస్తున్నానని, ప్రజలను కలిసి వారి సమస్యలు వింటానని తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి తమ కార్యాలయం తలుపులు ప్రజలకు తెరిచే ఉంచామని చెప్పుకొచ్చారు.

హెల్ప్‌లైన్‌కు లక్షలాది కాల్స్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి అధిక ఫిర్యాదులు అందాయని కమిషన్ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. కమిషన్‌కు ప్రతి రోజూ రెండు మూడు వందలు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిలో చాలా వరకూ రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తున్నామని ఆయన తెలిపారు. ఏ ఒక్క ఫిర్యాదును వదిలేయడం లేదని, అవన్నీ పరిశీలనలోనే ఉన్నాయని అన్నారు. కాగా జాతీయ హెల్ప్‌లైన్ ప్రకారం వేధింపులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీల నుంచి 6,02,177 కాల్స్ వచ్చాయి. వీటిలో 5,843 ఫిర్యాదులు ఉండగా 1,784 పరిష్కారమయ్యాయి. ఉత్తరప్రదేశ్ నుంచే సగానికి పైగా... అంటే 3,10,623 కాల్స్ వచ్చాయి. ఈ హెల్ప్‌లైన్‌ను సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తోంది.

ఆ ఆరు రాష్ట్రాలలోనే ఎక్కువ


ఎస్సీ, ఎస్టీల (వేధింపుల నిరోధక) చట్టం కింద ప్రభుత్వ తాజా నివేదిక ప్రకారం ఎస్సీలపై 13 రాష్ట్రాలలో అత్యధికంగా వేధింపులు జరుగుతున్నాయి. 2022లో వచ్చిన మొత్తం కేసుల్లో ఈ రాష్ట్రాలకు చెందినవే 97.7 శాతం ఉండడం గమనార్హం. ఈ చట్టం కింద 2022లో నమోదైన 51,656 కేసులలో యూపీ నుంచి అత్యధికంగా 12,287 (23.78 శాతం) వచ్చాయి. 8,651 కేసులతో (16.75 శాతం) రాజస్థాన్ రెండో స్థానంలో, 7,732 కేసులతో (14.97 శాతం) మధ్యప్రదేశ్ మూడో స్థానంలో ఉన్నాయి. కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో బీహార్ (6,799-13.16 శాతం), ఒడిషా (3,576-6.93 శాతం), మహారాష్ట్ర (2,706-5.24 శాతం) ఉన్నాయి. మొత్తం కేసుల్లో ఈ ఆరు రాష్ట్రాల్లోనే 81 శాతం నమోదయ్యాయి.

గౌరీ లంకేశ్ హత్య కేసులో...

నిందితులకు హిందూత్వశక్తుల సన్మానం

బెంగళూరు : జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య కేసులో కీలక నిందితులైన పరశురామ్ వాఘ్‌మోర్, మనోహర్ యదావేలను హిందూత్వ శక్తులు బెంగళూరులో సన్మానించాయి. బెంగళూరు సెంట్రల్ జైలు నుంచి విడుదలైన తర్వాత వారిద్దరినీ శుక్రవారం సన్మానించారు. నిందితులకు ఈ నెల 9న ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఇరువురు నిందితులు తమ స్వస్థలమైన విజయపురా చేరుకున్న తర్వాత సంఘ్ పరివార్, శ్రీరామ సేన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఆదివారం వైరల్ అయ్యాయి.

విజయపురా చేరుకున్న తర్వాత నిందితులు కాళీమాత ఆలయంలో ప్రార్థనలు చేశారు. సంఘ్ పరివార్, శ్రీరామ సేన సభ్యులు వారిని పూలమాలలతో సత్కరించారు. నగరంలోని శివాజీ సర్కిల్‌లో ఉన్న శివాజీ విగ్రహానికి కూడా వారు పూలమాలలు వేశారు. బెంగళూరులోని తన నివాసం ఎదుట గౌరీ లంకేష్‌ను దుండగులు 2017 సెప్టెంబర్ ఐదవ తేదీన కాల్చి చంపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 25 మందిని అరెస్ట్ చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకూ 18 మందికి బెయిల్ లభించింది.



(ఫైల్)

గౌరీ లంకేష్ హత్య కేసులో నిందితులను హిందూత్వ సంస్థలు, బీజేపీ మద్దతుదారులు సన్మానించడం ఇది మొదటిసారి కాదు. ఈ సంవత్సరం ఆగస్టులో బీజేపీ మాజీ ఎంపీ ప్రతాప్ సింగ్ నిందితుడైన నవీన్ ఇంటికి వెళ్లి అతనిని సన్మానించారు. లంకేశ్ హంతకులకు బెయిల్ లభించడంతో బీజేపీ నేతలు ఆనందంతో సంబరాలు జరుపుకోవడంపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.



ఆటలు

రికార్డుల దసరా

సంజు శాంసన్, సూర్య విశ్వరూపం

• ఉప్పల్‌లో భారత్ రికార్డు స్కోరు • 3-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్

25 సిక్సులు, 22 ఫోర్లు.. దసరా ధమాకాతో ఉప్పల్ స్టేడియం ఊగిపోయింది. పరుగుల సునామీతో ఉప్పల్ ఓ సంద్రాన్ని తలపించింది. సంజు శాంసన్, సూర్యకుమార్ యాదవ్ వీర విహారం చేయటంతో బంగ్లాదేశ్ బౌలర్లు చేతులెత్తేశారు. విధ్వంసక ఇన్నింగ్స్‌లకు సరికొత్త నిర్వచనం ఇస్తున్నట్టు బాదిన సంజు, సూర్య టీ20 ఫార్మాట్‌లో రెండో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా భారత్‌ను నిలిపారు. సంజు శతకం, సూర్య అర్ధ సెంచరీతో భారత్ తొలుత 297 పరుగుల ఆల్‌టైమ్ రికార్డు స్కోరు సాధించగా.. ఛేదనలో బంగ్లాదేశ్ 164 పరుగులే చేసింది. మూడు మ్యాచుల టీ20 సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది.

నవతెలంగాణ-హైదరాబాద్

పొట్టి ఫార్మాట్‌లో టీమ్ ఇండియా అదరగొట్టింది. గౌతం గంభీర్, సూర్యకుమార్ యాదవ్ కాంబినేషన్‌లో టీమ్ ఇండియా వరుసగా ఆరు మ్యాచుల్లో విజయాలు సాధించింది. శ్రీలంకపై 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన భారత్.. తాజాగా బంగ్లాదేశ్‌పై సైతం 3-0తో క్లీన్‌స్వీప్ విజయం సాధించింది. వరుసగా మూడో మ్యాచ్‌లో ఏకపక్ష విజయం సాధించిన భారత్.. హైదరాబాద్‌లో రికార్డులను తిరగరాసింది. సంజు శాంసన్ (111, 47 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సులు) సెంచరీతో చెలరేగగా.. సూర్యకుమార్ యాదవ్ (75, 35 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సులు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో వీర విహారం చేశాడు. రియాన్ పరాగ్ (34, 13 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సులు), హార్దిక్ పాండ్య (47, 18 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) ధనాధన్ ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. బ్యాటర్ల మెరుపు విన్యాసాలతో భారత్ తొలుత 20 ఓవర్లలో 6 వికెట్లకు 297 పరుగుల రికార్డు స్కోరు చేసింది. ఛేదనలో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 164 పరుగులే చేసింది. తౌహిద్ హృదయ్ (63, 42 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు), లిటన్ దాస్ (42, 25 బంతుల్లో 8 ఫోర్లు) రాణించారు. స్పిన్నర్ రవి బిష్ణోయ్ (3/30), మయాంక్ యాదవ్ (2/32) బంతితో మెరిశారు. 133 పరుగుల తేడాతో మూడో టీ20లో విజయం సాధించిన టీమ్ ఇండియా.. 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. శతక వీరుడు సంజు శాంసన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా.. ఆల్‌రౌండ్ షోతో హార్దిక్ పాండ్య 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.

సంజు శతక విహారం

టాస్ నెగ్గిన తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఓపెనర్ అభిషేక్ శర్మ (4) వికెట్‌ను ఆరంభంలోనే కోల్పోయింది. కానీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (75) జతగా సంజు శాంసన్ (111) విశ్వరూపం చూపించాడు. 8 ఫోర్లు, 2 సిక్సులతో 22 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన సంజు.. ఆ తర్వాత వాయువేగంతో పరుగులు పిండుకున్నాడు. ఇన్నింగ్స్ 9వ ఓవర్లో రిషద్ హుస్సేన్‌పై సంజు సిక్సర్ల సునామీ సృష్టించాడు. తొలి బంతికి పరుగు చేయని సంజు.. ఆ తర్వాత వరుసగా ఐదు బంతుల్లో ఐదు సిక్సర్లు కొట్టాడు. ఈ ఓవర్లో 30 పరుగులు పిండుకున్న సంజు..40 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. మరో ఎండ్‌లో సూర్యకుమార్ యాదవ్ 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఈ ఇద్దరికి తోడు రియాన్ పరాగ్, హార్దిక్ పాండ్య సైతం దంచికొట్టడంతో భారత్ 297 పరుగుల రికార్డు స్కోరు చేసింది. బౌండరీల రూపంలోనే భారత్ 232 పరుగులు పిండుకుని సరికొత్త రికార్డును నమోదు చేసింది.

బంగ్లా చతికిల

రికార్డు ఛేదనలో బంగ్లాదేశ్ చతికిల పడింది. భారత బౌలర్లు సమిష్టిగా రాణించటంతో బంగ్లా బ్యాటర్లు తేలిపోయారు. పర్వేజ్ హుస్సేన్ (0) డకౌట్ కాగా.. హసన్ (15), నజ్ముల్ (14)లు ఆరంభంలోనే నిష్క్రమించారు. లిటన్ దాస్ (42, 25 బంతుల్లో 8 ఫోర్లు), తౌహిద్ హృదయ్ (63, 42 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) అర్ధ సెంచరీతో బంగ్లాదేశ్‌కు గౌరవప్రద స్కోరు అందించాడు. గమ్యం లేని ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు కోల్పోయిన బంగ్లాదేశ్ 164 పరుగులు చేసింది. మయాంక్ యాద్ రెండు వికెట్లు పడగొట్టగా..రవి బిష్ణోయ్ 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్ : సంజు (సి) మెహిది (బి) ముస్తాఫిజుర్ 111, అభిషేక్ (సి) మెహిది (బి) హసన్ షకిబ్ 4, సూర్య (సి) రిషద్ (బి) మహ్మదుల్లా 75, రియాన్ పరాగ్ (సి) దాస్ (బి) టస్కిన్ 34, హార్దిక్ పాండ్య (సి) రిషద్ (బి) హసన్ షకిబ్ 47, రింకూ సింగ్ నాటౌట్ 8, నితీశ్ (సి) మెహిది (బి) హసన్ షకిబ్ 0, వాషింగ్టన్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 17, మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 297.

వికెట్ల పతనం : 1-23, 2-196, 3-206, 4-276, 5-289, 6-289.

బౌలింగ్ : మెహిది హసన్ 4-0-45-0, టస్కిన్ 4-0-51-1, హసన్ షకిబ్ 4-0-66-3, ముస్తాఫిజుర్ 4-0-52-1, రిషద్ 2-0-46-0, మహ్మదుల్లా 2-0-26-1.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ : పర్వేజ్ (సి) పరాగ్ (బి) మయాంక్ 0, హసన్ (సి) వరుణ్ (బి) వాషింగ్టన్ 15, నజ్ముల్ (సి) సంజు (బి) బిష్ణోయ్ 14, దాస్ (సి) తిలక్ (బి) బిష్ణోయ్ 42, హృదయ్ నాటౌట్ 63, మహ్మదుల్లా (సి) పరాగ్ (బి) మయాంక్ 8, మెహిది హసన్ (సి) పరాగ్ (బి) నితీశ్ 3, రిషద్ (సి) అభిషేక్ (బి) బిష్ణోయ్ 0, హసన్ షకిబ్ నాటౌట్ 8, ఎక్స్‌ట్రాలు : 11, మొత్తం : (20 ఓవర్లలో 7 వికెట్లకు) 164.

వికెట్ల పతనం : 1-0, 2-35, 3-59, 4-112, 5-130, 6-138, 7-139.

బౌలింగ్ : మయాంక్ 4-0-32-2, హార్దిక్ 3-0-32-0, వాషింగ్టన్ 1-0-4-1, నితీశ్ 3-0-31-1, రవి 4-1-30-3, వరుణ్ 4-0-23-0, అభిషేక్ 1-0-8-0.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.